# విజయకేతనం

ఎడిటర్ : విశ్వనాధుల నరసింహాచారి

తెలుగు మాసపత్రిక

సంపుటి : 14 సంచిక : 10 సెప్టెంబర్ - 2025 పేజీలు : 64+4 వెల : 10/-



స్వదేశీ ఉత్పత్తులనే వాడుదాం .. ఆర్థికంగా మరింత రాణిద్దాం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



జన హృదయనేతకు జన్మదిన శుభాకాంక్షలు
ప్రతి నిత్యం ప్రజల మధ్య ఉంటూ...
ప్రజా సేవే పరమావధిగా పనిచేస్తున్న
ప్రజా నాయకులు, తెలంగాణ ముద్దుబిడ్డ,
నిగర్వి, సేవాతత్పరులు
శ్రీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి గారికి
ఇవే మా హృదయపూర్వక
జన్మదిన
శుభాకాంక్షలు...
గౌ॥ శ్రీ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి గారు
మాజీ మంత్రివర్యులు
సూర్యాపేట నియోజకవర్గ ఇంచార్జీ
వేములకొండ పద్మ - సైదులు గౌడ్
సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు
1వ వార్డు కౌన్సిలర్, సూర్యాపేట
కాంగ్రెస్ పార్టీ
జిల్లా నాయకులు

# విజయకేతనం

## తెలుగు మాసపత్రిక

సంపుటి : 14 సంచిక : 10

సెప్టెంబర్ 2025

పేజీలు : 64+4 వెల 10/-

ఎడిటర్

**విశ్వనాధుల నరసింహాచారి**

బ్యూరో చీఫ్

**శ్రీరాం పండిట్**

రిపోర్టర్స్

హైద్రాబాద్ : జి.సత్యనారాయణ

నల్లగొండ : బి. శ్రీకాంత్

మహబూబ్‌నగర్ : పి.రాజలింగం

వరంగల్ : ఎస్.వెంకన్న

ఖమ్మం : కె. వెంకటేశ్వర్లు

సబ్ ఎడిటర్ : వి. నిఖిత

Printed, Published & Owned by
VISHWANADHULA NARASIMHA CHARY
Printed at NIKHITHA PRINTERS
H.NO. 10-115, Vishwa Brahmana Street, Village and Mandal : Chandur, Dist : Nalgonda. TG Published at H.NO. 10-115, Vishwa Brahmana Street, Village and Mandal : Chandur, Dist : Nalgonda. TG
Editor :
VISHWANADHULA NARASIMHA CHARY
Rni. No. APTEL/2012/42406
Cell: 9533243339


## లోపలి పేజీల్లో...


4వ పేజీలో... చికిత్స మధ్యలో డిశ్చార్జి చేసే ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు అధికారులకు వైద్య మంత్రి దామోదర ఆదేశాలు





4వ పేజీలో... కాళేశ్వరం బాధ్యులపై క్రిమినల్ చర్యలు నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం





17వ పేజీలో... జీఎస్టీ హేతుబద్ధీకరణతో తెలంగాణకు 7వేల కోట్ల నష్టం రాష్ట్రాల ఆదాయానికి భద్రత కల్పించాలి






11వ పేజీలో... పదవులపై ఉన్న శ్రద్ధ.. ప్రాజెక్టులపై లేదు టీబీ డ్యాం భద్రత మరిచిన సిద్దరామయ్య ప్రభుత్వం




## సంపాదకీయం

# మౌలిక సదుపాయాల రూపకల్పన

కంప్యూటర్లు వచ్చిన కొత్తలో ఒక గది మొత్తాన్నీ నింపేసే భారీ యంత్రాల్లా ఉండేవి. ఇప్పుడు మీ వేలి గోరుకన్నా చిన్నదైన చిప్ లోపల అనంతమైన శక్తి దాగి ఉంటుంది. మీ మొబైల్ ఫోన్లు, కార్లు, రైళ్లు, టీవీలు, రిఫ్రిజిరేటర్‌లు మొదలుకొని ఫ్యాక్టరీ యంత్రాలు, విమానాలు, అంతరిక్షంలో సంచరించే ఉపగ్రహాల దాకా ఇవే నడిపిస్తున్నవి. ఇదంతా సెమీ కండక్టర్ల మాయాజాలం! ఒక దేశం ప్రగతిపథంలో సాగాలంటే వృద్ధికి తోడ్పడే కీలక రంగాలపై పట్టు సాధించాలి. ఉక్కు, విద్యుత్తు, టెలికాం, రసాయనాలు, రవాణా, సెమీకండక్టర్లు వంటి రంగాలు దీనికి పునాదులు. వీటిలో సెమీకండక్టర్ల పాత్ర అత్యంత ప్రధానం. కర్మాగారాలు, వంతెనలు, రైల్వే రంగాల్లో ఉక్కు ప్రాథమిక అవసరం. అదే తరహాలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు సెమీకండక్టర్లు మూలాధారాలు. చిప్‌లు లేనిదే ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థ పనిచేయదు. డేటా ప్రాసెసింగ్ సహా కృత్రిమ మేధ మనజాలదు. పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు ఉండవు. రక్షణ రంగం సురక్షితంగా ఉండదు. అందువల్ల, సెమీకండక్టర్ల రంగంలో బలోపేతం కావడమనే అంశానికి పరిశ్రమను మించిన ప్రాధాన్యం ఉంటుంది.

ప్రపంచ భౌగోళిక రాజకీయాలకు సెమీకండక్టర్లే నేడు కేంద్రకంగా మారాయి. చిప్ తయారీ కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం కావడంతో స్వల్ప అంతరాయాలు కూడా ప్రపంచమంతటా అలజడి రేపుతున్నాయి. ఇటీవలి కాలంలో అరుదైన లోహాలపై అన్ని దేశాలూ దృష్టి సారిస్తున్నాయి. కీలక వనరులపై నియంత్రణ ప్రపంచ శక్తి సమీకరణాల్లో ఎంత ప్రాముఖ్యతను ఇవ్వగలదో ఈ పరిణామం స్పష్టం చేస్తున్నది. దేశంలో ప్రస్తుతం 65 కోట్లకుపైగా స్మార్ట్‌ఫోన్ వినియోగదారులున్నారు. మన ఎలక్ట్రానిక్స్ తయారీ ఇప్పుడు ఏటా రూ.12 లక్షల కోట్లకు చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో మనం కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలు, డేటా సెంటర్లు నెలకొల్పడంతోపాటు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీని కూడా చేపడుతున్నాం. ఈ విధంగా డిమాండ్%--%ఆవిష్కరణ రెండింటా కనిపిస్తున్న పెరుగుదల ద్వారా ప్రపంచ సెమీకండక్టర్ విలువ శ్రేణిలో భారత్ తనదైన స్థానం సంపాదించుకోనున్నది. సెమీకండక్టర్ల విషయంలో మన దేశం దశాబ్దాలుగా అనేక అవకాశాలు కోల్పోయిందన్న మాట మనకు వినిపిస్తోంది. కానీ, ఇకపై ఆ పరిస్థితి మారనున్నది. 'ఇండియా సెమీకండక్టర్ మిషన్' కింద దేశంలో 10 సెమీకండక్టర్ల తయారీ ప్లాంట్లకు ఆమోదముద్ర పడింది.

వాటి నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఏడాదిలోనే తొలి 'మేడ్ ఇన్ ఇండియా' చిప్ ఆవిష్కృతం కాగలదని మనం సగర్వంగా చాటగలం. గుజరాత్‌లోని సనంద్‌లోగల ఒక యూనిట్‌లో ఇప్పటికే ప్రయోగాత్మక ఉత్పత్తి మొదలు కావడంతో ఏడాదిలోగా వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభం కాగలదని అంచనా. ఈ కర్మాగారాలు, సరఫరా శ్రేణులకు మద్దతు దిశగా అప్లైడ్ మెటీరియల్స్, లామ్ రీసెర్చ్, మెర్క్ లిండే.. వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ దీర్ఘకాల అభివృద్ధిపై ప్రధానమంత్రి కేంద్రీకృత దృష్టిని ఈ దృక్పథం ప్రతిబింబిస్తోంది.

ఏ కోణంలో చూసినా విధానం, పెట్టుబడులు అత్యంత ప్రధానం. అయితే, భారత్‌కు నిజమైన సానుకూలత దాని ప్రజానీకంలోనే ఉన్నది. ప్రస్తుతం ప్రపంచ డిజైన్ శ్రామిక శక్తిలో భారత్ వాటా 20 శాతం కాగా, ఒక అంచనా ప్రకారం వచ్చే దశాబ్దారంభం నాటికి అంతర్జాతీయంగా సెమీకండక్టర్ నిపుణుల కొరత 10 లక్షలకు పైగా ఉంటుంది. ఈ అంతరాన్ని పూరించే దిశగా భారత్ నేడు ముందడుగు వేస్తున్నది. ఎందుకంటే – 350 పరిశ్రమలు, అంకుర సంస్థలలో 60వేలకు పైగా వినియోగదారులు ప్రభుత్వం ఉచితంగా సమకూర్చే అంతర్జాతీయ స్థాయి ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) ఉపకరణాలను వాడుతున్నారు. ఈ మేరకు 2025లోనే వీటి వాడకం 1.2 కోట్ల గంటల స్థాయిని దాటింది. ప్రభుత్వం నుంచి బలమైన మద్దతు లభించడంతో అంకుర సంస్థలు భారత చిప్ డిజైన్ వ్యవస్థను శక్తిమంతం చేస్తున్నాయి. ఈ మేరకు ఐఐటీ– మద్రాస్ దేశీయంగా రూపొందించిన 'శక్తి' ప్రాసెసర్ సాయంతో 'మైండ్‌గ్రోవ్ టెక్నాలజీస్' సంస్థ 'ఐఓటీ' చిప్‌లను రూపొందిస్తోంది. ఇక 'నేత్రసేమి' అనే మరో అంకుర సంస్థ ఇటీవలే రికార్డు స్థాయిలో రూ.107 కోట్ల నిధిని సమీకరించుకోగలిగింది. దేశంలోని సెమీకండక్టర్ డిజైన్ రంగంలోనే ఇది అత్యంత భారీ వెంచర్ క్యాపిటల్ సమీకరణ. ఈ రంగంపై పెట్టుబడిదారులలో పెరుగుతున్న విశ్వాసానికి ఇదొక నిదర్శనం. 'డిజైన్ సంధానిత ప్రోత్సాహకం' (డీఎల్ఐ) పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇలాంటి అనేక అంకుర సంస్థలకు చేయూత లభిస్తోంది. మొహాలీలోని సెమీ కండక్టర్ లాబొరేటరీ (ఎస్‌సీఎల్)లో 17 విద్యాసంస్థల నుంచి వచ్చిన విద్యార్థులు ఇప్పటికే 20 చిప్‌లను తయారు చేశారు. రాబోయే కాలంలో ఇలాంటి మరిన్ని చిప్‌లను వారు ఆవిష్కరించగలరు. ఈ విధమైన నైపుణ్యాభివృద్ధి భారతదేశాన్ని సెమీ కండక్టర్ పరిశ్రమలో పటిష్ఠమైన స్థానంలో నిలబెడుతుంది. ఈ మేరకు యువ ఆవిష్కర్తల స్వప్న సాకారం దిశగా 'ఎస్‌సీఎల్' ఆధునికీకరణ చేపట్టారు. ఈ విధంగా భారత ప్రతిభ క్లాస్‌రూమ్ నుంచి క్లీన్‌రూమ్ వైపు మళ్లగలదనే భరోసా లభిస్తోంది. భారత యువతరం ప్రతిభపై ప్రపంచ అగ్రశ్రేణి సంస్థలు కూడా పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ మేరకు 'లామ్ రీసెర్చ్' సంస్థ దేశంలోని 60వేల మంది ఇంజినీర్లకు శిక్షణ ఇవ్వనుంది. అలాగే అప్లైడ్ మెటీరియల్స్, ఏఎండీ, మైక్రోచిప్ సంస్థలు పరిశోధన–ఆవిష్కరణల కోసం 101 కోట్ల డాలర్ల పెట్టుబడికి హామీ ఇచ్చాయి. మరోవైపు ఐఐఎస్‌సీ, ఐఐటీలు తదితర సంస్థల భాగస్వామ్యంతో ప్రయోగశాల నుంచి తయారీ ప్రతిభగల (ల్యాబ్–టు–ఫ్యాబ్) బలమైన కార్మికశక్తి రూపకల్పనకు భరోసా లభిస్తోంది.

సెమీకండక్టర్ల రంగంలో భారత్ పురోగమనం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టిలో ఒక భాగం. డిజిటల్ మౌలిక సదుపాయాల రూపకల్పనతో పాటు పౌరులకు సాధికారతను ఇచ్చిన డిజిటల్ ఇండియా కార్యక్రమంతో ఇది శ్రీకారం చుట్టుకుంది. ఇండియా స్టాక్, యూపీఐ, ఆధార్, టెలికాం నెట్‌వర్కులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి భారతీయుడి వేలికొసలకు చేర్చాయి.

ఈ పురోగమనానికి సమాంతరంగా మన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి వ్యవస్థను కూడా బలోపేతం చేసిన నేపథ్యంలో ప్రస్తుతం సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, పరికరాల కోసం తయారీ వ్యవస్థను రూపొందిస్తున్నాం. నేడు ప్రారంభమయ్యే సెమికాన్ ఇండియా సమ్మిట్ 2025, ఈ ప్రయాణానికి కొనసాగింపుగా చెప్పుకోవచ్చు. ప్రధానమంత్రి ఈ రోజు ఈ సదస్సును ప్రారంభించ నున్నారు. ఈ సంవత్సరం 48 దేశాల నుంచి 500 మందికి పైగా ప్రపంచ పారిశ్రామిక నాయకులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. అనిశ్చితితో సతమతమవుతున్న ప్రపంచానికి స్థిరమైన భారత్ ఆశాకిరణం కాబట్టి, ప్రపంచం మన తలుపు తడుతోంది. ఇందులో జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, మలేషియా దేశాల ప్రత్యేక పెవిలియన్లు అర్థవంతమైన సహకారాన్ని ప్రోత్సహిస్తాయి.

**- ఎడిటర్**

# చికిత్స మధ్యలో డిశ్చార్జి చేసే ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు

## అధికారులకు వైద్య మంత్రి దామోదర ఆదేశాలు



హైదరాబాద్, : చికిత్స మధ్యలో రోగులను డిశ్చార్జి చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శాఖ అధికారులను ఆదేశించారు. అత్యవసర చికిత్స కోసం నేరుగా నిమ్స్‌కు వచ్చే రోగులను, ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి రిఫరల్‌పై వచ్చే వారికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిమ్స్‌లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి దామోదర సమీక్ష సమావేశం నిర్వహించారు. నిమ్స్‌లో ఈ ఏడాది తొలి ఏడు నెల్లలో (జనవరి నుంచి జూలై) 5 లక్షల 44 వేల మందికి వైద్య సేవలు అందించామని బీరప్ప తెలిపారు. ఇందులో సగానికిపైగా ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్ఎస్ వంటి ప్రభుత్వ పథకాల కింద ఉచితంగా చికిత్స పొందారని వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే వందకుపైగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు కూడా చేశామని వెల్లడించారు.

ప్రస్తుతం నిమ్స్ ఎమర్జెన్సీ వార్డుకు రోజుకు 80 నుంచి వంద మంది రోగులు వస్తున్నారని తెలిపారు. ఇందులో సగం మందికిపైగా రోగులు ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది, పరిస్థితి విషమించాక చివరి నిమిషంలో నిమ్స్‌కు వస్తున్నారని వెల్లడించారు. కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేసిన తర్వాత రోగులు పూర్తిగా కోలుకోకముందే వారిని డిశ్చార్జి చేసి, నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు పంపిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మెరుగైన వైద్యసేవలం దిస్తున్న నిమ్స్ డైరెక్టర్, డాక్టర్లు, సిబ్బందిని మంత్రి అభినందించారు. చికిత్స మధ్యలో రోగులను పంపే ప్రైవేటు ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఈసీఐఎల్‌కు స్కోప్ ఎమినెన్స్ అవార్డు



కుషాయిగూడ, : ఎలక్ట్రానిక్స్ రంగంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఈసీఐఎల్ సంస్థ ప్రతిష్ఠాత్మక స్కోప్ ఎమినెన్స్ అవార్డును దక్కించుకుంది. 2022-23 సంవత్సరానికి ఇన్‌స్టిట్యూషనల్ ఎక్సలెన్స్ కేటగిరీలో ఈ అవార్డు లభించింది. శుక్రవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ అనేష్ కుమార్ శర్మ అందుకున్నారు. ఈ అవార్డు ద్వారా సాంకేతిక పురోగతిలో తమ అగ్రగామి స్థాయి మరింత బలోపేతమైందని, బహుళ కీలక రంగాల్లో వ్యూహాత్మక ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ఆవిష్కరణలకు ఇది మరింత చేయూతనిస్తుందని సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. కార్పొరేట్ పాలన, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలో అత్యుత్తమ పనితీరును ప్రదర్శించే కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు స్కోప్ ఎమినెన్స్ అవార్డు ఇస్తారు.

# కాళేశ్వరం బాధ్యులపై క్రిమినల్ చర్యలు

- **జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ సిఫారసు**
- **అవసరమైతే సిబిఐ, సిఐడిలతో విచారణ**
- **అప్పటి ఇఎన్‌సి మురళీధర్, చీఫ్ ఇంజినీర్ హరిరాం,**
- **నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్‌కె జోషి, సిఎం**
- **అదనపు కార్యదర్శి స్మితాసబర్వాల్‌పై క్రిమినల్ కేసులు**
- **నిబంధనల ఉల్లంఘనలు, నిర్మాణ, నాణ్యత లోపాలు**
- **సుస్పష్టం నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం**



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిల నిర్మాణంలో అడుగడుగునా లోపభూయిష్టంగా ఉన్నాయని, దీనిపై రాష్ట్ర ప్ర భుత్వం ఏర్పాటుచేసిన సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, జస్టిస్ పినాకిని చంద్ర ఘోష్ కమిషన్ తన నివేదికలో ఎత్తిచూపింది. సాంకేతిక ప్రమాణాలు పాటించక ోపోవడం, సెంట్రల్ వాటర్ కమిషన్ గైడ్‌లైన్స్ నిబంధనలను పాటించకపోవడం, మంత్రివర్గం ఆమోదం, ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగినట్లుగా తన 660 పే జీల నివేదికలో పేర్కొంది. ఇందులో ప్రధానంగా కమిషన్ ఎత్తిచూపిన లోపాల్లో డ్యామ్‌లకు బ్యారేజిల మధ్య తారతమ్యం లేకుండా నిర్మాణం జరిగిందని కమిషన్ తప్పుపట్టింది. తన నివేదికలోని అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ఈ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం భావిస్తే సిబిఐ లేదా సిబిసిఐడి విచారణ సం స్థలతో విచారణ జరిపించాలని కూడా కమిషన్ సిఫార్సు చేసింది.

భవిష్యత్తులో ఇలాంటి ప్రాజెక్టుల నిర్మాణాల విషయంలో సమగ్రంగా హైడ్రాలజికల్, జియోటెక్నికల్ పరిశీలనలు తప్పనిసరి చే యాలని అభిప్రాయం వ్యక్తం చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణాలు జరిగిన చోట జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్స్ పూర్తిస్థాయిలో సమగ్రంగా జరగలేదని పేర్కొంటూ బ్యారేజిల నిర్మాణాల స్థలాల్లో సరైనరీతిలో నమూనాలు తీసుకోలేదని, ఫౌండేషన్ ట్రీట్‌మెంట్ డిజైన్లు పూర్తిస్థాయి డేటా ఆధారంగా లేవని కమిషన్ ఎత్తిచూపింది. బ్యారేజీ నిర్మాణంలో కాంక్రీటింగ్ సమయంలో క్వాలిటీ కంట్రోల్ ప్రమాణాలు పాటించలేదని, గ్రౌటింగ్ పనులు సరిగ్గా చేయకపోవడం వల్లనే మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటు, పగుళ్ల కారణమని పేర్కొంది. నిర్మాణ సమయంలో జాయింట్లను స రిగ్గా ట్రీట్ చేయకపోవడం వల్ల కాంక్రీట్ పటిష్టం గా లేకుండా పోయిందని వెల్లడించింది.

నిర్మాణ సమయంలో వివిధ దశల్లో నిర్వహించాల్సిన పరీక్షలు మొక్కుబడిగా తప్ప పూర్తిస్థాయిలో జరగలేదని కమిషన్ పేర్కొంది. మేడిగడ్డ వద్ద బ్యారేజి ని ర్మాణం గురించి వ్యాప్కోస్ సంస్థ ఎలాంటి ప్రస్తావన చేయలేదని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ముం దుగానే మేడిగడ్డ వద్ద బ్యారేజి నిర్మించాలని నిర్ణయించింది కానీ, అది వ్యాప్కోస్ నివేదిక ఆధారం గా తీసుకున్న నిర్ణయం కాదని వెల్లడించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజిలో ఏడో బ్లాక్‌లోని ఆరు పిల్లర్లు కుంగిపోయాయని సంబంధిత ఇంజినీర్ మహాదేవ్‌పూర్ పోలీసు స్టేషన్‌లో నమోదు చేసినట్లు కమిషన్ ప్రస్తావించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణంలో ని ర్లక్షం వంటి లోపాలు ఉన్నట్లు కమిషన్ తేల్చింది.

అంచనాలు, పరిపాలనా అనుమతులు మం జూరు విషయంలో సెంట్రల్ వాటర్ కమిషన్(సిడబ్ల్యూసి) నుంచి అనుమతులు పొందే విషయంలో సరైన విధానాన్ని అనుసరించలేదని తెలిపింది. ప్ర భుత్వ ఉత్తర్వులు జి.వో నెం.28 ప్రకారంగా ఏర్పాటైన నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికలో మేడిగడ్డ వద్ద బ్యారేజి నిర్మాణానికి అనుకూలమైన చోటు కాదని స్పష్టం చేసినప్పటికీ ప్రభుత్వం దానిని పరిగణలోకి తీసుకోకుండానే నిర్మాణం చేపట్టిందని కమిషన్ తప్పుపట్టింది. అంతే కాకుండా తుమ్మిడి హెట్టి వద్ద నీరు అందుబాటులో ఉండదనే కార ణం సరైంది కా దంటూ సెంట్రల్ వాటర్ కమిషన్(సిడబ్ల్యూసి) 2015, 2017 సంవత్సరాల్లో ఇచ్చిన లేఖల్లో పే ర్కొన్న వివరాలు ఓకే విధంగా ఉన్నట్లు పేర్కొం ది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బ్యా రేజిలు నిర్మించాలనే నిర్ణయం పూర్తిగా అప్పటి ముఖ్యమంత్రిదేనని కమిషన్ స్పష్టం చేసింది.

**కాంట్రాక్టుల్లో అవలంబించిన విధానం తప్పే :** మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిల నిర్మాణాలకు సంబంధించి కాంట్రాక్టు ఏజెన్సీలకు ఇచ్చిన పనులను ఘోష్ కమిషన్ తప్పు పట్టింది. కాం ట్రాక్టుల విషయంలో టర్న్ కీ ప్రాతిపదికన ఇ వ్వాల్సి ఉండగా, చట్టవిరుద్ధంగా లప్సమ్ బేసిస్ లో ఇవ్వడాన్ని తప్పుపట్టింది. కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ ద్వారా వర్క్ టెండర్లు ఆహ్వానించకపోవడాన్ని కూడా కమిషన్ తప్పు పట్టింది. అంతే కాకుండా ఆర్థిక క్రమశిక్షణ లేకుండా వ్యవహారాలు జరిగాయని గుర్తించింది. వ్యాప్కోస్ ఇచ్చి న డిటైల్డ్ ప్రాజె క్టు రిపోర్టు(డిపిఆర్)లోని సాంకేతిక అంశాలను పరిశీలించకుండానే అంచనాల ను ఆమోదించార ని, అంచనాలను రెండుసార్లు ఆమోదించాల్సి వ చ్చిందని, రెండోసారి అంచనాల సవరణ సందర్భంలో కాంట్రాక్టు కండిషన్లను సడలించి నిర్మాణ సంస్థలకు లాభాలు కలిగించే విధంగా చేశారని ఘోష్ నివేదికలో పొం దుపరిచింది. ఇలాంటి మా ర్పులన్నీ ఉద్దేశ్యపూర్వకంగా, దురుద్దేశ్యంతో ప్ర జా ధనాన్ని దుర్వినియోగం చేసినట్లు కమిషన్ తే ల్చింది. నిర్మాణ సంస్థలకు సబ్‌స్టాన్షియల్ కంప్లిష న్ సర్టిఫికేట్, సర్టిఫికేట్ ఆఫ్ కంప్లిషన్ ఆఫ్ వర్క్ జారీచేయడం చట్టవిరుద్దమని తెలిపింది. నిర్మాణ సం స్థలకు బ్యాంక్ గ్యారెంటీలు విడుదల చేయడం కూడా చట్టవిరుద్ధమని కమిషన్ నిర్ధారించింది. నిర్మాణ సంస్థలు నిర్ణీత కాలంలో పనులు పూర్తిచేయకపోవడానికి పెనాల్టీలు విధించకపోగా, ని బంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు కాలాన్ని పొడిగించడాన్ని కమిషన్ తప్పుపట్టింది. మూడు బ్యా రేజీలకు సంబంధించి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లోపాలు ఉన్నాయని, వీటి ఓ అండ్ ఎం మా న్యువల్ కూడా అందుబాటులో లేదని పేర్కొంది.

**ఎన్డీఎస్ఎ తేల్చిన కారణాలు ఇవి** : నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఎ) 2023 అక్టోబర్ 22న మేడిగడ్డ బ్యారేజి పిల్లర్లు కుంగిపోవడానికి కారణాలు గుర్తించేందుకు ప్రత్యేకంగా క మిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ అక్టోబర్ 24వ తేదీన మేడిగడ్డ బ్యారేజిని పరిశీలించి నవంబర్ ఒకటో తేదీన ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఎన్డీఎస్ఎ కమిటి పిల్లర్లు కుంగిపోవడానికి ప్రధా న కారణం ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లోపా లే ప్రధాన కారణమని స్పష్టం చేసిం ది. పునాదులు పూర్తి సా మర్థంతో లేకపోవడంతో పాటు డ్యామ్ సేఫ్టీ యా క్ట్ 2021 నిబంధనల మేరకు పలు చోట్ల లోపాలు ఉన్నట్లు కనిపిస్తోందని, ఇది తీవ్రమైన విషయం గా వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితిలో రిజర్వాయర్ ను నీటితో నింపడం వల్ల పరిస్థితి మరింత దెబ్బతీస్తుందని, అలాంటి పనులు చేయవద్దని సూచించింది.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ని ర్మాణ లోపాలపై బాధ్యులైన ఆనాటి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఘోష్ కమిషన్ సిఫార్సు చేసింది. మూడు బ్యారేజీలను టర్న్ కీ పద్ధతిలో ఇ వ్వకుండా లప్సమ్ కాంట్రాక్టులు తీసుకున్న విషయాన్ని అడ్వయిజరీ కమిటీ సమావేశంలో గోప్యత పాటించిన నీటిపారుదల ఇంజినీర్ ఇన్ చీఫ్(ఇఎన్సీ) సి.మురళీధర్, చీఫ్ ఇంజినీర్ బి.హరిరామ్‌లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫార్సు చేసింది. నిపుణుల కమిటీ నివేదికను బహిర్గతం చేయకుండా మేడిగడ్డ బ్యారేజి నిర్మాణానికి అనుకూల వాతావరణం కల్పించడం లో కీలకపాత్ర పోషించిన ఆనాటి నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.కె.జోషి, ఇఎన్సీ మురళీధర్, చీఫ్ ఇంజినీర్ హరిరామ్‌లపై చర్యలకు కమిషన్ సిఫార్సు చేసింది. మూడు బ్యారేజిల నిర్మాణాలకు సంబంధించిన ఫైళ్లను మంత్రివర్గ సమావేశం ముందు ఉంచకపోవడం ద్వారా బిజినెస్ రూల్స్ ను ఉల్లంఘించిన నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.కె.జోషి, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్‌లపై చర్యలు తీసుకోవాలని సూచించింది.

**స్టడీ చేయని రీసెర్చ్ ల్యాబ్** : తెలంగాణ స్టేట్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ల్యాబ్స్(టిఎస్ఇఆర్ఎల్) ఇంజినీర్లు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిలకు సంబంధించిన మోడల్ స్టడీస్ సరైన రీతిలో అధ్యయనం చేయలేదని కమిషన్ తేల్చింది. బ్యారేజీల డ్రాయింగ్స్‌ను ఎమర్జెన్సీ పేరుతో పరిశీలించడం బాధ్యతారాహిత్యం గా పేర్కొంది. బ్యారేజీలకు సంబంధించిన రికార్డులు కూడా సమగ్రంగా నిర్వహించలేదని, పూ ర్తి స్థాయిలో పర్యవేక్షించలేదని, క్వాలిటీ కంట్రల్ తనిఖీలు సరిగ్గా చేయలేకపోగా, వాటికి సంబంధించిన రికార్డులు కూడా సక్రమంగా నిర్వహించలేద ని కమిషన్ వెల్లడించింది. బ్యారేజీలలో నెలకొన్న లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత సదరు

నిర్మాణ సంస్థలదేనని ఘోష్ కమిషన్ వెల్లడించింది.

**క్రిమినల్ కేసులు నమోదుకు సిఫార్సు** : మూడు బ్యారేజీల నిర్మాణాల్లో అవినీతి, అధికార దుర్వినియోగం, ప్రజా నిధుల దుర్వినియోగం చే సిన అధికారులందరిపైన ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ 1988 చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కమిషన్ సిఫార్సు చేసింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన, ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు నిర్ణయాలు తీసుకున్న వారిపై ఐపిసి సెక్షన్ 409 ప్రకారం కేసులు నమోదు చేయాలని, తప్పుడు సాక్షం ఇచ్చిన అధికారులపై ఐపిసి సెక్షన్లు 191, 193 కింద చర్యలకు సిఫార్సు చేసింది.

**ఆర్థిక అంశాలు** : కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ లో భాగంగా మే డిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిల నిర్మాణ ఖ ర్చును మొదటి అంచనాలు రూ.80,499 కోట్లు గా నిర్ధారించారు. పనులు ప్రారంభమైన కొద్ది కా లానికే వ్యయాన్ని రూ.94,447 కోట్లకు పెంచారని కమిషన్ నివేదికలో తెలిపింది. రెండోసారి స వరణ అంచనాల వ్యయాన్ని రూ.1,21,611 కోట్లకు పెరిగిందని, ఈ అంచనాల సవరణకు మంత్రివర్గం సమావేశంలో ఆమోదం పొందకుం డా ఆర్థిక శాఖ నుంచి అనుమతులు ఇచ్చారని, ఇ ది ఆర్థిక క్రమశిక్షణ ఉల్లంఘన, బిజినెస్ రూల్స్‌కు విరుద్ధమని కమిషన్ వెల్లడించింది. ప్రాజెక్టు వ్యయం పెరుగుదలకు వీలైన టెక్నికల్ జస్టిఫికేషన్ ఇవ్వలేదని కమిషన్ వెల్లడించింది.

# కాంగ్రెస్-బిఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్: ఏలేటి మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించిన రాష్ట్ర ప్రభుత్వం కేవలం మూడు బ్యారేజీలపైనే విచారణ జరిపించడాన్ని బట్టి చూస్తుంటే కాంగ్రెస్-బిఆర్ఎస్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యిందన్న అనుమానం కలుగుతున్నదని బిజెపి శాసనస భాపక్షం నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. అవినీతి చేసిన వారిని జైలుకు పంపించకుండా కంటి తుడుపు చర్యగా జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టారని ఆయన విమర్శించారు. ఆదివారం అసెంబ్లీ సమావేశంలో పిసి ఘోష్ కమిషన్ నివేదికపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దోషులను శిక్షించాలన్న ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని విమర్శించారు.

కమిషన్ల కోసం ప్రాజెక్టు కట్టారని ఆరోపించిన వారు మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుపై కేసులు పెట్టబోమని అంటున్నారని ఆయన కాంగ్రెస్‌నుద్దేశించి విమర్శించారు. కమిషన్ నివేదికలో కెసిఆర్ పేరు ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు.

అవినీతి చేసిన వారిపై ఏమి చర్యలు తీసుకుంటారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లక్ష కోట్ల దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకునే వరకు ప్రజలు ఊరుకోరని ఆయన తెలిపారు. సిబిఐ లేదా సిట్ విచారణ జరిపిస్తారా? చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కమిషన్ ఎందుకు వేశారో, అసెంబ్లీ సమావేశాలను హడావుడిగా ఎందుకు ఏర్పాటు చేశారో అర్థం కావడం లేదని మహేశ్వర్ రెడ్డి అన్నారు.

**ఏటిఎంలా మారిన ప్రాజెక్టులుః అక్బరుద్దీన్** మజ్లీస్ శాసనసభాపక్షం నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ ప్రసంగిస్తూ సాగు నీటి ప్రాజెక్టులు ఏటిఎంలా మారాయని విమర్శించారు. గతంలో కూడా న్యాయ విచారణ కమిషన్లను నియమించినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఏటిఎంల పాస్ వర్డ్‌లు మారుతున్నాయని ఆయన విమర్శించారు. న్యాయ విచారణ అనంతరం మంత్రుల కమిటీని నియమిస్తున్నారని, ఆ తర్వాత చర్యలు తీసుకుంటున్నారని ఆయన అన్నారు.

# జీఎస్టీ హేతుబద్ధీకరణతో తెలంగాణకు 7వేల కోట్ల నష్టం

- **రాష్ట్రాల ఆదాయానికి భద్రత కల్పించాలి**
- **పన్ను తగ్గింపు.. పేద, మధ్య తరగతికి లబ్ధి చేకూర్చాలి**
- **రాబోయే జీఎస్టీ కౌన్సిల్ భేటీలో సందేహాలన్నీ లేవనెత్తుతాం**
- **జీఎస్టీ హేతుబద్ధీకరణ సంప్రదింపుల సమావేశంలో భట్టి**
- **రాష్ట్రంలో వరద నష్టం నివేదిక కేంద్రానికి పంపుతామని వెల్లడి**
- **జీఎస్టీ రేట్లు మారిస్తే రాష్ట్రాల రాబడికి 2 లక్షల కోట్ల గండి**
- **ఆర్థికం కుదేలవుతుంది.. అభివృద్ధి పనులు నిలిచిపోతాయి**
- **ఈ నష్టాన్ని కేంద్రం చెల్లిస్తుందా? 8 ప్రతిపక్ష రాష్ట్రాల ప్రశ్న**




న్యూఢిల్లీ, : జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించే సమయంలో రాష్ట్రాల ఆదాయానికి భద్రత కల్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. రేట్ల హేతుబద్ధీకరణతో తెలంగాణకు రూ.7 వేల కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో, కేంద్రం నేరుగా లేదా కౌన్సిల్ ద్వారా రాష్ట్రాలను సంప్రదించాలని, కానీ.. రేట్ల హేతుబద్ధీకరణ ప్రకటన ఏకపక్షంగా జరిగిందని అన్నారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, ఎన్నో ఆకాంక్షలు ఉన్నాయని, నిధులు అవసరమని తెలిపారు. సరైన పన్ను విధింపు.. రాష్ట్ర అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ప్రకటించడం తెలిసిందే. ఈ మేరకు జీఎస్టీని ప్రస్తుతం విధిస్తున్న 5, 12, 18, 28 శాతం స్లాబ్‌లలో కాకుండా.. రెండు స్లాబ్‌లలో 5 నుంచి 18 శాతం మధ్య నిర్ణయించాలని, అతివిలాస, హానికర వస్తువులపై మాత్రమే 40 శాతం జీఎస్టీ విధించాలని కేంద్రం సూచించింది. దీంతో ఎనిమిది ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌ల ఆర్థిక మంత్రులు శుక్రవారం ఢిల్లీలో సమావేశమై ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రాలకు తగ్గే ఆదాయానికి పరిహారం చెల్లిస్తామంటూ జీఎస్టీ విధానాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో జీఎస్టీ ద్వారా ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేశారని, కానీ.. ఆశించినంతగా ఏమీ జరగలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఆర్థిక స్వేచ్ఛతో వ్యాట్‌ను కొనసాగించి ఉంటే 2024-25కు ఆదాయం రూ.69,373 కోట్లు ఉండేదని, కానీ.. జీఎస్టీ ద్వారా ఆదాయం రూ.42,443 కోట్లు మాత్రమే వచ్చిందని తెలిపారు. రాష్ట్ర సొంత పన్ను

ఆదాయంలో జీఎస్టీ వసూళ్లు 39 శాతమేనని, అందువల్ల జీఎస్టీ రేట్లలో ఏమైనా తగ్గింపులు ఉంటే.. కేంద్ర ప్రభుత్వం కంటే రాష్ట్ర ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని చెప్పారు. తెలంగాణ జీఎస్టీ, జీఎస్‌డీపీ నిష్పత్తి 2022– 23లో 3.07 శాతం నుంచి 2024 – 25లో 2.58 శాతానికి క్రమంగా తగ్గుతోందని, రేటు హేతుబద్ధీకరణ దీనిని మరింత తగ్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణకు తెలంగాణ మద్దతు ఇస్తుందని, కానీ రెండు తీవ్రమైన సమస్యలను పరిష్కరించాలని భట్టి డిమాండ్ చేశారు.

మొదటిది.. రాష్ట్రాల ఆదాయాలను రక్షించాలని, రాష్ట్రాలు సంక్షేమం, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కార్యక్రమాలను కొనసాగించేలా తగిన పరిహార విధానాన్ని రూపొందించాలని అన్నారు. రెండోది.. పన్ను తగ్గింపు లేదా మినహాయింపు నిజంగా సమాజంలోని పేద, మధ్యతరగతి వర్గాల సమూహాలకు చేరేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. సమావేశం అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. సెప్టెంబరు 3న మరోసారి సమావేశమై కీలక అంశాలపై చర్చించి.. కేంద్రానికి నివేదిస్తామని తెలిపారు. కేంద్ర నిర్ణయంతో చాలా రాష్ట్రాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని, అందులో.. ఎన్డీయే పాలిత రాష్ట్రాలూ ఉన్నాయని గుర్తు చేశారు. అందుకే, జీఎస్టీ హేతుబద్ధీకరణ అంశంపై కేంద్రం మరింత లోతుగా ఆలోచించాలని కోరారు. కాగా, తెలంగాణలో వరదల వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారని తెలిపారు. వీలైనంత త్వరగా నివేదికను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించి ఆర్థికసాయం కోరతామన్నారు.

**రాష్ట్రాల ఆదాయానికి రూ.2 లక్షల కోట్ల నష్టం..** జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ వల్ల రాష్ట్రాల ఆదాయానికి రూ.1.5 లక్షల కోట్లనుంచి రూ.2 లక్షల కోట్ల మేరకు గండి పడుతుందని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు తెలిపాయి. తమకు ఈ నష్టాన్ని ఎలా చెల్లిస్తారో కేంద్ర ప్రభుత్వం చెప్పాలని సవాల్ చేశాయి. కొత్త జీఎస్టీ వల్ల రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోవడం మాత్రమే కాకుండా.. ఆదాయం బాగా తగ్గిపోయి రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి కూడా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశాయి.

విలాస వస్తువుల మీద అదనపు లెవీపై వచ్చే వసూళ్ల ఆధారంగా కేంద్రం రుణాలను సేకరించి తమకు చెల్లించాలని ఆర్థిక మంత్రుల సమావేశంలో డిమాండ్ చేశాయి. సెప్టెంబరు 3, 4 తేదీల్లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తాలని, నష్టపరిహారం చెల్లించేందుకు ఒక యంత్రాంగం ఏర్పాటు కోసం డిమాండ్ చేయాలని నిర్ణయించాయి. విలాస వస్తువులపై 40 శాతానికి పైగా అదనపు సుంకాన్ని విధించి.. ఆ ఆదాయాన్ని రాష్ట్రాలతో పంచుకోవాలని కేంద్రానికి సూచించాయి. కాగా, జీఎస్టీ రేట్ల హేబద్ధీకరణ వల్ల 15 నుంచి 20 శాతం ఆదాయాన్ని కోల్పోతుందని, దీనివల్ల రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి పూర్తిగా కుదేలవుతుందని కర్ణాటక ఆర్థిక మంత్రి బైరెగౌడ అన్నారు. రాష్ట్రాల ఆదాయాలు కుదుటపడే వరకు ఐదేళ్లపాటు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో భట్టివిక్రమార్క, కృష్ణ బేరెగౌడతోపాటు పంజాబ్, కేరళ, జార్ఖండ్, తమిళనాడు రాష్ట్రాల ఆర్థిక మంత్రులు పాల్గొన్నారు.

# తెలంగాణ ట్రైబల్ డిజైన్ ప్లాన్లతో మేడారం శాశ్వత అభివృద్ధి పనులు: సీతక్క

ములుగు, : తెలంగాణ ట్రైబల్ డిజైన్ ప్లాన్లతో మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులకు రూపకల్పన చేసినట్లు మంత్రి దనసరి సీతక్క తెలిపారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో మంత్రి సీతక్క జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. మేడారంలో అభివృద్ధి పనులను త్వరిత గతిన చేపట్టాలని అధికారులకు సూచించారు. జాతరలోపు మొదటి విడుత పనులు పూర్తి చేయాలన్నారు. వివిధ పనులు, నిర్మాణాలు చేపట్టేందుకు త్వరితగతిన టెండర్లు పూర్తి చేయాలని చెప్పారు.



# డిజిటల్ అరెస్టు పేరుతో రూ.72 లక్షలకు టోకరా !

## వృద్ధుడి నుంచి కాజేసిన సైబర్ కేటుగాళ్లు



హైదరాబాద్ : 'మీపై మనీ లాండరింగ్ కేసులు నమోదయ్యాయి. సుప్రీంకోర్టులో విచారణకు హాజరుకావాలి. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం' అంటూ 82 ఏళ్ల వృద్ధుడిని బెదిరించిన సైబర్ కేటుగాళ్లు నిండా ముంచేశారు.. ఆయన బ్యాంకు ఖాతాల నుంచి ఏకంగా రూ. 72 లక్షలు కాజేశారు.. చివరకు మోసపోయానని గ్రహించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీపీ ధార కవిత వివరాల మేరకు.. బంజారాహిల్స్‌కు చెందిన వృద్ధుడికి ఇటీవల గుర్తు తెలియని నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. ముంబై క్రైం బ్రాంచ్ పోలీసునంటూ ఓ వ్యక్తి పరిచయం చేసుకుని.. బాధితుడి వ్యక్తిగత వివరాలన్నీ చెప్పి నమ్మించాడు. 'మీరు ఆధార్ కార్డు దుర్వినియోగం చేశారు. మీపై మనీలాండరింగ్ కేసులు నమోదయ్యాయి. రేపు మీ బ్యాంకు ఖాతాల్ని స్తంభింపజేస్తాం. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేయమని సుప్రీంకోర్టు ఆదేశించింది. రేపు సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుంది.. మీరు తప్పకుండా వర్చువల్‌గా హాజరుకావాలి' అని బెదిరించాడు.

మరుసటి రోజు వీడియో కాల్ చేసిన నేరగాళ్లు.. సినిమాల్లోలాగా సుప్రీంకోర్టు సెటప్ వేసి నకిలీ జడ్జితో ప్రశ్నలు అడిగించారు. బాధితుడు ఇదంతా నిజమేనని నమ్మాడు. ఈ నేపథ్యంలోనే అతని ఖాతాల్లోని డబ్బును తాము చెప్పిన ఆర్బీఐ ఖాతాల్లోకి పంపాలని చెప్పారు. ఏ తప్పు చేయలేదని తేలితే వెంటనే ఆయా ఖాతాలకు డబ్బులు తిరిగి బదిలీ చేస్తామన్నారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన విషయమని ఎవరికీ చెప్పకూడదని హెచ్చరించారు. దీంతో బాధితుడు పది రోజుల పాటు తన బ్యాంకు ఖాతాల్లోని రూ. 72 లక్షలను వారు చెప్పిన ఖాతాలకు బదిలీ చేశాడు. అయితే ఆ తర్వాత నుంచి వారి ఫోన్ నంబర్లు కలవకపోవడం.. ఇటీవల ఓ దినపత్రికలో వచ్చిన నకిలీ డిజిటల్ అరెస్టు వార్త చూసి ఇదంతా మోసమని బాధితుడు తెలుసుకున్నాడు. వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# సవాళ్లను అధిగమించి సహాయక చర్యలు

## 1,646 మంది బాధితులు సురక్షిత ప్రాంతాలకు.. అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి

హైదరాబాద్, : ఎడతెరిపి లేని వర్షాల వల్ల వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సవాళ్లను అధిగమించి సహాయక చర్యలు చేపట్టామని అగ్నిమాపక శాఖ డీజీ వై. నాగిరెడ్డి తెలిపారు.

కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, నిర్మల్, సిరిసిల్లా, సిద్ధిపేట జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా రహదారులు, వంతెనలు దెబ్బతిని అనేక ప్రాంతాలకు అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడంలో తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఇలా విపత్కర పరిస్థితులు ఎదురైనా సిబ్బంది బాధితులకు సహాయం అందించారన్నారు. మొత్తం 1,646 మంది బాధితుల్ని రక్షించామని పేర్కొన్నారు. కామారెడ్డిలో ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది వాహనంతో సహా వరద నీటిలో కొట్టుకుపోయినా వారికి ఉన్న నైపుణ్యంతో సురక్షితంగా బయటకు రాగలిగారన్నారు.

అయితే కామారెడ్డిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో చిక్కుకున్న వ్యక్తిని రక్షించడంలో అగ్నిమాపక శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని సోషల్ మీడియాలో కొందరు అవాస్తవ ప్రచారం చేయడం సరైంది కాదని నాగిరెడ్డి స్పష్టం చేశారు. అగ్నిమాపక శాఖపై తప్పుడు ప్రచారాన్ని ఆ శాఖ అధికారుల సంఘం కూడా తీవ్రంగా ఖండించింది.

# నకిలీ పాస్‌పుస్తకాలతో 16 లక్షల రుణాలు స్వాహా



కురవి, : రైతులను మోసం చేసి, నకిలీ పాస్‌పుస్తకా లతో రుణాలు ఇప్పిస్తున్న ముఠాను కురవి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాకు సంబంధించిన వివరాలను మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు మీడియాకు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మంచ్యాతండాకు చెందిన మూడ్ బాలాజీ, మహబూబాబాద్ మండలం అమనగల్ కస్నాతండాకు చెందిన బానోత్ హరికిషన్, జఫర్‌ఘడ్ మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన బానోత్ వర్ధన్ ముగ్గురు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరు నకిలీ పాస్‌పుస్తకాలు, 1బీ, ఈసీ పత్రాలను తయారుచేసి అమాయకులైన రైతులకు ఎక్కువ రుణాలు ఇప్పిస్తామని నమ్మబలికారు.

ఒక్కో పాస్‌పుస్తకానికి రూ.10,000 చొప్పున వసూలు చేశారు. ఈ ముఠా కురవి యూనియన్ బ్యాంకు, డోర్నకల్ యూనియన్ బ్యాంకు, మహబూబాబాద్ యూనియన్ బ్యాంకు, కెనరా బ్యాంకులలో మొత్తం 11 మంది రైతులకు రూ.16.90 లక్షల రుణాలు ఇప్పించినట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా, మరో రూ.కోటి వరకు రుణాలు ఇప్పించేందుకు కూడా వీరు ప్లాన్ చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్సై సతీశ్ ముఠాను పట్టుకున్నారు. వారి నుంచి 23 నకిలీ పుస్తకాలు, ఒక ల్యాప్‌టాప్, రెండు ప్రింటర్లు, ఒక కంప్యూటర్, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

# జన్‌ధన్ యోజనతో ఆర్థిక సాధికారత

## కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, : దేశ ప్రజల ఆర్థిక సాధికారత, ఆర్థిక వ్యవస్థను వృద్ధి బాటలో నడిపేందుకు ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఎంతగానో ఉపయోగపడిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. జన్‌ధన్ యోజన ప్రారంభించిన సమయంలో దేశంలోని అనేక మంది బడుగు, బలహీన, పేద ప్రజలకు కనీసం బ్యాంకు ఖాతా కూడా లేదని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం 2014 ఆగస్టు 28నప్రధాన మంత్రి జన్‌ధన్ యోజనను అమల్లోకి తెచ్చారని వెల్లడించారు. 11 ఏళ్లలో జన్‌ధన్ బ్యాంక్ అకౌంట్ల సంఖ్య 56 కోట్లకు పెరగగా.. అందులో ఖాతాదారులు జమచేసుకున్న మొత్తం రూ.2.68 లక్షల కోట్లు అని వెల్లడించారు. తెలంగాణలో జన్‌ధన్ యోజనలో భాగంగా 1.3 కోట్ల అకౌంట్లు తెరవగా.. అందులో ఖాతాదారులు రూ.5,055.35 కోట్లు జమ చేసుకున్నారని పేర్కొన్నారు.

# పదవులపై ఉన్న శ్రద్ధ.. ప్రాజెక్టులపై లేదు

## టీబీ డ్యాం భద్రత మరిచిన సిద్దరామయ్య ప్రభుత్వం

## ప్రతిపక్ష నాయకుడు అశోక్ మండిపాటు



బళ్లారి(బెంగళూరు): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయాలపై, పదవులను కాపాడుకోవడంపై ఉన్న ఆసక్తి రైతులపై కానీ, ప్రాజెక్టులపై కానీ లేదని ప్రతిపక్షనాయకులు అశోక్ మండిపడ్డారు. తుంగభద్ర డ్యామ్ ను బీజేపీ నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా అశోక్ మీడియాతో మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్యకు పదవిని కాపాడుకునేందుకే సమయం సరిపోలేదని, రైతుల బాగోగులు మరిచే పోయారన్నారు.


దీనికి ప్రధాన ఉదాహరణ టీబీ డ్యాం పరిస్థితేనన్నారు. గతేడాది క్రస్ట్‌గేటు కొట్టుకుపోయి రైతులు ఎంతో ఆందోళనకు గురయ్యారని, ప్రభుత్వం అప్పుడు హడావుడి చేసిందే కానీ తర్వాత డ్యామ్ భద్రతపై దృష్టి పెట్టింది లేదన్నారు. ఎందరో రైతులకు జీవనాడి అయిన తుంగభద్రను విస్మరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని గేట్లను మార్చి డ్యామ్‌ను కాపాడాలన్నారు.

నవంబర్‌లో రాష్ట్ర రాజకీయాలు మారనున్నాయని, సీఎం దిగిపోవచ్చన్నారు. పదవులు కాపాడుకునేందుకు అధికార పార్టీ నాయకులు తాపత్రపడుతున్నారే కానీ తుంగభద్ర డ్యాం గురించి, రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. తుంగభద్ర డ్యాం భద్రతపై దృష్టి పెట్టకపోతే కర్నాటక, ఆంధ్ర రెండు రాష్ట్రాల రైతులూ నష్టపోక తప్పదన్నారు. ఇప్పటికి అధికారుల లెక్కల ప్రకారం 140 టీఎంసీల నీరు నదికి వెళ్లాయని, దీని వల్ల ఎవరికి నష్టం అని అన్నారు.

**హిందూ దేవాలయాలపై కాంగ్రెస్ కుట్ర** : ధర్మస్థల అంశంపై కాంగ్రెస్ వాళ్లు కావాలనే గొడవ సృష్టిస్తున్నారని, ఇది హిందూ దేవాలయాలపై కుట్రేనని ప్రతిపక్ష నేత అశోక్ అన్నారు. హోస్పేట్‌లో టీబీ డ్యాం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందూ దేవాలయాలే లక్ష్యంగా ఇటీవల సోషల్ మీడియాలో కథనాలు సృష్టిస్తున్నారన్నారు. దీని వెనుక పెద్ద ముఠా పనిచేస్తోందన్నారు. మాస్క్ మ్యాన్ అనన్యభట్ వీరంతా పాత్రధారులు. ప్రభుత్వం ముసుగు వేసుకున్న వ్యక్తి వెనుక ఉంది.

ప్రభుత్వమే అతనికి మద్దతు ఇస్తోందన్నారు. అనామకుడి మాట విని సిట్ ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ముసుగు వేసుకున్న వ్యక్తిని ముసుగు తీయ మని తాను గతంలో రెండుసార్లు చెప్పాను. అతను ముసుగు తీసేసి ఉంటే అతను దొంగ అని తెలిసి ఉండేది. అతను మతం మారిన వ్యక్తి అని తెలిసింది. గ్రామం మొత్తం ముసుగు వేసుకున్న వ్యక్తిని ప్రశ్నిస్తున్నారని అశోక్ అన్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ పేరుతో రచ్చ చేస్తోందన్నారు.

# ఘోష్ కమిషన్ నివేదికపై సభలో చర్చిస్తాం: పొన్నం



కరీంనగర్ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్లక్ష్యం చూపడంతో తప్పిదాలు జరిగాయని ఘోష్ కమిషన్ తన నివేదికలో స్పష్టంగా పేర్కొందని, నివేదికపై శాసనసభలో చర్చిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఘోష్ కమిషన్ నివేదికపై సభలో బీఆర్ఎస్ నాయకులు తమ వాదనలు వినిపించాలన్నారు.

కాళేశ్వరంపై కోర్టుకు వెళ్లి అరెస్టు కాకుండా అడ్డుకోవడం, ఇతర ప్రయత్నాలు జరుగుతున్నాయంటే వారు ఎటువంటి ఆందోళనకర పరిస్థితుల్లో ఉన్నారో అర్థమవుతోందన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నాయకులను తప్పించేందుకే బీజేపీ సీబీఐ విచారణ కోరుతోందని ఆయన ఆరోపించారు.

# అస్తవ్యస్తంగా సంక్షేమ హాస్టళ్లు

## ఉన్నతాధికారుల నిర్లక్ష్యం.. వార్డెన్ల ఇష్టారాజ్యం
## ఏసీబీ ఆకస్మిక తనిఖీల్లో బయటపడ్డ బాగోతం




హైదరాబాద్ / రామన్నపేట, : సాంఘిక సంక్షేమశాఖ, ఎస్సీ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలోని కొన్ని హాస్టళ్లు, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం ఏసీబీ అధికారులు నిర్వహించిన అకస్మిక తనిఖీల్లో పలు అవకతవకలు గుర్తించారు. యాదాద్రి - భువనగిరి జిల్లా రామన్నపేటలోని ఎస్సీ విద్యార్థినుల హాస్టల్, నారాయణ పేట జిల్లా దామరగిద్దలోని సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ తనిఖీలు సాగాయి. విద్యార్థులకు నిర్ణీత ప్రమాణాల మేరకు నాణ్యతతో కూడిన ఆహారం సరఫరా, హాస్టళ్లు, కాలేజీల్లో శానిటేషన్, రిజిష్టర్ల ప్రకారం విద్యార్థుల హాజరు ఉందా.. తదితర విషయాల్లో అవకతవకలు జరిగినట్లు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి సవివరమైన నివేదిక పంపుతామన్నారు. రామన్నపేట ఎస్సీ విద్యార్థినుల హాస్టల్ రికార్డుల్లో 40 మంది పేర్లు ఉండగా, వాస్తవంగా 20 మంది విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. స్థానిక హైస్కూల్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 20 మంది ఉదయం అల్పాహారం తిని పాఠశాలకు వెళతారు.

రాత్రి భోజనం తర్వాత ఇళ్లకు వెళ్లిపోతున్నారని విమర్శలున్నాయి. దీంతోపాటు వంటశాల సామగ్రి, నూనె, పప్పు తదితర వివరాలపై దేనికి సరైన సమాధానం చెప్పకపోవడంపై హాస్టల్ వార్డెన్ రాజోల్ బాయిపై నల్లగొండ ఏసీబీ డీఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

హాస్టల్‌లో అవినీతి అక్రమాలు జరుగుతున్నా, ఎందుకు తనిఖీలు చేయడం లేదని ఇన్‌చార్జి అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ భిక్షంను ప్రశ్నించినా సమాధానం రాలేదు. అధికారుల నిర్లక్ష్యం వల్లే హాస్టల్ నిర్వహణ అంతా అస్తవ్యస్తంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్తవ్యస్త రికార్డులపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని జగదీశ్ చందర్ తెలిపారు.

# గవర్నర్లు బిల్లుల్ని తొక్కిపెట్టొచ్చంటే..ద్రవ్యబిల్లునూ ఆపేయొచ్చుగా

- **అలాంటి పరిస్థితి సమస్యాత్మకం: సుప్రీంకోర్టు**
- **శాసనసభ ఆమోదించిన ద్రవ్య బిల్లు గవర్నర్ సూచనలకు భిన్నంగా ఉంటే నిలిపేయొచ్చు**
- **సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వెల్లడి**
- **రాజ్యాంగం ప్రకారం బిల్లులకు ఆమోదం తెలిపే అధికారం రాష్ట్రపతికి, గవర్నర్లకు మాత్రమే ఉంది**
- **సుప్రీంకోర్టులో బీజేపీ పాలిత రాష్ట్రాల వాదన**
- **తమిళనాడు, కేరళ ప్రభుత్వాల వాదనలు**



న్యూఢిల్లీ, : ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో ఆమోదించి పంపిన బిల్లులను తిప్పి పంపకుండా, ఆమోదం తెలపకుండా తొక్కిపట్టడం ద్వారా గవర్నర్లు వాటిని వీటో చేయగలరంటే.. ద్రవ్యబిల్లులను సైతం అలాగే ఆపే అవకాశం ఉందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. అలాంటి పరిస్థితే వస్తే అది సమస్యాత్మకమని వ్యాఖ్యానించింది. అయితే.. బిల్లులకు ఆమోదం విషయంలో గవర్నర్లకు, రాష్ట్రపతికి ఉన్న స్వతంత్ర అధికారాలను బీజేపీ పాలిత రాష్ట్రాలు సమర్థించాయి. చట్టాలకు కోర్టులు ఆమోదం ఇవ్వలేవని.. ప్రతి వ్యాధికీ కోర్టు ఔషధం కాజాలదని వాదించాయి. బిల్లులకు ఆమోదం ఇవ్వగల అధికారం రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతికి, గవర్నర్లకు మాత్రమే ఉందని.. అంతే తప్ప 'ఆమోదం ఇచ్చినట్టుగా పరిగణించడం' అనే పద్ధతే రాజ్యాంగంలో లేదని మహారాష్ట్ర తరఫున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వొకేట్ హరీశ్ సాల్వే స్పష్టం చేశారు. "బిల్లులకు ఆమోదం తెలపాలంటూ కోర్టులు రిట్ ఆఫ్ మాండమస్ జారీ చేయలేవు. ఒక చట్టానికి కోర్టు ఆమోదం ఇవ్వలేదు. ఆ అధికారం గవర్నర్లకు లేదా రాష్ట్రపతికి మాత్రమే ఉంది" అని తేల్చిచెప్పారు. బిల్లులను నిలిపివేయడం అనేది గవర్నర్‌కు ఉన్న నాలుగో ప్రత్యామ్నాయమని (మిగతా మూడూ.. ఆమోదం తెలపడం, శాసనసభకు తిప్పిపంపడం, రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వ్ చేయడం) వివరించారు. బిల్లులకు ఆమోదం ఇవ్వకుండా నిలిపివేసేందుకు గవర్నర్లకు ఉన్న అధికారాన్ని రాజ్యాంగం గుర్తించిందని.. దాన్ని వీటోగా పేర్కొనడం తప్పుదోవ పట్టించడమేనని అభ్యంతరం తెలిపారు. రాష్ట్రాల శాసనసభలు పంపిన బిల్లులకు ఆమోదం తెలపడంపై న్యాయస్థానాలు రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధించగలవా అనే అంశంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యాంగంలోని 143(1) అధికరణం ప్రకారం.. 14 సందేహాలతో సుప్రీంకోర్టుకు లేఖ (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్) రాసిన సంగతి తెలిసిందే. దీనిపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహన్, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. రాజ్యాంగంలోని 200వ అధికరణ ప్రకారం గవర్నర్లకు ఒక బిల్లును శాసనసభకుతిప్పిపంపకుండా తొక్కిపట్టే స్వతంత్ర అధికారం ఉందని అర్థం చేసుకోవడం పట్ల ఆందోళన వెలిబుచ్చింది. దీన్ని ఆమోదిస్తేగనక.. గవర్నర్లు ద్రవ్యబిల్లులకు సైతం ఆమోదం తెలపకుండా నిలిపివేయగలరన్న అర్థం వస్తుందని.. అలాంటి పరిస్థితే వస్తే అది చాలా సమస్యాత్మకమని కోర్టు వ్యాఖ్యానించింది. "గవర్నర్‌కు ఒక బిల్లుకు ఆమోదం తెలపకుండా నిలిపివేసే అధికారం ఉందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అలా (బిల్లుల్ని) తొక్కిపట్టే అధికారాన్ని గవర్నర్లు స్వతంత్రంగా అమలు చేయడం మొదలుపెడితే అది సమస్యగా మారుతుంది. ఎందుకంటే.. ఈ అధికారంతో గవర్నర్లు ద్రవ్యబిల్లుతో సహా ఏ బిల్లునైనా తమ వద్దకు రాగానే నిలిపివేయగలరు" అని జస్టిస్

పీఎస్ నరసింహన్ ఆందోళన వెలిబుచ్చారు.

**ఆ ప్రశ్నే ఉత్పన్నం కాదు..** గవర్నర్ తన వద్దకు వచ్చిన బిల్లు ద్రవ్యబిల్లు కానప్పుడు మాత్రమే దాన్ని శాసనసభ పునః పరిశీలనకు తిప్పి పంపగలరు కదా? మరి ఆర్టికల్ 200లోని ప్రధాన నిబంధన ప్రకారం ద్రవ్య బిల్లును సైతం గవర్నర్ తిరస్కరించవచ్చనే విషయాన్ని మీరెలా సమన్వయం చేస్తారని జస్టిస్ నరసింహన్ ప్రశ్నించగా.. ఈ ప్రశ్నకు సమాధానం రాజ్యాంగంలోని 207వ అధికరణలో ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా జవాబిచ్చారు. గవర్నర్ సూచనతోనే (సిఫారసు) ద్రవ్యబిల్లును సభలో ప్రవేశపెడతారు కాబట్టి.. గవర్నర్ ద్రవ్యబిల్లును నిలిపివేయడమనే సమస్యే ఉత్పన్నం కాదని వివరణ ఇచ్చారు. హరీశ్ సాల్వే జోక్యం చేసుకుని.. సభ ఆమోదించిన బిల్లు గవర్నర్ సూచించినదానికి భిన్నంగా ఉంటే గవర్నర్ దానికి ఆమోదాన్ని నిలిపివేసే సందర్భం తలెత్తవచ్చని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతలే గవర్నర్ల అధికారాలపై ఎలాంటి పరిమితులూ విధించనప్పుడు.. అటువంటి పరిమితులను వ్యాఖ్యానాల (ఇంటర్‌ప్రెటేషన్) ద్వారా విధించలేమని, బిల్లులపై రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితి విధించడం సరైంది కాదని ఆయన స్పష్టం చేశారు. గవర్నర్ ఒక బిల్లును ఎందుకు తొక్కిపట్టారో సమీక్షించే అధికారం కోర్టుకు లేదని ఆయన వాదించారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న సీజేఐ.. "గవర్నర్ ఏదైనా బిల్లుకు ఆమోదం తెలపకుండా నిలిపివేస్తే.. అలా ఎందుకు చేశారని కోర్టు అడగగలదా?" అని ప్రశ్నించగా.. "అడగలేదు" అని సాల్వే తేల్చిచెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం రాష్ట్రపతి/గవర్నర్లు తమ అధికారాలు, బాధ్యతలను నిర్వహించేక్రమంలో తీసుకున్న చర్యల గురించి ఏ కోర్టుకూ జవాబుదారీ కారని చెప్పారు. "మీ నిర్ణయం ఏమిటి?" అని మాత్రమే కోర్టులు వారిని అడగగలవుగానీ.. ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించలేవని స్పష్టం చేశారు.

**భారత రాజ్యాంగంలో లేదు..** ఈ కేసులో కేంద్ర ప్రభుత్వ వాదనలను సమర్థిస్తూ మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల తరఫున సీనియర్ న్యాయవాదులు నీరజ్ కిషన్ కౌల్, మణీందర్ సింగ్ వాదనలు వినిపించారు. ఉత్తరప్రదేశ్, ఒడిసా తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్.. రాష్ట్రపతి, గవర్నర్లకు కార్యనిర్వహణలో స్వతంత్రత ఉందని.. బిల్లులకు ఆమోదం ఇచ్చే విషయంలో వారికి సంపూర్ణ వివేచనాధికారం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన బిల్లుల విషయంలో కోర్టులు వారికి ఎలాంటి గడువూ నిర్దేశించలేవని తెలిపారు. గోవా సర్కారు తరఫున వాదనలు వినిపించిన ఏఎస్జీ విక్రమ్‌జిత్ బెనర్జీ కూడా.. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ ఆమో దం లేనిదే బిల్లు చట్టరూపం దాల్చే ప్రక్రియ సంపూర్ణం కాదని.. కాబట్టి, 'ఆమోదం ఇచ్చినట్టుగా పరిగణించడం' అనే భావనకు అవకాశమే లేదని వాదించారు.

# 1991 లోక్‌సభ ఎన్నికల్లో నన్ను మోసపూరితంగా ఓడించారు



బెంగళూరు, : కొప్పళ లోక్‌సభ స్థానం నుంచి 1991లో తాను జనతా దళ్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు తనను మోసపూరితంగా ఓడించారని కర్ణాటక సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. ఆ ఎన్నికల్లో తనపై కాంగ్రెస్ అభ్యర్థి బసవరాజ్ పాటిల్ అన్వరి గెలిచారని, 11,200 కంటే తక్కువ ఓట్ల మెజార్టీతో విజయం సాధించారని తెలిపారు. అయితే కౌంటింగ్‌లో 22,243 ఓట్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారని, అదే తన ఓటమికి కారణమని, ఆ ఓట్లను లెక్కించి ఉంటే తాను గెలిచేవాడినని వివరించారు. మాజీ అడ్వకేట్ జనరల్ ప్రొఫెసర్ రవివర్మ కుమార్ న్యాయవాద వృత్తిని చేపట్టి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా విధానసౌధలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సిద్దరామయ్య నాటి ఎన్నికల గురించి ప్రస్తావించారు. ఆ సమయంలో రవివర్మ తనకు సాయం చేశారని గుర్తుచేసుకున్నారు. అయితే, ఓట్ల చౌర్యంపై రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్న తరుణంలోనే సిద్దరామయ్య..అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి బసవరాజ్‌పాటిల్ తనపై మోసపూరితంగా గెలిచారని చెప్పడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ మోసం చేసి గెలిచినట్లు సిద్దరామయ్యే స్వయంగా ప్రకటించారని బీజేపీ విమర్శించింది.

# పరాజయం.. విజయానికి సోపానం

## బీజేపీ మాజీ చీఫ్ అన్నామలై



చెన్నై: క్రీడాకారులు ఓటమిచెందితే క్రుంగి పోకూడదని, విజయం కోసం తీవ్రంగా పోరాడాలని, చివరకు ఓటములే విజయానికి సోపానాలవుతాయని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. పుదుకోట సమీపం కీరనూరు వద్ద గన్ షూటింగ్ పోటీల్లో గెలిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్ర రైఫిల్ అసోసియేషన్, పుదుకోట రాయల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో గన్ షూటింగ్ పోటీలు ఈ నెల 22న ప్రారంభమయ్యాయి.

అన్నామలై బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా అన్నామలై తుపాకీ పట్టుకుని లక్ష్యం కేసి కాల్పులు జరిపారు. ఆ తర్వాత విజేతలకు పతకాలను ప్రదానం చేసి ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడలపైనే కాకుండా చదువుపై కూడా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పోటీలో విజేతగా నిలిచిన డీఎంకే ఎంపీ టీఆర్ బాలు మనవడు సూర్యరాజ్‌కు అన్నామలై పతకం ఉన్న ట్యాగ్‌ను మెడలో వేయడానికి ప్రయత్నించినప్పుడు అడ్డుకుని పతకాన్ని చేతిలోకి తీసుకోగా, క్రీడాకారులందరూ అన్నామలైతో గ్రూప్‌ఫొటో తీసుకున్నారు.

# ల్యాబ్‌లో తయారైన మానవ కిడ్నీ

## 34 వారాలు క్రియాశీలకంగా మూత్రపిండం

## ఇజ్రాయెల్ ఆస్పత్రి వైద్యుల సృష్టి



న్యూఢిల్లీ, : కృత్రిమ అవయవాల వైద్యం కొత్త రికార్డులు నెలకొల్పుతోంది. ల్యాబ్‌లో అభివృద్ధి చేసిన ఓ మానవ మూత్రపిండం నమూనా వైద్య చరిత్రలోనే అత్యధిక రోజులు క్రియాశీలకంగా ఉండి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఆ కిడ్నీ ఆర్గనాయిడ్‌ను ఇజ్రాయెల్ డాక్టర్లు ఓ ల్యాబ్‌లో తయారు చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఆ కిడ్నీ రికార్డు స్థాయిలో 34 వారాలకు పైగా పనిచేసింది. ఇది అవయవాల పునరుత్పత్తి వైద్యంలో ఓ మైలురాయిగా అభివర్ణిస్తున్నారు. దీర్ఘకాలం ఉన్న కిడ్నీని ల్యాబ్‌లో సృష్టించడం విజయవంతమైన నేపథ్యంలో ఇక క్లినికల్ పరీక్షలకు సిద్ధమవుతున్నారని ఓ అధ్యయనం వెల్లడించింది. ప్రఖ్యాత ఎంబో జర్నల్ ఆ అధ్యయనాన్ని ప్రచురించింది. ఇజ్రాయెల్‌లోని టెల్ హషోమెర్‌లో ఉన్న షెబా మెడికల్ సెంటర్ బృందం, టెల్ అవీవ్ యూనివర్సిటీతో కలసి 3డీ సింథటిక్ కిడ్నీని అభివృద్ధి చేసింది. గతంలో ఇలాంటి కృత్రిమ కిడ్నీలు నాలుగు వారాలు మాత్రమే ఉంటే.. ఇది అంత కంటే చాలా ఎక్కువ కాలం పనిచేసింది. అయితే ఇది ఇంకా అవయవ మార్పిడికి సిద్ధం కాలేదు. కృత్రిమ అవయవాల్లోని జీవ అణువుల ద్వారా మూత్రపిండాలను మరమ్మతు చేసే అవకాశం ఉందని డాక్టర్ బెంజమిన్ డెకెల్ చెప్పారు.

# భారత్‌లో బయటపడ్డ మరో బంగారు గని..

## ఈ రాష్ట్రంలో 20 మెట్రిక్ టన్నుల పసిడి నిక్షేపాలు..



మన దేశంలో బంగారు గనులు ఎక్కడెక్కడో ఉన్నాయో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ పేరు అందరూ వినే ఉంటారు. కానీ ఇప్పుడు కొత్త పేరు తెరపైకి వస్తోంది. అవును, భారతదేశంలోని ఒక రాష్ట్రంలో భారీ బంగారు నిల్వలు కనుగొనబడ్డాయి. దీని గురించి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ప్రభుత్వం, శాస్త్రవేత్తలు చెప్పేది నిజమైతే.. ఈ ఆవిష్కరణ భారతదేశం దిశను మార్చగలదు. భారతదేశం మరోసారి భారీ బంగారు నిక్షేపాన్ని కనుగొంది. ఒడిశాలోని అనేక జిల్లాల్లో దాదాపు 20మెట్రిక్ టన్నుల బంగారు నిల్వలు ఉన్నాయని అంచనా. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (GSI) ఇటీవల కనుగొన్న తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం, గనుల శాఖ వెంటనే చర్యలు చేపట్టాయి. బంగారం ఎక్కడ దొరికింది?

**ఈ క్రింది జిల్లాల్లో బంగారు నిల్వలు నిర్ధారించబడ్డాయి** : దేవ్‌ఘర్, సుందర్‌గఢ్, నబరంగ్‌పూర్, కియోంఝర్, అంగుల్, ఖాళీ పేజీ, అదనంగా, మయూర్భంజ్, మల్కనగరి, సంబల్పూర్, బౌధ్ జిల్లాల్లో బంగారు నిక్షేపాల కోసం అన్వేషణ కొనసాగుతోంది.

ఎంత బంగారం వచ్చింది?: అధికారిక గణాంకాలు ఇంకా అందుబాటులో లేవు. అయితే, ప్రాథమిక అంచనాల ప్రకారం బంగారు నిల్వలు 10 నుండి 20 మెట్రిక్ టన్నుల వరకు ఉండవచ్చని సూచిస్తున్నాయి. భారతదేశం మొత్తం బంగారు దిగుమతులతో పోలిస్తే ఇది చిన్నదే అయినప్పటికీ, దేశీయ బంగారు ఉత్పత్తిని పెంచే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు.

**ప్రభుత్వ సన్నాహాలు** : ఒడిశా ప్రభుత్వం, ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ (OMC), GSI ఈ ఆవిష్కరణను వాణిజ్యీకరించడానికి వేగంగా పనిచేస్తున్నాయి. దేవ్‌ఘర్ జిల్లాలోని మొదటి బంగారు మైనింగ్ బ్లాక్ వేలానికి సిద్ధమవుతోంది. నిక్షేపం నాణ్యత, దాని మైనింగ్ సామర్థ్యాన్ని నిర్ధారించడానికి G3 నుండి G2 స్థాయిల వరకు వివరణాత్మక డ్రిల్లింగ్, నమూనా సేకరణ జరుగుతోంది.

**ఆర్థిక ప్రభావం** : ఈ బంగారు నిక్షేపాన్ని వాణిజ్యపరంగా తవ్వితే, స్థానిక ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, ఉపాధి, సేవల విస్తరణకు వీలు కల్పిస్తుంది. భారతదేశం బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. ఒడిశాను ఇనుప ఖనిజం, బాక్సైట్‌లకు మాత్రమే కాకుండా బంగారు కేంద్రంగా గుర్తించవచ్చు. ఒడిశాలో ఇప్పటికే భారతదేశంలోని క్రోమైట్‌లో 96శాతం, బాక్సైట్‌లో 52శాతం ఇనుప ఖనిజ నిల్వలు 33శాతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా బంగారు గనులు కూడా ఈ లిస్ట్‌లోకి వచ్చి చేరాయి.

**తదుపరి దశలు ఏమిటి?** : దర్యాప్తు, ప్రయోగశాల విశ్లేషణ తుది నివేదిక అందాల్సి ఉంటుంది. ఆ తర్వాత సాంకేతిక కమిటీల ద్వారా వాణిజ్య సాధ్యాసాధ్యాల మూల్యాంకనం చేస్తారు. పారదర్శక వేలం, పెట్టుబడి ఆకర్షణ. పర్యావరణ, సామాజిక ప్రభావ అధ్యయనం చేస్తారు. మొత్తంమీద ఒడిశాలో ఈ బంగారు నిక్షేపాల ఆవిష్కరణ భారతదేశ మైనింగ్ వ్యూహంలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించగలదు. స్థానిక ప్రజలకు ఆర్థికంగా వరం కాగలదు.

# స్టూడెంట్లకు రాగిజావ అందిస్తున్న విద్యా శాఖ



శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సహకారంతో స్కీమ్ అమలురాష్ట్రంలోని సర్కారు స్కూళ్లలోచదివే విద్యార్థులకు సెప్టెంబరు 1 నుంచి రాగిజావ పంపిణీ చేస్తున్నారు. దీని తయారీకి అవసరమైన రాగి పౌడర్, బెల్లం పౌడర్ను సరఫరా చేస్తున్నారు. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆగష్టు 30 న ఉత్తర్వులు జారీ చేశారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి స్టూడెంట్లకు రాగిజావ అందించనున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం కూడా శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సహకారంతో ఈ స్కీం అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ ట్రస్టురాగి పౌడర్, బెల్లం పౌడర్ను స్కూళ్లకు సరఫరా చేస్తోందన్నారు. రాగిజావను తయారు చేసి, అందించినందుకు ప్రతి గ్లాసుకు రోజుకు 25 పైసల చొప్పున చార్జీలను సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ కు చెల్లించనున్నారు.

**రెండున్నర నెలల ఆలస్యం...** రాష్ట్రవ్యాప్తంగా 25 వేల బడుల్లో పీఎం పోషణ్ కింద సుమారు 18 లక్షల మందికి మిడ్డే మీల్స్ అందిస్తు న్నారు. అయితే, పిల్లలో పోషకాహార లోపాన్ని నివా రించేందుకు రెండేండ్లుగా రాగిజావ అందిస్తున్నారు. వారంలో మూడు రోజులు కోడిగుడ్డు, మరో మూడు రోజులు రాగిజావ ఇస్తున్నారు. వరుసగా మూడోఏటా అందించేందుకు స్కూల్ ఎడ్యుకేషన్ అధికా రులు... విద్యా శాఖ, ఫైనాన్స్ శాఖ ఉన్నతాధికారుల కు ప్రపోజల్స్ పెట్టారు. ఏటా సుమారు రూ. 35 కోట్ల వరకూ నిధులు అవసరం కాగా, వీటిలో ఏడాది 60 శాతం శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు వాళ్లే పెట్టుకో నుండగా, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం అందించను న్నది. ఈ ఏడాది జూన్ 12న స్కూళ్లు ప్రారంభమైనా.. ఫైల్కు ఫైనాన్స్ అధికారులు ఆమోదం తెలపలేదు.

సెక్రటేరియెట్ విద్యా శాఖ ఆఫీసర్లు పట్టించుకోక పోవడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. తర్వాత యూనియన్ల నేతలు, పేరెంట్స్ నుంచి ఒత్తిడి పెరగడంతో గత నెలలో ఫైనాన్స్ శాఖ ఆ ఫైల్ కు క్లియరెన్స్ ఇచ్చింది. కానీ.. విద్యా శాఖ అధికారులు అనుమతించేందుకు మరో నెలన్నర టైమ్ తీసుకున్నారు. తాజాగా సెప్టెంబరు 1 నుంచి అందించేందు కు ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే ఇప్పటికే కొన్ని స్కూల్స్ లో ప్రారంభం అయ్యింది.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్



గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ను ఖరారు చేస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇదే కోటాలో ఏడాది కింద ఎమ్మెల్సీలుగా నియమితులైన కోదండరాం, అమేర్ అలీఖాన్ సభ్యత్వాలను సుప్రీంకోర్టు ఇటీవల రద్దు చేసింది. తిరిగి కొత్త పేర్లను సిఫార్సు చేయవచ్చని చెప్పింది. ఈ నేపథ్యం లో ఆగష్టు 30న జరిగిన మీటింగ్లో కోదండరాం, అజారుద్దీన్ను ఎంపిక చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కోదండరాంకు మళ్లీ అవకాశం కల్పిం చగా, అమేర్ అలీఖాన్ స్థానంలో అనూహ్యంగా అజారుద్దీన్ను ఎంపిక చేసింది.

# ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే..ఎన్డీయేకు 324 సీట్లు

## ఇండీ కూటమికి 208 మాత్రమే.. ఇండియా టుడే-సీ ఓటర్ సర్వే
## బిహార్‌లో ఎన్డీయేదే విజయం..టైమ్స్ నౌ- జేవీసీ సర్వేలో వెల్లడి




న్యూఢిల్లీ, : ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు 324 సీట్లు వస్తాయని ఇండియా టుడే-సీ ఓటర్ 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే అంచనా వేసింది. ఇందులో బీజేపీ 260 స్థానాలు సాధిస్తుందని పేర్కొంది. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కంటే బీజేపీకి స్థానాలు పెరిగినా... వచ్చేసారీ సొంతంగా ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన బలం (272) దక్కదని తెలిపింది. ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఇండీ కూటమికి 208 సీట్లు మాత్రమే లభిస్తాయని పేర్కొంది. గత ఎన్నికల్లో మొత్తం 543కు బీజేపీ కేవలం 240 స్థానాలే గెలుచుకుంది. ఇది సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కావాల్సిన 272 స్థానాల కంటే 32 తక్కువ. అయితే భాగస్వామ్య పక్షాలతో కలిపితే ఎన్డీయేకు 293 స్థానాలు వచ్చాయి. ఇండి కూటమి 234 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయాలతో ఎన్డీయే పుంజుకున్నట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేను జూలై 1, ఆగస్టు 14 మధ్య నిర్వహించారు. అన్ని లోక్‌సభ స్థానాల్లోని 54,788 మంది అభిప్రాయాలను సేకరించారు. ఇంకోవైపు.. త్వరలో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం తథ్యమని టైమ్స్ నౌ-జేవీసీ సర్వే అంచనా వేసింది. మొత్తం 243 స్థానాలకు ఎన్డీయే 136 స్థానాలు గెలుచు కుంటుందని పేర్కొంది. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాగఠ్‌బంధన్ 75 స్థానాలకే పరిమితమవుతుందని తెలిపింది. ఆర్జేడీ 52, కాంగ్రెస్ 10 స్థానాలకు పరిమితమవుతాయని సర్వే అంచనా వేసింది. గత ఎన్నికలతో పోలిస్తే ఆర్జేడీకి 23, కాంగ్రెసకు 9 సీట్లు తగ్గుతాయని పేర్కొంది.

# పరిశ్రమల్ని ఆదుకోండి



చెన్నై, : అమెరికా విధించిన సుంకాల ప్రభావం తమిళనాడులోని సముద్ర ఉత్పత్తులు, వస్త్ర పరిశ్రమపై తీవ్రంగా పడే సూచనలు కనిపిస్తున్నాయి. తూత్తుకుడిలో ని సీఫుడ్స్ సంస్థల్లో 50%ఉత్పత్తి నిలిచిపోయింది. తిరుప్పూరులో 35 లక్షల బనియన్లు కర్మాగారాల్లో పేరుకుపోయాయి. అమెరికా దిగుమతి చేసుకునే సీఫుడ్స్‌లో 26.5% దాకా భారత్ నుంచే వెళుతుంది.

తమిళనాడులో 25 దాకా సీఫుడ్స్ ఎగుమతి సంస్థలుండగా, వీటిల్లో 11 సంస్థలు తూత్తుకుడిలోనే నడుస్తున్నాయి. ఈ సంస్థల నుంచే అమెరికాకు చేపలు, రొయ్యలు, పీతలు ఎగుమతి చేస్తున్నారు. అమెరికా సుంకాలదెబ్బతో ప్రస్తుతం 50% దాకా ఎగుమతి నిలిపేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని ఆదుకోవాలంటూ ప్రధాని మోదీని సీఎం స్టాలిన్ కోరారు. గత ఏడాది భారతదేశం నుండి రూ.60 వేల కోట్ల విలువైన సీఫుడ్స్ అమెరికాకు ఎగుమతి అయ్యాయి.

# రూ. 12,328 కోట్లతో నాలుగు ప్రధాన రైల్వే ప్రాజెక్టులు




న్యూఢిల్లీ : కేంద్ర క్యాబినెట్ ఢిల్లీలో సమావేశమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నాలుగు కొత్త రైల్వే ప్రాజెక్టులు, అమెరికాతో వాణిజ్య వ్యవహారాలు, టారిఫ్‌లు, ఆర్థిక ప్రణాళికలపై కేంద్ర మంత్రి వర్గం దృష్టి సారించింది. మొత్తం మూడు గంటల పాటు ఈ సమావేశం జరిగింది.

రూ. 12,328 కోట్ల ఖర్చుతో నాలుగు ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కచ్‌లోని దూర ప్రాంతాల కలయిక, పర్యాటకానికి ఊపిరినిచ్చేలా ఈ కొత్త ప్రాజెక్టులు చేపడుతున్నారు. రణ్ ఆఫ్ కచ్, హరప్పా స్థలం ధోలవిరా, కోటేశ్వర్ ఆలయం, నారాయణ సరోవర్, లాఖ్‌పట్ కోటకు రైలు సదుపాయం కల్పించ సంకల్పించారు. దీని ద్వారా ఈ ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో 251 లక్షల మానవ పని దినాల ఉపాధి కలుగుతుంది.

ఈ ప్రాజెక్టుల వల్ల బొగ్గు, సిమెంట్, స్టీల్, కంటైనర్లు, ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తులు, పెట్రోలియం ఉత్పత్తుల రవాణాకు పెద్ద మేలు జరుగుతుంది. లాజిస్టిక్ ఖర్చులు తగ్గుతాయి. పర్యావరణ హితం, $CO_2$ ఉద్గారాల నియంత్రణ కలుగుతుంది. కర్ణాటక, తెలంగాణ, బిహార్, అసోం రాష్ట్రాలకు మల్టీ–ట్రాకింగ్ ద్వారా కనెక్టివిటీ పెంపు జరుగుతుంది. ఈ ప్రాజెక్టు వల్ల 13 జిల్లాలు లబ్ధి పొందుతాయి. 565 కిలోమీటర్ల కొత్త రైల్వే మార్గాల కలయిక జరుగుతుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా 360 కోట్ల కిలోల $CO_2$ తగ్గింపు జరుగుతుంది. ఇది 14 కోట్ల చెట్ల నాటిన దానికి సమానమైన ప్రయోజనం ఇస్తుంది.

అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలపై చర్చ, తక్షణ చర్యలపై కేంద్ర క్యాబినెట్ చర్చించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం భారతీయ ఎగుమతులపై 50% టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో, ఈ మీటింగ్‌లో దీని ప్రభావాలను అంచనా వేసి, తీసుకోవాల్సిన ప్రణాళికల్ని రూపొందించారు. అటు గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వెహికల్స్ (EV) రంగానికి ప్రోత్సాహంపైనా చర్చించారు. మోదీ ఇటీవల గుజరాత్‌లో ప్రారంభోత్సవం చేసిన Suzuki e-Vitara గురించి కూడా క్యాబినెట్ చర్చించింది. డిఫెన్స్, స్పేస్ రంగాల్లో ప్రగతి గురించి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా స్పేస్ మిషన్ విజయాన్ని ఈ మీటింగ్ లో స్వాగతించారు.

ప్రధాన మంత్రి స్వనిధి (PM SVANidhi) యోజన పునర్వ్యవస్థీకరణ, విస్తరణ గురించి క్యాబినెట్ చర్చించింది. ఈ పథకాన్ని 31 మార్చి 2030 వరకు విస్తరించారు. మొత్తం బడ్జెట్: రూ. 7,332 కోట్లు. ఈ పథకం కింద 1.15 కోట్లకు పైగా స్ట్రీట్ వెండర్లు (వీధి వ్యాపారులు) ప్రయోజనం పొందుతారు. ఇది చిన్న వ్యాపారులను ఆత్మనిర్భర్‌గా మార్చడానికి సహాయపడుతుంది. చిన్న వ్యాపారులకు రుణాలు,

ఆర్థిక సహాయం అందించేందుకు ఈ పథకం రూపొందించబడింది.
- PM స్వనిధి పథకం గడువు 2030 మార్చి 31 వరకు పొడిగింపు
- పథకం వ్యయం - రూ. 7,332 కోట్లు
- 1.15 కోటి వీధి వ్యాపారులకు లబ్ధి, వీరిలో 50 లక్షల మంది కొత్త లబ్ధిదారులు
- మొదటి రుణం: రూ. 15,000 - రెండో రుణం: రూ. 25,000 - మూడో రుణం: రూ. 50,000
వీధి వ్యాపారులకు అందుబాటులోకి UPI లింక్ RuPay క్రెడిట్ కార్డు
- డిజిటల్ లావాదేవీలపై గరిష్టంగా రూ. 1,600 క్యాష్‌బ్యాక్
- FSSAI తో కలిసి వీధి ఆహార వ్యాపారులకు హైజీన్ & ఫుడ్ సేఫ్టీ శిక్షణలు
- SVANidhi se Samriddhi కింద నెలవారీ లోక్ కళ్యాణ్ మేళాలు
- ఇప్పటివరకు 96 లక్షల రుణాలు - రూ. 13,797 కోట్లు పంపిణీ
- 47 లక్షల లబ్ధిదారులు 557 కోట్ల డిజిటల్ లావాదేవీలు -- రూ. 6.09 లక్షల కోట్లు
- ఈ పథకానికి PM అవార్డు (2023), సిల్వర్ అవార్డు (2022) అవార్డులు

# వ్యక్తిగత దాడులే ఆర్ఎస్ఎస్ విధానం

## గాంధీజీపైనా అదే పని చేశారు: రాహుల్ గాంధీ
## కుట్రతో ఓట్ల చోరీకి పాల్పడుతున్నారు: ప్రియాంకాగాంధీ



అరారియా, మధుబని, సుపాల్(బిహార్), : వ్యక్తిగత దాడులే ఆర్ఎస్ఎస్ విధానమని.. జాతిపిత మహాత్మాగాంధీ పైనా వారు అదే పని చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మంగళవారం ఆరోపించారు. బిహార్‌లో కాంగ్రెస్ మిత్రపక్షాలైన మహాఘట్‌బంధన్ సభ్యులతో నిర్వహించిన చర్చలో ఈమేరకు పేర్కొన్నారు.

దీనికి సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆ వీడియోలో ఒక దాబా వద్ద రాహుల్‌గాంధీ ఆర్జేడీకి చెందిన తేజస్వియాదవ్, సీపీఐ ఎంఎల్‌కి చెందిన దీపాంకర్ భట్టాచార్య, మహాత్మాగాంధీ ముని మనవడు తుషార్‌గాంధీ, బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేషకుమార్‌లతో కలిసి టీ తాగుతూ కనిపించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. గాంధీజీపై ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ అబద్ధాలే ప్రచారం చేసిందన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో వ్యక్తిగత దాడులు చేయడం అధికారికం అయిపోయిందని తుషార్‌గాంధీ అన్నారు. తేజస్వియాదవ్ మాట్లాడుతూ.. 2014 నుంచే ఈ సంస్కృతి మొదలైందని పేర్కొన్నారు. కాగా బిహార్‌లోని సుపాల్‌లో మంగళవారం జరిగిన ఓటర్ అధికార్ యాత్ర కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకాగాంధీ వాద్రా మాట్లాడుతూ.. ప్రత్యేక ఓట్ల తనిఖీ ద్వారా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం బిహార్‌లో కుట్రపూరితంగా ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఈమేరకు ఆమె 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# ట్రంప్ సుంకాలను.. ఎలా ఎదుర్కొందాం

- ట్రంప్ సుంకాలపై కేంద్రం కసరత్తు.. అమెరికాయేతర మార్కెట్లకు విస్తరణ
- 40 కీలక దేశాల గుర్తింపు.. భారతీయ ఉత్పత్తుల ఎగుమతుల పెంపునకు కార్యాచరణ
- ఎగమతిదార్లను ఆదుకోవడం కోసం రూ.25 వేల కోట్లతో మిషన్
- స్టాక్‌మార్కెట్లపై సుంకాల ప్రభావం.. రెండు రోజుల్లో రూ.9.6 లక్షల కోట్ల నష్టం




న్యూఢిల్లీ, : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలతో.. ఇప్పటి వరకూ ఆ దేశానికి భారత్ నుంచి వెళ్తున్న దాదాపు 4,820 కోట్ల డాలర్ల (రూ.4,22,384 కోట్ల) విలువైన ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. సుంకాల వల్ల అమెరికా మార్కెట్లలో భారతీయ సరుకుల ధరలు భారీగా పెరిగిపోవటంతో.. ఇతర దేశాల (సుంకం పోటు తక్కువగా ఉన్న దేశాల) సరుకులతో పోటీ పడలేని పరిస్థితి. మరి, ఇంత భారీ నష్టాన్ని భర్తీ చేసుకునేదెలా? ప్రస్తుతం కేంద్ర సర్కారు దీనిపైనే తీవ్రంగా కసరత్తు జరుపుతోంది. ఇందులో భాగంగా, ఇక మీదట అమెరికాయేతర దేశాల మార్కెట్లపై ఎక్కువగా దృష్టి సారించాలని నిర్ణయించింది. వీటిలో బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, నెదర్లాండ్స్, పోలండ్, కెనడా, మెక్సికో, రష్యా, బెల్జియం, టర్కీ, యూఏఈ, ఆస్ట్రేలియా తదితర 40 దేశాలున్నాయి. ఈ దేశాల్లో ఇతర సరుకులతోపాటు వస్త్ర పరిశ్రమ ఎగుమతులకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది (అమెరికా సుంకాలతో తీవ్రంగా నష్టపోతున్నది వస్త్ర పరిశ్రమనే). దీనిపై ఓ అధికారి మాట్లాడుతూ, 'ప్రతీ దేశంలోనూ లక్ష్యిత వ్యూహంతో ముందుకెళ్లాలని అనుకుంటున్నాం. నాణ్యమైన, వినూత్నమైన ఉత్పత్తులను ఎగుమతి చేయటమేకాదు.. ఆయాదేశాలు ఆధారపడతగిన, విశ్వసించదగిన సరఫరాదారుగా పేరు తెచ్చుకునేలా కృషి చేస్తాం. ఈ కార్యాచరణలో ఆయాదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలతోపాటు 'ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు' కూడా కీలకపాత్ర పోషించనున్నాయి' అని వెల్లడించారు.

**220 దేశాలకు ఎగుమతులు** : భారత్ ప్రపంచవ్యాప్తంగా 220కిపైగా దేశాలకు ఎగుమతులు చేస్తోంది. వీటిలో బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియాలతో కూడిన 40 దేశాలు అత్యంత కీలకమైనవి. ఈ దేశాలు ఏటా 59,000 కోట్ల డాలర్ల (రూ.51,70,000 కోట్లు) విలువైన జౌళి ఉత్పత్తులు, వస్త్రాలను దిగుమతి చేసుకుంటున్నాయి. ఇంతటి భారీ మార్కెట్లో మనదేశం వాటా 5-6% మాత్రమే. అంటే, ఈ దేశాల్లో మన మార్కెట్ వాటాను పెంచుకోవటానికి పుష్కలమైన అవకాశాలున్నాయి. దీనివల్లే ట్రంప్ సుంకాల నేపథ్యంలో.. వీటిపై కేంద్రం దృష్టి పెట్టింది. ఈ కార్యాచరణలో కీలకంగా భావిస్తు న్న ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు.. ఆయా దేశాల్లో మార్కెట్ మ్యాపింగ్,

అధిక డిమాండ్ ఉన్న ఉత్పత్తుల గుర్తింపు మీద నిశితమైన అధ్యయనం జరిపి మార్గదర్శకాలను వెలువరిస్తాయి. అంతర్జాతీయ ట్రేడ్‌ఫెయిర్లలో, ఎగ్జిబిషన్లలో, కొనుగోలు-అమ్మకందారు సమావేశాల్లో భారత్ బ్రాండ్‌ను బలంగా ముందుకు తీసుకెళ్తాయి. భారత ఎగుమతిదారులు అంతర్జాతీయ ప్రమాణాలను పాటించేలా చేయటం, ఆయాదేశాల మార్కెట్లలోకి వెళ్లటానికి అవసరమైన పత్రాలను సంపాదించుకోవటంలో దిశానిర్దేశం చేస్తాయి. మరోవైపు, భారతీయ ఎగుమతిదారులను రక్షించటానికి రూ.25 వేల కోట్లతో 'ఎగుమతి ప్రోత్సాహక మిషన్'ను ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. కాగా, ట్రంప్ సుంకాలతో వస్త్రాలు, ముత్యాలు, ఆభరణాలు, రొయ్యలు, లెదర్ పరిశ్రమలపై ముఖ్యంగా.. ఎక్కువ మంది కార్మికులు పని చేసే రంగాలపై తీవ్రంగా ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో, ఆయా రంగాలకు చెందిన ఎగుమతిదారులతో ఈ వారంలో కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ సమావేశం కానుంది. ప్రత్యామ్నాయాల అన్వేషణ, అమెరికాయేతర మార్కెట్లకు ప్రాధాన్యం, కొత్త మార్కెట్లలోకి వెళ్లటం తదితర అంశాలను సమగ్రంగా చర్చించనున్నట్లు సమాచారం. ప్రస్తుతానికైతే, అమెరికా సుంకాలకు పోటీగా ఆ దేశంపై ప్రతీకార సుంకాలు విధించే యోచన ఏమీ లేదని అధికారవర్గాలు తెలిపాయి.

**స్టాక్‌మార్కెట్ల పతనం** : అమెరికా 50% సుంకాల ప్రభావం తీవ్రంగానే ఉంటోంది. మంగళ, గురువారాల్లో స్టాక్‌మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా, మదుపరులు రూ. 9.6 లక్షల కోట్ల మేర నష్టపోయినట్లు మార్కెట్ నిపుణులు అంచనా వేశారు.

# స్వదేశీ ఉత్పత్తులనే వాడుదాం.. ఆర్థికంగా మరింత రాణిద్దాం..

## పెట్టుబడి ఎవరు పెట్టినా ఉత్పత్తులు మనదేశంలో జరగాలి: మోదీ

అహ్మదాబాద్ / న్యూఢిల్లీ, : రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మనదేశంపై విధించిన 25% అదనపు సుంకాల అమలుకు ఒకరోజు ముందు ప్రధాని మోదీ 'స్వదేశీ ఉత్పత్తుల' ఆవశ్యకతను నొక్కి చెప్పారు. స్వదేశీ, మేక్ ఇండియా అనేవి కొత్త కొలువులు సృష్టించేందుకు సహాయపడతాయని పేర్కొన్నారు.



పెట్టుబడులు ఎక్కడి నుంచి వచ్చినా ఉత్పత్తి మాత్రం మనదేశంలోనే జరగాలని స్పష్టం చేస్తూ.. స్వదేశీ అనేది ప్రతి ఒక్కరి జీవిత మంత్రంగా ఉండాలని పిలుపునిచ్చారు. రానున్న ఐదారేళ్లలో జపాన్ సంస్థ సుజుకి మోటర్ కార్పొరేషన్ భారత్‌లో రూ.70వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించిన సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లోని హన్సల్‌పూర్ కర్మాగారంలో విదేశాల ఎగుమతుల కోసం 'విటారా' అనే ఎలక్ట్రిక్ వాహనాలను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ నుంచి తయారైన మొట్టమొదటి వాహనాన్ని మోదీ మంగళవారం ఇక్కడ జెండా ఊపి ఎగుమతులను లాంఛనంగా ప్రారంభించారు. అలాగే ఈవీల్లో కీలకమైన లీథియం-అయాన్ బ్యాటరీ, సెల్, ఎలక్ట్రోడ్ ఉత్పత్తుల ఫ్యాక్టరీని కూడా మోదీ ప్రారంభించారు. కాగా, ప్రధాని మోదీ రెండ్రోజుల పర్యటన నిమిత్తం (28న) జపాన్ బయల్దేరనున్నారు. 29, 30 తేదీల్లో ఆ దేశ ప్రధాని షిగెరు ఇషిబాతో కీలక చర్చలు జరుపనున్నారు. 15వ భారత్-జపాన్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఇషిబాతో మోదీ సమావేశం కానుండడం ఇదే మొదటిసారి. 2014లో ఆయన ప్రధానిగా పగ్గాలు స్వీకరించాక జపాన్ వెళ్లడం ఇది ఎనిమిదో సారని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. 'అటు నుంచి అటే చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సుకు వెళ్తారు. 31, 1 తేదీ ల్లో అక్కడే ఉంటారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో వేర్వేరుగా ము ఖాముఖి భేటీలు నిర్వహిస్తారు' అని ఆయన తెలిపారు.

# పిల్లల ఆధార్ బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేయండి

## 5, 15 సంవత్సరాల వయస్సులో ఇది తప్పనిసరి
## లేకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు: ఉడాయ్ చీఫ్




న్యూఢిల్లీ, : దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల ఆధార్ వేలిముద్రలను అప్‌డేట్ చేయాలని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సంస్థ చీఫ్ భువనేశ్ కుమార్.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. పాఠశాలల్లో ప్రత్యేక క్యాంపులను నిర్వహించాలని ఆయన తన లేఖలో కోరారు. ఎదిగే పిల్లల బయోమెట్రిక్స్‌లో మార్పులు చోటుచేసుకుంటాయి. అందుకు అనుగుణంగా ఐదు నుంచి ఏడు సంవత్సరాల వయస్సులో, 15-17 సంవత్సరాల వయస్సులోనూ బయోమెట్రిక్స్‌ను అప్‌డేట్ చేయడం తప్పనిసరి(ఎంబీయూ). ఈ రెండు సందర్భాల్లోనూ ఈ సర్వీసు పూర్తి ఉచితం. ఆధార్ అప్‌డేట్ చేయకపోతే నీట్, జేఈఈ, సీయూఈటీ పరీక్షలకు హాజరయ్యే, ప్రభుత్వ పథకాలను అందుకునే విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉందని ఉడాయ్ చీఫ్ హెచ్చరించారు.

# పహల్గామ్ ఉగ్రదాడిపై ఎన్ఐఏ కీలక ప్రకటన..




జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్, బైసరన్ లోయలో జరిగిన ఉగ్రదాడిపై ఎన్ఐఏ స్పందించింది. దాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల సంఖ్యపై అధికారిక ప్రకటన చేసింది. పహల్గామ్ ఉగ్రదాడిలో లష్కరే తోయిబాకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు మాత్రమే పాల్గొన్నారని వెల్లడించింది. 'ఆపరేషన్ మహదేవ్' తర్వాత ఎన్ఐఏ మొదటిసారిగా అధికారిక ప్రకటన చేసింది. పహల్గామ్ ఉగ్రదాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల సంఖ్యపై ఎన్ఐఏ అధికారిక ప్రకటన ఇవ్వడం వెనుక ఓ బలమైన కారణం ఉంది.

పహల్గామ్ ఉగ్రదాడి నుంచి ప్రాణాలతో బయటపడిన బాధితులు తమపై నాలుగు నుంచి ఐదుగురు ఉగ్రవాదులు దాడి చేసినట్లు చెప్పారు. జమ్మూకాశ్మీర్ పోలీసులు కూడా నలుగురి కంటే ఎక్కువమందే దాడిలో పాల్గొన్నారని, ఉగ్రవాదులతోపాటు స్థానికులు కూడా భాగమయ్యారని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే ఎన్ఐఏ స్పష్టత ఇచ్చింది. పాకిస్తాన్‌కు చెందిన ముగ్గురు టెర్రిస్టులు మాత్రమే ఈ దాడిలో పాల్గొన్నారని స్పష్టం చేసింది. ఎన్ఐఏ దర్యాప్తులో ఏం తేలిందంటే.. ఆ ముగ్గురు బైసరన్ లోయలో దాడి చేయడానికి ముందు రెక్కీ నిర్వహించారు.

ఆ లోయ నిర్మానుష ప్రదేశంలో ఉండటం.. పోలీసుల బందోబస్తు తక్కువగా ఉండటంతో దాన్నే ఎంచుకున్నారు. ఎక్కువ మంది టూరిస్టులు అక్కడి వస్తుండటం కూడా ఓ ప్రధాన కారణం. ఆ ముగ్గురు ఉగ్రవాదులు 3 వేలు ఖర్చు పెట్టి అక్కడే బస చేశారు. ఉగ్రవాదులకు బస ఏర్పాటు చేసిన వారిని కూడా ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. 'ఆపరేషన్ మహదేవ్' పేరుతో భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం వేట మొదలెట్టాయి. జులై నెలలో ముగ్గుర్నీ కాల్చి చంపేశాయి. ఈ విషయాన్ని రాజ్యసభలో కేంద్ర మంత్రి అమిత్ షా స్వయంగా వెల్లడించారు.

# అక్రమాస్తుల కేసులో ఖిలా వరంగల్ తహసీల్దార్ అరెస్టు

## రూ.5.02 కోట్ల విలువైన ఆస్తులు గుర్తింపు



హైదరాబాద్ / వరంగల్ : ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఫిర్యాదుపై ఖిలా వరంగల్‌లోని తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. ఒకేసారి ఏకకాలంలో ఏడు చోట్ల (హనుమకొండ, ఖమ్మం జిల్లాలతోపాటు ఖిలా వరంగల్ కార్యాలయం) తనిఖీలు కొనసాగాయి. సోదాల తర్వాత నాగేశ్వర్ రావును అరెస్టు చేశామని ఏసీబీ డీజీ విజయ్ కుమార్ తెలిపారు. తమ తనిఖీల్లో దొరికిన ఆస్తుల విలువ రూ. 5,02,25,198 కోట్లు ఉంటుందని వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య చెప్పారు. ఆయన ఆస్తుల చిట్టాతో తమ కళ్లు బైర్లు కమ్మాయన్నారు. ఆయనకు రూ.. 1,15,00,000 కోట్ల విలువ 17.10 ఎకరాల విస్తీర్ణంలోని ఇల్లు, రూ. 1,42,98,500 విలువైన 70 గ్రాముల బంగారు ఆభరణాలు (రూ. 23,84,700), 1,791 గ్రాముల వెండి (రూ. 92,000), ఐదు వాహనాలు (రూ. 34.78 లక్షలు), 23 చేతి గడియారాలు (రూ. 3,28,195), గృహోపకరణాలు (రూ. 16,43,303) ఉన్నట్లు చెప్పారు.

నాగేశ్వర్‌రావు అదనపు ఆస్తుల ధ్రువీకరణ జరుగుతుందని, నిందితుడిపై అక్రమాస్తుల కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని సాంబయ్య తెలిపారు. బండి నాగేశ్వర్‌రావు ఇళ్లలో ఏసీబీ దాడులతో ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు రెవెన్యూశాఖలో కలకలం రేపింది. గతంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి, కాజీపేటతోపాటు ఖిలా వరంగల్‌లోనూ తహసీల్దార్‌గా చేయి తడపందే ఏ పని చేయడన్న విమర్శలున్నాయి. ఆయన సొంత జిల్లా ఖమ్మంలో రియల్ ఎస్టేట్ వెంచర్‌లు చేస్తాడని సమాచారం.

# నీటిపారుదలలో ముగిసిన పదోన్నతులు

## 33 ఏళ్ల తర్వాత డీపీసీ ద్వారా ప్రక్రియ

## మంత్రి ఉత్తమ్ చొరవతో వీడిన 'సీనియారిటీ' వివాదం

హైదరాబాద్, : రాష్ట్ర నీటి పారుదల శాఖలో 33 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత.. శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) ద్వారా చేపట్టిన పదోన్నతుల ప్రక్రియ ముగిసింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా (ఏఈఈ) ఉన్న 91 మందికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (డీఈఈ)గా, డీఈఈలుగా ఉన్న 91 మందికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఈఈ) గా పదోన్నతికి డీపీసీ ఆమోదం తెలిపింది. చీఫ్ ఇంజనీర్ (ఎంక్వయిరీస)గా పనిచేస్తున్న మహ్మద్ అంజద్ హుస్సేన్‌కు రెగ్యులర్ ఈఎన్సీ(జనరల్)గా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో నీటిపారుదలశాఖలో ప్రతీ దశలో పదోన్నతుల ప్రక్రియ పూర్తయినట్లైయింది. కాగా, గత మూడు దశాబ్దాల కాలంలో డీపీసీ లేకుండా, నిబంధనలు సవరించి తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతులు ఇస్తూ వచ్చారు.

ఈసారి మాత్రం డీపీసీని ఏర్పాటు చేసి ఆ ప్రక్రియ పూర్తి చేశారు. నీటిపారుదలశాఖలో మూడు దశాబ్దాలుగా డీపీసీ లేకపోవటానికి సీనియారిటీ వివాదమే కారణమని తేలటంతో ఈ అంశంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవ చూపారు. జనవరి 10వ తేదీన ప్రభుత్వానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు వెలువడింది.

దాంతో వెనువెంటనే అన్ని స్థాయిల్లో పదోన్నతులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. కాళేశ్వరం కుంగుబాటుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేయడంతో.. ఆ జాబితాలో ఉన్నవారందరికీ ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. షోకాజ్ నోటీసులు అందుకున్న వారిని పదోన్నతుల ప్రక్రియ నుంచి తప్పించి.. మిగిలిన వారికి ప్రమోషన్లు ఇచ్చారు.

# మట్టి గాజులు, డిక్షనరీల చాటున మాదక ద్రవ్యాలు!

- ఏడాదిలో రూ.100 కోట్ల విలువైన డ్రగ్స్ సరఫరా
- కొరియర్ పార్సిళ్ల ద్వారా దేశవ్యాప్తంగా తరలింపు
- ఢిల్లీలో ఉన్న 10 కొరియర్ కంపెనీలపై 'ఈగల్' నిఘా
- నైజీరియన్ సూత్రధారి నిక్ కోసం గాలింపు
- మహీంద్రా వర్సిటీలో 14మంది విద్యార్థులకు టెస్టులు
- ఐదుగురికి పాజిటివ్.. తల్లిదండ్రులకు సమాచారం

హైదరాబాద్, : గంజాయి, డ్రగ్స్ రవాణాకు ఆయా ముఠాలు.. సరి కొత్త దారులను ఎంచుకుంటున్నాయి. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, మట్టి గాజుల పార్సిళ్లలో డ్రగ్స్ పెట్టి.. దర్జాగా కొరియర్‌లోనే పంపిస్తున్నాయి. ఎక్కడా లింకులు బయటపడ కుండా గుట్టుగా దందా కొనసాగిస్తున్నాయి. ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న పది కొరియర్ సంస్థల ద్వారా ఏడాదిలోనే రూ. 100కోట్లకుపైగా విలువైన డ్రగ్స్‌ను దేశవ్యాప్తంగా తరలించినట్లు







తెలిసింది. హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థుల డ్రగ్స్ దందాను ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్) బృందాలు ఇటీవల బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ సందర్భంగా పలు సంచలన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మల్నాడు కిచెన్ కేసులో కొరియర్ పార్సిళ్ల ద్వారా హైదరాబాద్‌కు డ్రగ్స్ చేరుతున్నట్లు గుర్తించిన ఈగల్ బృందాలు.. ఆపై ఢిల్లీలో నిఘా పెట్టగా పది కొరియర్ సంస్థల నుంచి నిక్ అతని అనుచరులు దేశంలోని వివిధ ప్రాంతాలకు డ్రగ్స్‌ను పంపిస్తున్నట్లు తెలిసింది.

ఈ మేరకు ఆయా రాష్ట్రాల పోలీసులను ఈగల్ బృందాలు అప్రమత్తం చేశాయి. ఎండీఎంఏ, కొకైన్, ఓజీ (ఓషన్‌గంజా) కుష్ వంటి మత్తు పదార్థాలను మట్టి గాజులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల మధ్య పెట్టి కొరియర్ చేసినట్లు ప్రస్తావించాయి. స్మగ్లింగ్‌కు ఢిల్లీలో నివసిస్తున్న నైజీరియన్ సూత్రధారి అని ఈగల్ అధికారులు భావిస్తున్నారు. అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు సమాచారం. కాగా, మహీంద్ర యూనివర్సిటీలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు సహా మరో ప్రైవేటు వ్యక్తిని ఇటీవల ఈగల్ అధికారులు డ్రగ్స్ కేసులో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వీరి వద్ద దొరికిన వివరాల ఆధారంగా యూనివర్సిటీలోని 50మంది విద్యార్థులు తరచూ డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో అనుమానిత విద్యార్థులకు కొన్నిరోజులుగా డ్రగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తాజాగా 14మంది విద్యార్థులకు డ్రగ్ టెస్టు నిర్వహించగా... ఐదుగురికి పాజిటివ్ వచ్చినట్లు సమాచారం. వారి తల్లితండ్రులను పిలిపించి, బాధితులను రీహాబిలిటేషన్ సెంటర్లకు తరలించడానికి ఈగల్ బృందాలు ప్రయత్నిస్తున్నాయి.

# దురాశ, దుర్బుద్ధితోనే రీడిజైన్

- కమీషన్ల కోసమే ప్రాణహిత ప్రాజెక్టు ప్రాంతాన్ని మార్చారు
- సిడబ్ల్యుసి లేఖను పట్టించుకోలేదు
- రిటైర్డ్ ఇంజినీర్ల నివేదిక అనుకూలంగా లేదని తొక్కి పెట్టారు
- నిజాం ప్రభువు కన్నా శ్రీమంతుడు కావాలన్నదే కెసిఆర్ కోరిక
- హరీశ్‌రావు తప్పు చేశారని ఘోష్ నివేదిక చెప్పింది
- శిక్షించాల్సి వస్తే..వాళ్లను ఉరి తీయాలి: అసెంబ్లీలో సిఎం రేవంత్‌ర వ్యాఖ్యలు
- గూగుల్ మ్యాప్‌లో చూసి ప్రాజెక్టు కట్టారు : పొంగులేటి



హైదరాబాద్ : కమీషన్ల కోసమే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ప్రాంతాన్ని మార్చారని, ప్రాణహిత, చేవెళ్లకు అన్ని అనుమతులున్నా ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని ఉద్దేశపూర్వకంగానే మార్చారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పులను బయటపెట్టి నందుకే బిఆర్ఎస్ నా యకులు జస్టిష్ ఘోష్ కమిషన్ నివేదికను త ప్పుబడుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులు నిజాయితీపరులైతే ఏ విచారణ కావాలో చెప్పాలని సిట్, సి ఐడి, సిబిఐ ఇందులో మీకు ఏ విచారణ కావాలో తే ల్చుకోవాలని హరీష్ రావుకు సిఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

కాళేశ్వరంపై జస్టిస్ పిసి ఘోష్ నివేదికపై అసెంబ్లీలో వాడీ వేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాణహిత, చేవెళ్లలో నీళ్లున్నాయని అప్పటి కేంద్రమంత్రి చెప్పారని, 205టిఎంసీల నీళ్లు ఉన్నాయని హైడ్రాలజీ క్లియరెన్స్ ఇచ్చిందని ఉమాభారతి లేఖ కూడా ఇచ్చారని, దానికి సంబంధించి హరీష్ రావు ఎండార్స్ చేసిన లేఖ ఇదిగో అంటూ సిఎం రేవంత్ రెడ్డి సభ ముందుంచారు. ప్రాణహితలో నీళ్లు ఉన్నాయని 2009లోనే సిడబ్ల్యుసి లేఖ ఇచ్చిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రాణహిత ప్రాజెక్టు కట్టుకోవచ్చని 2009లో కేంద్ర ప్రభుత్వం చెప్పినా గత ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని మార్చిందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

**ధనాశ, దురాశతోనే లొకేషన్‌ను కెసిఆర్ మార్చారు**

తెలంగాణ ప్రజల సొమ్ము రూ.లక్ష కోట్లను దోచుకునేందుకే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని సిఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఆనాడు మహారాష్ట్రతో చర్చ జరిగింది కేవలం ప్రాజెక్టు ఎత్తు గురించే అని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. కావాలనే హరీష్ రావు పదే పదే తప్పుడు సమాచారం ఇస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు ఉన్నాయని చెప్పినా ఎందుకు వినలేదని బిఆర్ఎస్ నేతలను సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టుకు మహారాష్ట్ర అభ్యంతరం చెప్పలేదని, 148 మీటర్ల ఎత్తులో కట్టుకోమని మహారాష్ట్ర కూడా చెప్పిందని, అయినా వినకుండా ప్రాజెక్టు లొకేషన్‌ను మార్చారని సిఎం రేవంత్ తెలిపారు. కెసిఆర్‌కు ధనాశ, దురాశ కలగడం వల్లే లొకేషన్‌ను మార్చారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. మాజీ సిఎం కెసిఆర్ లక్ష కోట్లు కొల్లగొట్టాలని ప్రణాళిక వేసుకున్నారని సిఎం రేవంత్ అన్నారు. పొగతాగడం ఆరోగ్యానికి హానికరం అని రాసినట్లే ప్రాజెక్టు కడితే హానికరం, నిరుపయోగమని అధికారులు పదే పదే చెప్పారని, అయినా వినకుండా దోచుకోవడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు కట్టారని సిఎం రేవంత్ అన్నారు. నిజాం ప్రభువు కంటే శ్రీమంతుడు కావాలన్నదే కెసిఆర్ కోరిక అని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్లలో నీళ్లు ఉన్నాయని అప్పటి

కేంద్రమంత్రి ఉమా భారతి స్పష్టంగా చెప్పారని సిఎం రేవంత్ పేర్కొన్నారు.

**హరీష్ రావు వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలి**

అసంపూర్తి సమాచారంతో హరీష్ రావు తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని ప్రయత్నిస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రాణహిత చేవెళ్లలో నీరు అందుబాటులో ఉంది, హైడ్రాలజీ అనుమతులు ఇస్తున్నామని ఆనాటి కేంద్ర మంత్రి ఉమా భారతి 24.-10.2014 న స్పష్టంగా చెప్పారని, 205 టిఎంసీల నీరు అందుబాటులో ఉందని కేంద్రం లెటర్ రాస్తే హరీష్ రావు మళ్లీ పరిశీలించాలని కేంద్రానికి లేఖ రాశారని సిఎం రేవంత్ ఆరోపించారు. పిసి ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలో వాస్తవాలను బయటపెట్టారనే వారిపై విషం చిమ్ముతున్నారని, హరీష్ రావు తప్పు చేశారని నివేదికలోని పేజీ నెంబర్ 98లో స్పష్టంగా పొందుపరిచారని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై విచారణకు సిబిఐ కావాలా, సిబి సిఐడిల విచారణ కావాలో చెప్పకుండా సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

అసంపూర్తి సమాచారంతో తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన హరీష్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని సిఎం సభను కోరారు. నిజాం కంటే ధనవంతుడు కావాలన్న దుర్బుద్ధితో కెసిఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారని, మేడిగడ్డ దగ్గర కట్టాలని కెసిఆర్, హరీష్‌రావులు ముందే నిర్ణయించుకున్నాక రిటైర్డ్ ఇంజనీర్లతో కమిటీని నియమించారని ఆయన తెలిపారు.

రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక వారికి అనుకూలంగా లేదని ఆ నివేదికను తొక్కిపెట్టి వాళ్లు అనుకున్న చోట ప్రాజెక్టు కట్టారని సిఎం రేవంత్ ఆరోపించారు. తుమ్మిడిహట్టి దగ్గర ఇచ్చిన వార్నింగ్ క్లాజ్ ను మేడిగడ్డ విషయంలోనూ పేర్కొన్నారని, దీనికి శిక్షించాల్సి వస్తే వాళ్లని ఉరి తీయాలని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సిఎం రేవంత్ స్పష్టం చేశారు. నివేదికలో పేర్కొన్న ఎవరినీ వదిలిపెట్టేది లేదన్నారు.

# దేవాదుల ఎత్తిపోతల వరంగల్ జిల్లా వరప్రదాయిని
## కడియం శ్రీహరి



హైదరాబాద్: దేవాదుల ఎత్తిపోతల ఉమ్మడి వరంగల్ జిల్లాకి వరప్రదాయిని అని స్టేషన్ ఘనపూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. దేవాదుల ఎత్తిపోతలతో సుమారు ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తుందన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ఎప్పుడో పూర్తి కావాలని, గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వలన పనులు పూర్తికాలేదని తెలిపారు.

దేవాదుల కింద ఉన్న ప్రధాన పంట కాలువలు పూర్తి కాకపోవడం వల్ల చివరి భూములకు సాగు నీరు అందించలేక పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని గత ప్రభుత్వానికి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినట్లు గుర్తు చేశారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇచ్చిన ప్రాధాన్యత ఏ ప్రాజెక్టుకు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని దేవాదుల ఎత్తిపోతుల పథకానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని ఆయన చెప్పారు.

స్టేషన్ ఘనపూర్ నుంచి నవాబ్ పేట్ వరకు ప్రధాన కాలువతో పాటు ఉప కాలువల లైనింగ్ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 140 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. దేవాదుల మూడవ దశ, ప్యాకేజ్ ఆరు పనులు అర్ధాంతరంగా గత ప్రభుత్వం ఆపివేసిందని దీంతో పలు గ్రామాల్లో సాగునీరుకు ఇబ్బందులు ఎరైయ్యాయన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం, రూ.1,010 కోట్ల రూపాయలు పనుల కోసం కేటాయించిందని ఆయన తెలిపారు. ఎత్తైన ప్రదేశాలకు నీరు అందడంలేదని, గత ప్రభుత్వం రూ. 104 కోట్లు కేటాయించినా పనులు జరగలేదని, ఇప్పుడు ప్రభుత్వం వీటికి ప్రాధాన్యత ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. దేవాదుల వాటి అనుబంధ కాలువల పనులు పూర్తి చేయటానికి ప్రాధాన్యత ఇచ్చిన ముఖ్యమంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రాజెక్ట్ ఎక్కడ కట్టాలో.. ఎలా కట్టాలో తెలియదు.. శిక్ష తప్పించుకోవాలని చూస్తున్నారు: కోమటిరెడ్డి



మీరు కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మీ హయాంలోనే కూలిపోయింది.. తప్పు చేసి శిక్ష నుంచి తప్పించుకోవాలని బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. ఆదివారం (ఆగస్టు 31) కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై తెలంగాణ అసెంబ్లీలో లఘుచర్చ జరిగింది. ఇందులో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వర్సెస్ మాజీ మంత్రి హరీష్‌రావు మధ్య వాడివేడి చర్చ సాగింది.మీరు కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మీ హయాంలోనే కూలిపోయింది.. తప్పు చేసి శిక్ష నుంచి తప్పించుకోవాలని బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. ఆదివారం (ఆగస్టు 31) కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై తెలంగాణ అసెంబ్లీలో కమీషన్ల కోసమే కాళేశ్వరం కట్టారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ఎక్కడ కట్టాలో.. ఎలా కట్టాలో వారికి తెలీదని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం హడావుడిగా కట్టింది కాబట్టే మీరు కట్టిన ప్రాజెక్ట్ మీ హయాంలోనే కూలిపోయిందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గుర్తు చేశారు. కాళేశ్వరం కమిషన్ సబ్జెక్ట్‌పై మాట్లాడాలని సూచించిన ఆయన.. సభను డైవర్ట్ చేసే ప్రయత్నాలు చేయడం సరికాదని కోమటిరెడ్డి విమర్శించారు. ప్రతిపక్షనేత కేసీఆర్ శాసనసభకు రాకుండా తెలంగాణ ప్రజలను అవమానిస్తున్నారని కోమటిరెడ్డి మండిపడ్డారు. ప్రాజెక్ట్ కూలడానికి తామే కారణమని సభకు వచ్చి రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.

అయితే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌ను క్వాష్ చేయాలనే కోర్టుకు వెళ్లామని హరీష్ రావు తెలిపారు. అసెంబ్లీలో చర్చించవద్దని మేం కోర్టుకు వెళ్లలేదన్నారు. కాళేశ్వరం అద్భుతమని గతంలో కోమటిరెడ్డి చెప్పారని మాజీ మంత్రి హరీష్‌రావు గుర్తు చేశారు.లఘుచర్చ జరిగింది. ఇందులో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వర్సెస్ మాజీ మంత్రి హరీష్‌రావు మధ్య వాడివేడి చర్చ సాగింది.

# మాట ఇస్తున్నా..తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కడతాం: సీఎం రేవంత్ రెడ్డి

- **ఎస్ఎల్బీసీ పూర్తి చేస్తం: సీఎం రేవంత్**
- **రాహుల్ ని ప్రధానిని చేయడం మన బాధ్యత**
- **అధికారం ఉన్నప్పుడు చాలామంది వస్తరు.. పోగానే మాయమవుతరు**
- **వైఎస్సార్ మెమోరియల్ అవార్డుల కార్యక్రమంలో కామెంట్స్**




హైదరాబాద్ : వైఎస్సార్ విధానాలను, ఆశయాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. సెప్టెంబర్ 2న హైదరాబాద్ లోని హోటల్ దసపల్లాలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్మారక అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టి తాండూరు, రంగారెడ్డి జిల్లా వరకు నీటిని తరలించి ఆనాడు రైతాంగాన్ని ఆదుకోవడానికి ఆనాడు వైఎస్సార్ గొప్ప ప్రణాళిక వేయగా.. అది ఆతర్వాత నిర్లక్ష్యానికి గురైంది. వైఎస్సార్ ఆశయాలను ఇప్పుడు మేం కొనసాగిస్తామని నేను మాట ఇస్తున్నా. తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టును కడతాం. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ లో కొంత ప్రాంతానికి గోదావరి జలాలను తరలించడం ద్వారా వైఎస్సార్ రైతులకు చేయదలుచుకున్న మేలు జరిగేలా చూస్తాం. వైఎస్ లక్ష్యమైన ప్రాణహిత:చేవెళ్ల, ఎస్ఎల్బీసీ ప్రాజెక్టులను పూర్తి చేయడం కూడా మా బాధ్యత" అని ప్రకటించారు.

**వైఎస్సార్, కేవీపీలాంటి ఫ్రెండ్స్ ఉండరు..** వైఎస్సార్, కేవీపీ రామచంద్రారావు వంచి గొప్ప స్నేహితులు ఎవరూ ఉండరని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. "అధికారంఉన్నప్పుడు చాలామంది మిత్రులు వస్తారు. అధికారం పోగానే వారంతా మాయమవుతారు. కానీ, కేవీపీ మాత్రం వైఎస్సార్ అకాల మరణం వరకూ తోడుగా ఉన్నారు" అని కొనియాడారు. "నేను సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వారానికి ఒకరో ఇద్దరో నన్ను కలుస్తూ, చనువుగా మాట్లాడుతుంటారు. 'నేను నీకు వైఎస్ కు కేవీపీలా ఉండిపోతాను' అని చెప్తుంటారు. దానికి నేను నవ్వి ఈ తరానికి ఒకే రాజశేఖర్ రెడ్డి, ఒకే కేవీపీ ఉంటారు. వారి స్నేహానికి ప్రత్యామ్నాయం లేదు అని చెప్తుంటాను. నేడు కేవీపీలా కావాలనుకునే వాళ్ళందరికీ చెప్పేదొక్కటే. వాళ్లు ఎప్పటికీ కేవీపీలు కాలేరు" అని రేవంత్ రెడ్డి అన్నారు."వ్యవసాయం దండుగ కాదు. పండుగ కావాలి' అన్న వైఎస్సార్ ఆలోచనను

కొనసాగిస్తూ సేంద్రీయవ్యవసాయంలో విశిష్ట సేవలను అందించిన సుభాష్ పాలేకర్, సుధా, నాగేశ్వరరావును సన్మానించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

**సేంద్రియ సాగుకు ప్రణాళికలు..** రూ. లక్షల రుణమాఫీ చేసి, రాష్ట్ర రైతాంగాన్ని రుణ విముక్తులను చేసిన ప్రభుత్వం తమది అని సీఎం రేవంత్ చెప్పారు. "వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్టే.. అని గత సీఎం అంటే, మా సర్కారు వచ్చాక వరి వేసుకోండి.

చివరి గింజ వరకూ కొంటామని భరోసా ఇచ్చాం. కనీస మద్దతు ధరతోపాటు రూ. 500 బోనస్ కూడా ఇచ్చాం. అందుకే నేడు తెలంగాణ రూ.2.85 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది" అని సీఎం రేవంత్ చెప్పారు. ఇప్పుడు నిజామాబాద్, కరీంనగర్ దేశంలోనే అత్యధికంగా వరిపండించే జిల్లాలుగా నిలిచాయన్నారు.కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సరైన సహకారం అందించకపోవడం వల్ల యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సహనం గొప్ప విషయం: కేవీపీ అధికారంలో ఉన్న వ్యక్తి, మరో వ్యక్తిని అదేపనిగా పొగడడం అనేది మామూలు విషయం కాదని.. రేవంత్ రెడ్డి అంత సహనంతో వ్యవహరించడం నిజంగా గొప్ప విషయం అని కేవీపీ రామచంద్రారావు అన్నారు. వైఎస్సార్ తో 1966 నుంచి తనకు 58 ఏళ్ల సాన్నిహిత్యం ఉందని చెప్పారు. "రాజశేఖర్ రెడ్డి ఎంత గొప్పవాడో.. మీరందరూ ఇంతసేపు కూర్చుని మాట్లాడుతుంటే.. నాకు నిజంగా చాలా ఆనందంగా, గర్వంగా ఉంది" అనికూర్చుని మాట్లాడుతుంటే.. నాకు నిజంగా చాలా ఆనందంగా, గర్వంగా ఉంది" అని అన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్రాల ఆదాయానికి భరోసా ఇవ్వాలి..

- **రేట్ల హేతుబద్ధీకరణతో తెలంగాణకు రూ.5,100 కోట్ల నష్టం**
- **సంప్రదింపుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించే సమయంలో రాష్ట్రాల ఆదాయానికి భద్రత కల్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రేట్ల హేతుబద్ధీకరణకు మద్దతు ఇవ్వడానికి సిద్ధం గా ఉన్నామని. అయితే సంక్షేమ పథకాలపై ప్రతికూల ప్రభావం చూపే నష్టం గురించి ఆందోళన కలుగుతోందని తెలిపారు. రేట్ల హేతుబద్ధీకరణతో తెలంగాణకు రూ.5,100 కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. ఆగష్టు 29న ఢిల్లీలోని కర్ణాటక భవన్లో కర్ణాటక ప్రభుత్వం ఆధ్వర్యంలో జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై వివిధ రాష్ట్రాల సంప్రదింపుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. 'గత ఐదేళ్లలో జీఎస్టీ ద్వారా ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేశారు కానీ ఆశించినంతగా పెరగలేదు. తెలంగాణ వ్యాట్ను కొనసాగించి ఉంటే 2024-25 సం వత్సరానికి ఆదాయం రూ.69,373 కోట్లు ఉండేది. జీఎస్టీ ద్వారారూ.42,443 కోట్ల ఆదాయమే వచ్చింది' అని వివరించారు. 80 శాతం సంక్షేమం కోసం కేటాయింపుతెలంగాణ ఆదాయంలో 80 శాతం కంటే ఎక్కువ నిధులు సంక్షేమ పథకాల కోసం కేటాయిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో విలాస వస్తువులపై సెస్ వాటా రాష్ట్రానికి వచ్చే జీఎస్టీలో 15 శాతం మాత్రమేనని చెప్పారు. తెలంగాణలో జీఎస్టీ, జీఎస్డీపీ నిష్పత్తి 2022-23లో 3.07 శాతం నుంచి 2024-25లో 2.58 శాతానికి తగ్గిందని, రేటు



హేతుబద్ధీకరణ దీనిని మరింత తగ్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పన్ను మినహాయింపు పేద, మధ్య తరగతి వర్గా లకు చేరేలా ఉండాలని భట్టి పేర్కొన్నారు. సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సెప్టెంబర్ 3న తమిళనాడు భవన్లో ఇదే అంశంపై బ్రేక్ఫాస్ట్ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు..



హైద్రాబాద్ యాప్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాను ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, చిలకలగూడ పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు డ్రగ్స్ విక్రేతలు, ఎనిమిది మంది వినియోగదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 100 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్, పది మొబైల్ ఫోన్లు, తూనిక యంత్రం స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటి విలువ రూ.15,00,000 ఉంటుంది. ఈస్ట్‌జోన్ డిసిపి బాలాస్వామి ం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎపిలోని కర్నూలు జిల్లాకు చెందిన ఎం. రామకాంత్ అలియాస్ కిరణ్ చిలకలగూడలోని ఐడియల్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు, అచ్చంపేటకు చెందిన ముడావత్ ప్రసాద్ మీర్‌పేటలో ఉంటూ వ్యాక్యూమ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు ఇద్దరు కలిసి డ్రగ్స్ విక్రయిస్తున్నారు. వీరి వద్ద ఎపిలోకి కృష్ణా జిల్లాకు చెందిన కరిచెర్ల వినయ్ కుమార్ అలియాస్ విన్ను మాదాపూర్‌లో ఉంటున్నాడు, సెక్స్ వర్కర్, సైదాబాద్‌కు చెందిన డాక్టర్ ఆతిఫ్ అబ్దుల్ సమీ మలక్‌పేటలోని ఇండో యుఎస్ ఆస్పత్రిలో సర్జన్‌గా పనిచేస్తున్నాడు.

నల్గొండ జిల్లాకు చెందిన కొత్తపల్లి మోషా అలియాస్ మోజెస్, నగరంలోని ముషీరాబాద్‌కు చెందిన బల్లం వంశీ కృష్ణ, చౌటుప్పల్‌లో ఉంటున్న కేతవత్ రాజు నాయక్ అలియాస్ నాయక్, మిర్యాలగూడకు చెందిన షేక్ సమీర్ ఐటి రిక్రూటర్ కర్మాన్‌ఘాట్‌లో ఉంటున్నాడు, సికింద్రాబాద్, వారిసిగూడకు చెందిన అదేపు సత్య సురేష్ బాబు అలియాస్ సురేష్, మంధులా రామకాంత్ అలియాస్ కిరణ్, ముడావత్ ప్రసాద్ డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారు. గ్రిండర్ యాప్‌లో ఇద్దరు నిందితులు డ్రగ్స్ విక్రయిస్తున్నారు. ఇది డేటింగ్ యాప్ కావడంతో ఇందులో చాలామంది స్వలింగ సంపర్కులు ఉన్నారు, వారిలో చాలామందికి హెచ్ఐవి పాజిటివ్ ఉంది. యాప్‌లో నిందితులు రహస్య కోడ్‌లు ఉపయోగిస్తు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారు. ఈ ముఠాకు నైజీరియన్ డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించి అదుపులికి తీసుకున్నారు. బెంగళూరులో ఉంటున్న నైజీరియన్ నుంచి ఇద్దరు నిందితుల నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి యాప్ ద్వారా విక్రయిస్తున్నారు.

యాప్ ద్వారా డ్రగ్స్ ఆర్డర్ ఇచ్చిన వారికి ఇంటి వద్దే డెలివరీ చేస్తున్నారు. ప్రధాన నిందితుడు ఎం. రామకాంత్ అలియాస్ కిరణ్ ఇందిరా పార్క్, సంజీవయ్య పార్క్, పరేడ్ గ్రౌండ్స్, బస్ స్టాప్‌లు వంటి బహిరంగ ప్రదేశాలకు వెళ్లేవాడు. తర్వాత గ్రిండర్ యాప్ ద్వారా స్వలింగ సంపర్కులను కలిసే వాడు. స్టామినా పెంచుకోవడానికి ఎండిఎంఏ డ్రగ్స్ వాడటం ప్రారంభించాడు.

రెండేళ్ల క్రితం నుంచి డ్రగ్స్ విక్రయించడం ప్రారంభించాడు. జూలై 2024లో ముడావత్ ప్రసాద్‌ను చిలకల గూడ పోలీసులు ఎన్‌డిపిఎస్ చట్టం కింద అరెస్టు చేశారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత నుంచి మళ్లీ డ్రగ్స్ విక్రయించడం ప్రారంభించాడు. బెంగళూరులో ఉన్న నైజీరియన్‌ను సంప్రదించి అతడి వద్ద నుంచి ఎండిఎంఏ డ్రగ్స్‌ను గ్రాముకు రూ. 4,000 చొప్పున కొనుగోలు చేసి, ముడావత్ ప్రసాద్ సహాయంతో గ్రాముకు రూ. 7,000, 8,000 చొప్పున విక్రయిస్తున్నాడు. పోలీసులకు సమాచారం రావడంతో అపార్ట్‌మెంట్‌పై దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారు ఇచ్చిన సమాచారంతో వినియోగదారులను అదుపులోకి తీసుకున్నారు.

# కెసిఆర్‌ను బద్నాం చేసే కుట్రలు

## రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్



కాంగ్రెస్ ప్రభుత్వ అరాచక పాలన చూస్తుంటే ఆనాడు భద్రాచలంలో రామందిరం నిర్మించిన రామదాసును జైల్లో పెట్టినట్లు తెలంగాణ ప్రజల కొంగు బంగారం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కెసిఆర్‌ను కూడా బద్నాం చేసే కుట్రలకు తెర తీశారని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్ ఆరోపించారు. తెలంగాణ నాశనం కోరుకునే వంకరబుద్ధి గాళ్లకు ఈర్ష్య, అసూయ పుట్టించే విధంగా జలాభి షేకం చేసిన వరప్రదాయిని కాళేశ్వరంపై విషం కక్కుతున్నారని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. వందేళ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కెసిఆర్ కాళేశ్వరం నిర్మించారని, గోదావరి నదిపై బ్యారేజీ కట్టిన సర్ ఆర్థర్ కాటన్‌లా కెసిఆర్ ఇక్కడి ప్రజల గుండెల్లో దేవుడిలా నిలిచిపోతుండడాన్ని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారాలకు తెర తీసిందని ఆయన ధ్వజమెత్తారు. గోదావరి జలాలను ఆంధ్రా ప్రాంతానికి తరలించడానికి కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కారు విషం చిమ్ముతోందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కాళేశ్వరం ప్రాజె క్టు ఒక ఆధునిక దేవాలయమని, కాళేశ్వరం దేశానికే అన్నం పెట్టే మహాజలశక్తి పీఠమని ఆయన అభివర్ణించారు. తెలంగాణలో కరువుకాటకాల కు, ప్రజల కన్నీళ్లకు శాశ్వత పరిష్కారం కాళేశ్వరం నీళ్లు అని ఆయన స్పష్టం చేశారు. కెసిఆర్‌ను బద్నాం చేయాలన్న దురుద్దేశ్యంతోనే శాసనసభ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్టుగా ఉందని ఆయన విమర్శించారు. గోదావరిలో తెలంగాణ వాటాగా దక్కే ప్రతి నీటి చుక్కని ఒడిసిపట్టే కెసిఆర్ ఆలోచన ఫలితమే కాళేశ్వరం అద్భుతమైన జలదృశ్యమని దామోదర్ కొనియాడారు. తెలంగాణలో జలసిరులు కురిపించి ప్రజల హృద యాల్లో నిలిచిపోయిన కెసిఆర్‌పై అవాకులు చవాకులు మాట్లాడే కాంగ్రెస్ నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికలే గుణపాఠం కానున్నాయన్నా రు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ కక్షపూరిత చర్యలను విడనాడి ప్రజా సమస్యలపై దృష్టి పెడితే మంచిదని దామోదర్ సలహా ఇచ్చారు.

# ఆర్‌బిఐ కఠిన నిర్ణయం: రెండు బ్యాంకులకు జరిమానా

నియమాలను పాటించడంలో విఫలమైన బ్యాంకులపై 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (RBI) కఠినమైన చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పలు బ్యాంకులకు భారీ జరిమానాలు విధించిన ఆర్బీఐ.. తాజాగా బంధన్ బ్యాంక్, నాందేడ్ డిస్ట్రిక్ట్ సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్కు జరిమానా విధించింది. ఆదేశాలను పాటించలేకపోవడం వల్ల బంధన్ బ్యాంక్కు రూ. 44.7 లక్షల జరిమానా విధించడం జరిగిందని ఆర్బీఐ స్పష్టం చేసింది. ముఖ్యంగా కొంత మంది ఉద్యోగుల వేతనాలను కమిషన్ రూపంలో చెల్లించినట్లు ఆర్బీఐ వెల్లడించింది. అంతే కాకుండా.. బ్యాంక్ కొన్ని ఖాతాల డేటాకు సంబంధించి బ్యాక్ ఎండ్ ద్వారా మాన్యువల్ జోక్యాన్ని నిర్వహించిందని.. సిస్టమ్లోని నిర్దిష్ట వినియోగదారు వివరాలతో యాక్సెస్ ఆడిట్ ట్రయల్స్/లాగ్లను సంగ్రహించలేదని తెలిపింది. మహారాష్ట్ర కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న 'నాందేడ్ డిస్ట్రిక్ట్ సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్'కు ఆర్బీఐ రూ. 45వేలు జరిమానా విధించింది. కేవైసీ నిబం ధనలను పాటించకపోవడం, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించేటువంటి సాఫ్ట్వేర్ ఏర్పాటు చేయకపోవడం వంటి కారణాల వల్ల ఈ ఫైన్ విధించినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. బ్యాంకులపై జరిమానాలు విధించినప్పటికీ, ఈ ప్రభావం కస్టమర్ల మీద ఉండ దు. అయితే బ్యాంకు కార్యకలాపాలపై ఆంక్షలు విధించినప్పుడు లేదా లైసెన్సు రద్దు చేసినప్పుడు కస్టమర్లు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కాబట్టి కస్టమర్లు.. నిలక్ష్యంగా వ్యవహరించే బ్యాంకులకు కొంత దూరంగా ఉండాలి.

# సెమీకండక్టర్లకు ముఖద్వారం తెలంగాణ




హైదరాబాద్: జపనీస్ సెమీకండక్టర్ సాంకేతిక పరిజ్ఞానానికి తెలంగాణ ముఖద్వారంగా అభివృద్ధి చెందుతోందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సెమీకండకర్ల తయారీలో కీలకమైన కెమికల్, మెకానికల్ పాలిషింగ్ (సిఎంపి) టెక్నాలజీని స్థానికంగా అం దుబాటులోకి తెచ్చేందుకు జపాన్‌కు చెందిన టోహో కోకి సెయిసాకుషో సంస్థ ముందుకు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. భారత్‌లో తొలిసారి సిఎంపి ప్యాడ్ హబ్‌ను రూ.8 కోట్ల వ్యయంతో ఆ సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు టోహో కోకి సెయిసాకుషో, టి- వర్క్ మధ్య అవగాహ న ఒప్పందరం (ఎంఒయూ) కుదిరిందని శ్రీధర్ బాబు తెలిపారు. దేశంలో నే అతి పెద్ద ఫోటో టైపింగ్ కేంద్రం టి వర్క్‌ను జపనీస్ సంస్థ భాగస్వామిగా ఎంపిక చేసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశా రు. విద్యార్థులు, పరిశోధకులు, అంకుర సంస్థలకు ఈ ప్యాడ్ హబ్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. సి ఎంపి సేవలు అవసరమైన పరిశ్రమలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చునని తెలిపారు.

సెమీ కండక్టర్ పరిశ్రమకు విడిభాగాలు అందించే చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని తెలంగాణ ప్రతిష్టను పెంచాలని ఆ యన కోరారు. జపనీస్ పరిశ్రమలు, అం కుర సంస్థలు, పరిశోధకుల కోసం టి- వర్క్‌లో ప్రత్యేకంగా ఒక 'సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సును' నెలకొల్పనున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇక్కడ శిక్షణ పొం దిన వారు స్థానికంగా సిఎంపి ప్యాడ్ లను సొంతగా తయారు చేయగలిగే పరిజ్ఞానం పొందగలుగుతారని చెప్పారు. దీని కోసం తొలుత ఒకటి లేదా రెండు చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను ఎంపిక చేసి శిక్షణ అందిస్తామని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ రంగంలో 200- నుంచి 300 మంది సాంకేతిక నిపుణులను తయారు చేయడం తమ లక్ష్యమని అన్నారు. దేశం సిఎంపి ప్యాడ్‌ల ఉత్పత్తిలో స్వావలంబన సాధించేందుకు తెలంగాణ పాటు పడుతుందని పేర్కొన్నారు.

ప్రస్తుతం దేశంలో సిఎంపి ప్యాడ్లను ఉత్పత్తి చేసే పరిశ్రమలు లేకపోవడం వల్ల ఏటా రూ.100 కోట్ల విలువైన దిగుమతులు చేసుకుంటున్నట్టు వెల్లడించా రు. అవగాహన ఒప్పంద కార్యక్రమంలో టోహో కోకి సంస్థ గ్లోబల్ బిజినెస్ హెడ్ ట కుయా నిషిమురా, టి- వర్క్ సిఇఓ జోగిందర్ తనికెళ్ల తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు రూ.374 కోట్ల నష్టం:మంత్రి సీతక్క



రాష్ట్రంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంచాయతీరాజ్ రహదారులను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలకు రహదారులు దెబ్బతిన్న నేపథ్యంలో సీతక్క పంచాయతీరాజ్ ఇఎన్‌సి ఎన్.అశోక్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిం చారు. దెబ్బతిన్న రహదారుల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 1291 ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు మంత్రికి నివేదించారు. వీటి తాత్కాలిక మరమ్మత్తుల కోసం రూ. 22.71 కోట్లు, శాశ్వత మరమ్మత్తుల కోసం రూ. 352 కోట్లు, మొత్తంగా గ్రామీణ రహదారుల పునరుద్ధరణకు రూ. 374.71 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు.

మొత్తం 22 గ్రామాలకు రాకపోకలు దెబ్బతినగా, వాటిలో 14 గ్రామాలకు తాత్కాలికంగా రహదారులను పునరుద్ధరించామని వెల్లడించారు. మిగిలిన గ్రామాలకు పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నట్లు ఇఎన్‌సి అశోక్ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా వీలైనంత త్వరగా రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్న గ్రామాలకు యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. వర్షాలకు తడిచి కూలే ప్రమాదం ఉన్న పంచాయతీరాజ్ భవనాలను తక్షణం ఖాళీ చేయించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు వేగంగా చేపట్టాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# ఫెడరల్ స్ఫూర్తితో కేంద్రం వ్యవహరించాలి: భట్టి



హైదరాబాద్: రేట్ రేషనలైజేషన్ పేరుతో రాష్ట్రాలకు రెవెన్యూ తగ్గే ప్రమాదం ఉందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఫెడరల్ స్ఫూర్తితో కేంద్రం వ్యవహరించాలని అన్నారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో జిఎస్టి రేషనలైజేషన్ అంశంపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు బాగేంటేనే.. దేశం బాగుంటుందని తెలియజేశారు. రేషనలైజేషన్ ను ఆహ్వానిస్తూనే రాష్ట్రాలకు జరిగే నష్టానికి..పరిహారం చెల్లించే మార్గాలను కేంద్రం ఆలోచించాలని కోరారు. సెప్టెంబర్ 3న మరోసారి ఢిల్లీలో 8 రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, జిఎస్టి కౌన్సిల్ సమావేశంలో తమ డిమాండ్లు లేవనెత్తాలని కేంద్రం నిర్ణయం తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు కలిసి సాగుదాం: సిఎం రేవంత్ రెడ్డి

- **కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారం గుప్పిట పట్టుకోవడానికి కుయుక్తులు**
- **లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఏకమై తిప్పికొట్టాలి**
- **సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్: అధికారం కన్నా విపక్షంగా ఉంటూనే ప్రజా సమస్యలపై పోరాటాలకు కమ్యూనిస్టులు ఆసక్తి కనబరుస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మొన్నటి అధికార బదలాయింపులో కమ్యూనిస్టుల సహకారం ఎంతో ఉందని ఆయనన్నారు. రవీంద్రభారతిలో సిపిఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు నేత సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు పాల్గొని రెండు మౌనం పాటించారు. అనంతరం సురవరం సుధాకర్ రెడ్డికి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశనుండి జాతీయ స్థాయికి ఎదిగిన పాలమూరు ముద్దుబిడ్డ సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. తాను నమ్మిన సిద్ధాంతాలను తుదిశ్వాస వరకు ఆచరిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. పేద ల జీవితాల్లో మార్పు రావాలని వారి కోసం నిరంతరం శ్రమించిన నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని స మాజంలో అసమానతలు, అనాగరిక చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతూ ఎన్నో చైతన్యవంత కార్యక్రమాలు చేపట్టారన్నారు.

మొదటి తరంలో సురవరం ప్రతాప్ రెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వంటి వారు పాలమూరు జిల్లాకు వన్నె తెచ్చారని, రెండోతరంలో జైపాల్ రెడ్డి, సురవరం సుధాకర్‌రెడ్డి రాజకీయాల్లో రాణించి విలువలను పెంపొందించారని కొనియాడరు. సుధాకర్‌రెడ్డి శాశ్వతం గా గుర్తుండి పోయేలా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పునరుద్ఘాటించారు. కేంద్రంలోని ప్రభు త్వం వన్ నేషన్, వన్ ఎ లక్షన్ పేరుతో అధికారాన్ని తన గుప్పిట్లో పెట్టుకోడానికి ప్రయత్నిస్తోందని విమర్శించా రు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఇందుకోసం జస్టిస్ సుదర్శన్ రెడ్డి ని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నెలిబెట్టినట్లు తెలిపారు. టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పాటు కమ్యూనిస్టులు బలపడాలని అన్నారు. సు రవరం సుధాకర్ రెడ్డి జీవనశైలి ఎల్లప్పుడు మార్గదర్శకంగా ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యా యమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాలతో జాతీయ స్థాయికి ఎదిగిన సువరం సుధాకర్‌రెడ్డి కార్మిక సమస్యలపై, ప్రజా సమస్యలపై పోరాడిన గొప్ప కమ్యూనిస్టు అని నివాళులర్పించారు.

సిపిఎం పో లిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు మాట్లాడుతూ.. సుధాకర్‌రెడ్డి వ్యక్తిత్వం, పనిపద్ధతి, నడక తీరు తనతో పాటు అనేక మందిపై చెరగని ముద్ర వేసిందన్నారు. ఆయన ఉదార వ్యక్తిత్వం, హుందాతనం క మ్యూనిస్టు ఉద్యమాలకు స్ఫూర్తి అని అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మా ట్లాడుతూ– మార్క్స్ సూచించిన నూతన సమాజ నిర్మాణం కోసం సుధాకర్ రెడ్డి కృషి చేశారన్నారు. బిఆర్ఎస్ నేత వినోద్ కుమార్ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి ప్రభావం వ్యక్తిగతంగా తనపై ఎక్కువగా ఉందన్నారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కార్యదర్శి కె. నారాయణ, సిపిఐ నేత, సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంఎల్ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి, సామ్యూల్, ఎంపి ఈటల రా జేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తదితరు లు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి సురవరం సుధాకర్ రెడ్డిపై రూపొందించిన పాటల సీడీని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

# బీసీ రిజర్వేషన్లు.. అసెంబ్లీలో పొన్నం vs గంగుల

- **బీసీలపై మంత్రి పొన్నంకు అవగాహన లేదన్న బిఆర్ఎస్ సభ్యుడు గంగుల**
- **ఆకారం ఎక్కువగా ఉంటే అవగాహన ఎక్కువ ఉందనుకోవడం పొరపాటన్న మంత్రి పొన్నం**
- **సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య వాగ్వాదం**



హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సమావేశాల రెండో రోజు పురపాలక చట్ట సవరణ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బీసీలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అవగాహన బిఆర్ఎస్ సభ్యుడు గంగుల కమలాకర్ అవగాహన లేదని వ్యాఖ్యానించడంతో సభలో ఒక్కసారిగా మంత్రులు, సభ్యులు తీవ్రంగా స్పందించారు. అదే సందర్భంలో మంత్రి పొన్నం ఘాటుగా స్పందిస్తూ ఆకారం ఎక్కువగా ఉంటే అవగాహన ఎక్కువ ఉందనుకోవడం పొరపాటని జవాబిచ్చారు. దీంతో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ అంశంపై వివరాల్లోకి వెళితే పురపాలక, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లును ముఖ్యమంత్రి తరఫున పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు సభలో ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా జరిగిన చర్చలో మున్సిపల్ పరిధిలో ఉన్న స్థానిక సంస్థలన్నింటిలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని తాము గట్టిగా సంకల్పించామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారని గత ప్రభుత్వం చేయలేని పని తమ ప్రభుత్వం చేసిందని పొన్నం స్పష్టం చేశారు. అనంతరం జోక్యం చేసుకున్న గంగుల మాట్లాడుతూ బీసీలపై పొన్నం ప్రభాకర్‌కు వాస్తవం తెలీదని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర వివరణ ఇస్తే బాగుంటుందని కోరారు. ఈ దశలో గంగుల వ్యాఖ్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుబడుతూ బీసీల్లో అనుమానాలు కలిగేలా తప్పుడు సమాచారం వ్యాప్తి చేయవద్దని కోరారు. కేసీఆర్ కుటుంబం ఎవరినీ కలవని కుటుంబమని విమర్శించారు.

**బీసీ బిల్లును స్వాగతిస్తున్నాం..** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బీసీ బిల్లును తాను సంపూర్ణంగా స్వాగతిస్తున్నానని, అయితే శాస్త్రీయ పద్ధతిలో చేయాలని మాత్రమే కోరుతున్నామని బిఆర్ఎస్ సభ్యుడు గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు. వెనుకబడిన కులాలను మోసం చేయవద్దని ఆనాడే చెప్పామని, తమ సూచనలు పరిగణనలోకి తీసుకుంటే ఎలాంటి చిక్కులు ఉండవని చెప్పామన్నారు. జీవో ఇవ్వకుండా గడచిన 22 నెలలు ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించారు. సుమారు ఆరు కమిటీలు వేశారని, 2024 మార్చిలో బీసీ కమిషన్ ద్వారా జీవో తీసుకొచ్చారని చెబుతూ

తదనంతరం బీసీ కమిషన్ మాయమైందని గంగుల అన్నారు. తర్వాత జీవో నెం.18 తీసుకొచ్చారని, ప్లానింగ్ డిపార్టుమెంట్ ద్వారా సర్వే చేస్తామన్నారని గుర్తు చేశారు. అనంతరం కలుగజేసుకున్న మంత్రి పొన్నం గంగుల కామెంట్లకు తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. తనకు ఏమీ తెలీదని అనటం బిఆర్ఎస్ సభ్యుడు గంగుల అవివేకమని అన్నారు. ఆకారం ఎక్కువగా ఉంటే అవగాహన ఎక్కువ ఉందనుకోవడం పొరపాటని పేర్కొన్నారు. గంగుల తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంత్రి శ్రీధర్ బాబు జోక్యం చేసుకుని గంగుల కామెంట్లను వెనక్కి తీసుకోవాలని కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా జోక్యం చేసుకుని సీనియర్ సభ్యుడిగా మంత్రిని ఆ విధంగా మాట్లాడడం సరికాదని, మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం తప్పుపట్టారని అన్నారు. వెంటనే మీరు చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నట్లు చెప్పాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభ్యుడు గంగుల ప్రభాకర్‌ను ఉద్దేశించి అన్నారు. ఇందుకు గంగుల స్పందిస్తూ తాను తమిళనాడు రాష్ట్రంలో మాదిరిగా రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, ఎటువంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేయాలని కోరుతున్నానని అన్నారు. బీహార్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఇలాగే జివోలు ఇవ్వడం వల్ల రిజర్వేషన్ల అంశం న్యాయపరంగా నిలువ లేదని, అందుకే పార్లమెంటులో బిల్లు ఆమోదించి తద్వారా 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా రిజర్వేషన్లు అమలు చేయడానికి సంపూర్ణంగా వీలుంటుందని తెలిపారు. ఇదే విషయం చెప్పాను తప్ప తాను గానీ, తమ పార్టీ గానీ బిసి రిజర్వేషన్లను వ్యతిరేకించడం లేదని, అందరికన్నా తానే ఎక్కువగా సంతోషిస్తానని చెప్పారు. దీంతో సభలో కాసేపు వాగ్వాదం అనంతరం ఈ అంశంపై చర్చ ముగించారు.

# బిసి బిల్లులకు బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుంది : కెటిఆర్



హైదరాబాద్ : పంచాయితీరాజ్ చట్ట సవరణ బిల్లును బిఆర్ఎస్ స్వాగతిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. బిఆర్ఎస్ కు ఇప్పుడు మూడు ప్రొటో కాల్ పొజిషన్లు ఉన్నాయని అన్నారు.

తెలంగాణ పురపాలక చట్టం 2019 నిబంధనలపై చర్చపై సందర్భంగా పురపాలక, పంచాయితీరాజ్ చట్ట సవరణ బిల్లును శాసన సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా శాసనసభలో కెటిఆర్ మాట్లాడుతూ.. బిసి బిల్లులకు బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని, బిసిల కోసం గతంలో మాజీ సిఎం కెసిఆర్ అనేక పోరాటాలు చేశారని తెలియ జేశారు. ఒబిసి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కెసిఆర్ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ను కోరారని, తెలంగాణ మొట్టమొదటి స్పీకర్ గా బలహీనవర్గాల బిడ్డ మధుసూద నాచారిని నియమించామని అన్నారు. తెలంగాణ మొట్టమొదటి మండలి ఛైర్మన్ గా బలహీనవర్గాలకు చెందిన స్వామిగౌడ్ ను నియమించామని కెటిఆర్ పేర్కొన్నారు.

అడ్వకేట్ జనరల్ కూడా బిసిలను బిఆర్ఎస్ నియమించిందని, బలహీనవర్గాలకు చెందిన బిఎస్ ప్రసాద్ ను అడ్వేకేట్ జనరల్ గా కెసిఆర్ నియమించారని చెప్పారు. 2021 జనగణనతో పాటు కులగణన చేయాలని బిఆర్ఎస్ కోరిందని, కులగణనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కంటే ముందే మాట్లాడింది కెసిఆర్ ప్రభుత్వమేనని కెటిఆర్ అన్నారు. అసెంబ్లీ, మండలి, పార్లమెంటులో ఒబిసి రిజర్వేషన్లు తీసుకరావాలని అప్పట్లోనే తీర్మానించామని, రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ వేస్తూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2010 లో తీర్పు ఇచ్చిందని కెటిఆర్ స్పష్టం చేశారు.

# బోధన సిబ్బందికి ముఖ గుర్తింపు హాజరు తప్పనిసరి

- పాఠశాలలో, కళాశాలల్లోనూ తప్పనిసరి చేయండి
- ఆటలకు కాంట్రాక్టు ఉపాధ్యాయులు
- రుణాలకు నిర్మలమ్మను అనుమతి అడిగాం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే పదేళ్ల గణాంకాలతో నివేదిక ఇవ్వండి
- మధ్యాహ్న భోజనం బిల్లులు ఆగొద్దు
- విద్యారంగంలో మౌలిక వసతుల కోసం
- ప్రభుత్వ బడుల్లో 90 శాతం విద్యార్థులు
- విద్యాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషనల్ కోర్సులు అందించే కళాశాలల్లో విద్యార్థులు, బోధన సిబ్బందికి ముఖ గుర్తింపు హాజరు తప్పనిసరి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ విధానంతో హాజరు శాతం మెరుగుపడి, సాంకేతిక విద్యా కళాశాలల్లో లోటుపాట్లను సరిదిద్దడానికి అవకాశం దొరుకుతుందని చెప్పారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము పెట్టుబడిగా చూస్తున్నా మన్నారు. విద్యాశాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. పాఠశాలలు మొదలుకొని విశ్వవిద్యా లయాల వరకు విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాలు బాగా పెంచాలని పిలుపునిచ్చారు. అదనపు గదులు, వంట గదులు, మూత్ర శాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వేర్వేరు విభాగాలు చేపట్టడం సరికాదని, నాణ్యత ప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికి వీలుగా ఒకే విభాగం కిందకు తేవాలని ఆదేశించారు. 'యంగ్ ఇండియా' సమగ్ర గురుకుల పాఠశాలల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ(ఈడబ్ల్యూఐడీసీ) కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో నిర్మాణాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని వెంటనే డిప్యూటేషన్‌పై తీసుకోవాలని ఆదేశించారు.

మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపుల్లో జాప్యానికి తావు లేకుండా గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని, చెల్లింపుల్లో ఎలాంటి అలసత్వం చూపొద్దని కోరారు. మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం వంటకాల కోసం కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని, వాటిపైన సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ద్వారా అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సూచించారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అవసరమైతే కాంట్రాక్ట్ ప్రాతిపదికన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనుల బిల్లులు తక్షణమే విడుదల చేయాలన్నారు. బాలికల గురుకుల పాఠశాలల్లో మహిళా కౌన్సెలర్లను నియమించాలని సూచించారు. యంగ్ ఇండియా పాఠశాలలతో పాటు విద్యారంగం అభివృద్ధికి తీసుకునే రుణాలు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా చూడాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారని సీఎం వెల్లడించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలేనని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలతో నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# ప్రమాదకరంగా పాలిథిన్ వినియోగం..

- హోటళ్లలో యథేచ్ఛగా పాలిథిన్ కవర్లు, ప్లేట్ల వాడకం ప్రజారోగ్యానికి చేటు అంటున్న నిపుణులు పట్టించుకోని మున్సిపల్, నగర పంచాయతీ అధికారులు.
- పాలిథిన్ వినియోగం ఎంత ప్రమాదకరమో తెలిసినా వినియోగానికి అడ్డుకట్ట వేయ లేకపోతుంది ప్రభుత్వం... ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా, ఎన్ని ఫైన్లు వేసినా వినియోగం మాత్రం ఆగటం లేదు



రంగారెడ్డి జిల్లా: రంగారెడ్డి జిల్లా లోని అన్ని పంచాయతీలలోని హోటళ్లలో, కిరాణా షాప్ లలో విచ్చలవిడిగా పాలిథిన్ వస్తువులు వినియోగిస్తున్నారు. ఆహార పదా ర్థాల ప్యాకింగుకు, వడ్డనకు నిషేధిత పాలిథిన్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులను ఉప యోగిస్తున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నా రని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్, పాలిథిన్ నిషేధం అమల్లో ఉన్నప్పటికీ మున్సిపల్, మండలం, గ్రామ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా లోని అన్ని నగర పంచాయతీ, మున్సిపల్ లలో ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువుల వినియోగం, విక్రయాలు నిషేధం గత చాలాకాలంగా అమల్లో ఉంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పట్టణంలో నిషేధిత పాలిథిన్ కవర్లు, గ్లాసులు, సంచులు, ప్లేట్లు వాడకూడదు. అయితే పట్టణానికి చెందిన హోటళ్ల యజమానులు మాత్రం ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా పాలిథిన్ వస్తువులు వినియోగిస్తున్నారు. ఆహార పదార్థాల ప్యాకిం గుకు,వడ్డనకు పాలిథిన్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులను విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. వేడి పదార్థాలను పాలిథిన్ కవర్లలోనే ప్యాకింగ్ చేస్తున్నారు. గంటల తరబడి పాలిథిన్ క "వర్లల్లోనే నిల్వ ఉంచి, పట్టణవాసులకు విక్రయిస్తున్నారు. అలాగే వడ్డనకు సైతం ప్లాస్టిక్, పాలిథిన్ పొరలున్న ప్లేట్లను వినియోగిస్తున్నారు. టీ షాపుల్లో వేడి టీ ప్యాకింగుకు సైతం పాలిథిన్ కవర్లు వాడుతున్నారు. దీంతో పట్టణ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల జరిగిన హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశంలో వైద్యులు ప్రస్తావించారు.

అయినా మున్సిపల్, నగర పంచాయతీ అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో అడపాదడపా దాడులు చేసి, ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువులను స్వాధీనం చేసుకునేవారు. అయితే గత కొంతకాలంగా నిషేధం విషయాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో హోటల్ యజ మానులు విచ్చలవిడిగా పాలిథిన్ వినియోగిస్తూ, ప్రజారోగ్యంతో చెలగాటమాడు తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా టికైనా మున్సిపల్ నగర పంచాయతీ అధికారులు స్పందించి, పట్టణంలో పూర్తిస్థాయిలో పాలిథిన్ నిషేధించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విష యాన్ని నగర పంచాయతీ కమిషనర్ ఒకరి వద్ద ప్రస్తావించగా.. పట్టణంలో పాలిథిన్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# సీఆర్ఎంపీ రెండో దశకు చకచకా..

- 2,828 వ్యయంతో 1142.54 కి.మీ. పనులకు ప్రతిపాదన
- చార్మినార్ పాత బస్టాండ్ వద్ద మల్టీ లెవెల్ పార్కింగ్
- ఆమోదం పలికిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ




కాంప్రెహెన్సివ్ రోడ్డు మొబిలిటీ ప్లాన్ (సీఆర్ఎంపీ) రెండో దశలో భాగంగా ఐదేళ్ల వరకు పాత నియమని బంధనలతో జోన్ల వారీగా ప్యాకేజీని చేపట్టేందుకు జీహె చ్ఎంసీ చకాచకా పావులు కదుపుతోంది.

ఈ మేరకు 1142.54 కిలోమీటర్లు రోడ్డు అభివృద్ధి పనులకు గాను 5.2,828 (2025–2030 ) పెండింగ్ ఆప్రూవల్ ప్రభుత్వానికి సిఫారసు చేసేం దుకు అంచనా వ్యయాన్ని రివైజ్డ్ చేశారు. దీనికి ప్రభుత్వ మంజూరు కోరుతూ ఆగష్టు 30 న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. అదేవిధంగా చార్మినార్ జోన్లోని చార్మినార్ పాతబస్టాండ్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం పలికింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్ ఆపరేషన్ అండ్ ట్రాన్స్ఫర్ (డీబీఎఫ్టీ) బేసిస్ ప్రకారంగా 15 ఏళ్లు, ఆ తర్వాత మరో 5 ఏళ్లపాటు ఫెర్ఫార్మెన్స్ కండిషన్ ప్రకారంగా పెంచేందుకు అనుమతించింది. అలాగే ఎల్బీనగర్, హయత్నగర్ సర్కిల్ వార్డు నంబరు–11లో కుమ్మరికుంట చెరువునుంచి రాఘవేంద్ర కాలనీ బస్ డిపో వరకు రూ.6 కోట్లతో చేపట్టే బాక్స్ డ్రెయిన్ నిర్మా ణానికి టెండర్ పిలిచేందుకు పరిపాలనా అనుమతికి కమిటీ ఆమోదం తెలిపింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యా లయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన ఆగష్టు 30న స్టాడింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావే శంలో కమిషనర్ ఆర్వీ కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, ఆయేషా హుమేరా, మహ్మద్ సలీం, మహాలక్ష్మి రామన్గౌడ్, సీఎన్.రెడ్డి, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, వి.జ గదీశ్వర్ గౌడ్, బూరగడ్డ పుష్ప పాల్గొన్నారు. కాగా, సమా వేశంలో మొత్తం 9 అంశాలు, 4 టేబుల్ ఐటమ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

# దేశ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర : మంత్రి కోమటిరెడ్డి

- నల్లగొండలో 28 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం
- ఎంపీ, ఎమ్మెల్సీలు, కలెక్టర్, ఎస్పీ, డీఈఓ హాజరు



నల్లగొండ : దేశాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. సమాజంలో అమ్మా, నాన్నల తర్వాత స్థానం గురువుకి ఇచ్చారని, గురువు గొప్పతనాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి చాటి చెప్పారని, ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. తెలంగాణ విద్యార్థులు ప్రపం చంతో పోటీపడేలా ఒక్కొటి రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. తొలి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులు నల్లగొండలోనే ప్రారంభమైనట్లు చెప్పారు.


నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించే బాధ్యత గురువులపై ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, విద్యార్థులను ప్రత్యేకించి మారుమూల ప్రాంత విద్యార్థులకు మంచి విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆయన కోరారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మరో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సమాజానికి దిశా, దశ నిర్దేశం చేసేది ఉపాధ్యాయుడేనన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో ఉపాధ్యాయుల కృషి వల్లే గతేడాది కంటే ఈ ఏడాది 12 శాతం విద్యార్థుల నమోదు పెరిగిందన్నారు. ఉపాధ్యాయుల కృషితోనే ఎక్కడా లేని విధంగా భవిత కేంద్రాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు మంచి విద్యను అందిస్తే విద్యార్థుల గుండెల్లో నిలిచిపోతారన్నారు.

**సభలో మంత్రి కోమటిరెడ్డికి చేదు అనుభవం** ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన సభలో ఎంపీ రఘువీర్ రెడ్డి మాట్లాడిన తర్వాత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడే సమయానికి సభలోని ఉపాధ్యాయులు దాదాపుగా అందరూ భోజనశాలకు వెళ్లారు. దీంతో సభా ప్రాంగణం బోసిపోయింది. ఉపాధ్యాయుల తీరుపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులంటే అంటే ఇదేనా? మీకోసం వస్తే మీరు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ వేదికపై అసహనంగా నిలబడి పోయారు. డీఈఓ భిక్షపతి కల్పించుకుని ఉపాధ్యాయులందరూ సభా ప్రాంగణంలోకి రావాలని పలు పర్యాయాలు మైక్‌లో అనౌన్స్ చేసినప్పటికీ కొంతమంది ప్రాంగణంలోకి రాగా మంత్రి తన ప్రసంగాన్ని కొనసాగించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం, ఎస్పీ శరత్ చంద్ర పవార్, డీఈఓ బొల్లారం భిక్షపతి, అడిషనల్ ఎస్పీ రమేశ్, నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్ రెడ్డి, కమిటీ చైర్మన్ రమేశ్, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# అర్హులు ఎన్ఎఫ్‌బీఎస్‌కు దరఖాస్తు చేసుకునేలా చూడాలి

## కలెక్టర్ ఇలా త్రిపాఠి




చందూరు, సెప్టెంబర్ 06 : జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి (National Family Benefit Scheme -- NFBS) అరులు దరఖాస్తు చేసుకునేలా చూడాలని నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. శనివారం చందూరు తాసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె ఈ సందర్భంగా మాట్లాడారు. 59 సంవత్సరాల లోపు ఉన్న కుటుంబ పెద్ద ఏదైనా కారణం చేత మరణిస్తే అర్హులైన కుటుంబానికి ఈ పథకం కింద రూ. 20 వేలు అందించడం జరుగుతుందని తెలిపారు.

ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం కేజీబీవీని కలెక్టర్ తనిఖీ చేశారు. కేజీబీవీ పరిసరాలు, కిచెన్, స్టోర్ రూమ్, వాష్ ఏరియాను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో చందూరు ఆర్డీఓ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్, ఎంపీడీఓ యాదగిరి పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న డా.దోమల రమేశ్




నల్లగొండ : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దోమల రమేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్య క్రమంలో విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితా రాణా, ఎంజీయూ వీసీ ప్రొ? ఖాజా అల్తాఫ్ హుస్సేన్ చేతుల మీదుగా ఆయన అవార్డును స్వీకరించారు. దీంతో ఆయనకు కుటుంబ సభ్యులు, ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆకుల రవి, సీఓఈ డాక్టర్ జి. ఉపేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ డా. హరీశ్ కుమార్‌తో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

# తెలంగాణ సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకం

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నల్లగొండ, : తెలంగాణ సాయుధ పోరాటం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సెప్టెంబర్-17ను పురస్కరించుకోని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో ప్రజాపాలన దినోత్సవం పేరుతో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ ఎందరో త్యాగధనులు పోరాటం చేసినందునే ఈ రోజు మనం ఆ ఫలాలు అనుభవిస్తున్నా మన్నారు. తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య మొదలు భీంరెడ్డి నర్సింహారెడ్డి, బొమ్మగాని ధర్మబిక్షం, ఆరుట్ల రామచంద్రా రెడ్డి, చాకలి ఐలమ్మ, ఎల్లారెడ్డి లాంటి వారు ఎన్నో పోరాటాలు చేశారని, వారి పోరాటం వృధా కాలేదన్నారు.

కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలూ నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, గ్రంధాలయ చైర్మన్ హఫీజ్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# నల్లగొండ మత్స్యశాఖలో అవినీతి తిమింగలం

## రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎసిబి అధికారులు



నల్లగొండ : నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. చరిత రెడ్డి లంచం స్వీకరిస్తూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. వివరాల ప్రకారం.. ఫిషరీస్ కోఆపరేటి వ్ సొసైటీకి కొత్త సభ్యుల అనుమతుల కోసం కేతపల్లి మండలం బొప్పారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే ఫిర్యాదుదారుని నుంచి రూ.20,000 లంచం డిమాండ్ చేసి స్వీకరించారు. అధికారి సూ చన మేరకు హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకున్న లంచం మొత్తాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిణి తన పదవిని దుర్వినియోగం చేసి అవినీతిపరంగా వ్యవహ రించినట్టు తేలడంతో ఆమెను అరెస్టు చేసిన ఏసిబి అధికారులు, హైదరాబాద్ నాంపల్లి స్పెషల్ ఏసిబి ప్రత్యేక కోర్టుకు హాజరు పరిచారు.

కేసు దర్యాప్తులో ఉంది. లంచం డిమాండ్ జరిగితే వెంటనే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు. అదేవిధంగా ద్వారా కూడా సమాచారం అందించవచ్చని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారుల వివరాలు రహస్యంగా ఉంచబడతాయని ఏసీబీ అధికారులు తెలిపారు. ఏసిబికి పట్టుబడిన ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ సరిత రెడ్డికి సంబంధించిన కు టుంబ సభ్యులు ఇతర ప్రాంతాల్లో ప్రత్యేక టీంలు తనిఖీలు నిర్వహిస్తున్నాయన్నారు. లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన చరిత రెడ్డిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కో ర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

# పెట్రోల్ బంకుల్లో ఉండవలసిన సర్వీసులు




పెట్రోల్ బంకుల్లో మంచి నీళ్లు లేకపోయినా ...
వాహనాలకు గాలి సౌకర్యం లేకపోయినా ...
టాయిలెట్ వాడుకోవడానికి అవకాశం లేకపోయినా,
శుభ్రం లేకపోయినా ...
ఫస్ట్ ఎయిడ్ బాక్స్ మందులు లేకపోయినా ...
పెట్రోలు, డీజిల్ కల్తీ జరిగినా ...
పెట్రోల్, డీజిల్ కొలతలు తేడా వచ్చిన ...
పెట్రోల్ బంకుల్లో పనిచేసే సిబ్బంది మన పట్ల దురుసుగా ప్రవర్తించిన...
పెట్రోలు బంక్ యజమానిపై, సిబ్బందిపై ఫిర్యాదు చేయడానికి,
పెట్రోలు సరఫరా చేసే సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు ...
ఈ క్రింది నెంబర్లను సంప్రదించవచ్చు.
ఇండియన్ ఆయిల్–1800233355
భారత్ పెట్రోలియం–1800224344
హెచ్పిసిఎల్–18002333555
రిలయన్స్–18008919023.
మండల సమాచార కేంద్రం ఎంసీఐసీ ఇన్చార్జ్.
CRPFI జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమితి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ రిలేషన్ సెక్రెటరీ
D. సురేష్ 9133366449??...
ఈ రాష్ట్ర ప్రజలు కల్తీ కి దూరంగా అవినీతి అంతం వైపు అడుగులు వేయండి ...
ఇప్పటికైనా మేలుకో వినియోగదారుడా

# పేదలకు మెరుగైన వైద్యసేవలు




హుజూర్‌నగర్ , : పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కాం గ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలో రూ.3.5 కోట్లతో నిర్మించనున్న ఓపీ నూతన బ్లాక్, ధోబీఘాట్, పార్కింగ్ షెడ్లకు శంకుస్థాపన చేశారు. రూ.1.25 కోట్లతో నిర్మించిన రక్తనిధి, డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. రూ.3.5కోట్లతో ఏర్పాటుచేసిన సీటి స్కాన్‌ను ప్రా రంభించారు. అదేవిధంగా పట్టణంలోని మెయిన్‌రోడ్డులోని ఎన్నెస్పీ స్థలంలో రూ.8 కోట్లతో నిర్మించే ఎన్నెస్పీ కార్యాలయాల సమీకృత భవనాలకు మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యుత్ కార్యాలయం ఎదుట అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు రక్తనిధి, డయాలసిస్, స్కానింగ్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మాజీ సీఎం రోశయ్య హయాంలో 100 పడకల ఆసుపత్రి మంజూరు చేయించానన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించి అండగా ఉండాలన్నారు. పట్టణంలో రూ.7.5 కోట్లతో జూనియర్ కళాశాల, రూ.4.5 కోట్లతో డిగ్రీ కళాశాల భవనాలు నిర్మిస్తున్నామన్నారు. ఫణిగిరి గట్టు వద్ద 2,160 మోడల్ కాలనీ ఇళ్లు నిర్మిస్తున్నామని త్వరలోని వాటిని పేదలకు పంపిణీ చేస్తామన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్లు, గ్రామీణ రహదారులు నిర్మించామన్నారు. ఐటీఐ, ఏటీసీ కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు కొత్త బస్టాండ్‌కు రూ.4.5 కోట్లు మంజూరు చేయించానన్నారు. గడ్డిపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించామన్నారు. మట్టపల్లి, జాన్‌పాడ్‌లను ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖాధికారి చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వో జయమనోహ రి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ వనజ, డాక్టన్ ప్రవీణ్‌కుమార్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ నాగమణి, తన్నీరు మల్లికార్జున్‌రావు, యరగాని నాగన్న, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీను, శ్రీనివాసగౌడ్, గెల్లి రవి, అజీజ్‌పాషా, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

**అంబేద్కర్ ఆలోచనలే కాంగ్రెస్ మూల సిద్ధాంతం : మంత్రి ఉత్తమ్ :** అంబేద్కర్ ఆలోచన విధానమే కాంగ్రెస్ మూల సిద్ధాంతమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట నూతనంగా ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి, మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని రచించిన వ్యక్తి అని, సామాజిక న్యా యం కోసం పనిచేసిన గొప్ప సంఘసంస్కర్త అంబేద్కర్ అని కొనియాడారు. బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల సంఘం కుమ్మక్కై, లక్షలాది ఓటర్లను జాబితా నుంచి తొలగించి దొంగ ఓటర్లను చేర్పించారన్నారు. ఓటు చోరీ కేసులో

రాహుల్‌గాంధీ బిహార్‌లో చేస్తు న్న పాదయాత్రకు దేశ ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. 300 మంది ఎంపీలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు.

అంబేద్కర్ 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పిస్తే ఎన్నికల సంఘం ఆ ఓట్లను తొలగించిందని ధ్వజమెత్తారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే రాహుల్ పాదయాత్ర చేస్తున్నారన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం గర్వంగా భావిస్తున్నానన్నారు. సామాజిక న్యాయమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సామాజిక న్యాయం కోసం, పౌరుల హక్కుల కోసం ప్రభుత్వం పనిచేస్తోందన్నా రు. బీజేపీకి తొత్తుగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఫ్రాంక్లిన్, డీఈలు అమరబోయిన శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య, ఏడీఈలు సక్రూనాయక్, నాగిరెడ్డి, రాంప్రసాద్, పోతురాజు రమేష్, జగదీష్, వడ్డాణపు గురవయ్య, రామునాయక్, పి.శ్రీనివాసు, సైదా, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

## కలెక్టర్ ఎం.హనుమంతరావు



భువనగిరి : రసాయన ఔషధ పరిశ్రమలు, ప్రమాదకర కర్మాగారా ల్లో పకడ్బందీగా భద్రతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని పలు పరిశ్రమల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రసాయన ఔషధ పరిశ్రమల్లో ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాలతో ప్రాణ నష్టం జరిగిందని,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్య లు చేపట్టాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ (రెవె న్యూ) వీరారెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్‌రావు, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, అగ్నిమాపక శాఖాధికారి మధుసూధన రావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రవీందర్ అధికారులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు : య ూ రి య ా కోసం రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ తెలిపారు. మండల కేంద్రంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా కావాల్సినంత యూరియా అందుబాటులో ఉంద న్నారు. ప్రభుత్వం సూచించిన ధరకంటే ఎక్కువకు విక్రయిస్తే చర్య లు తీసుకుంటామన్నారు. ఆయనవెంట తహసీల్దార్ దశరథ, ఏవో అంజనీదేవి, రైతులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని, బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసిన వారికి ప్రతీ సోమవారం రూ.లక్ష చొప్పున వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం మోత్కూరు మండలం అనాజిపురంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి స్వాతి, ఎంపీవో జనార్ధన్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని నూనెగూడెం గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో దేవేందర్ రావు, హౌసింగ్ ఏఈ కావ్య శ్రీ, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక ఉన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏవో సూరజ్‌కుమార్, ఏఈవో క్రాంతి పాల్గొన్నారు.

# నేషనల్ బెస్ట్ టీచర్‌గా పవిత్ర




పెన్‌పహాడ్, : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ టీచర్‌గా పని చేస్తున్న మారం పవిత్ర 2025 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక ఉపాధ్యాయురాలు మారం పవిత్ర ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అమెరికాలాంటి దేశాల్లో విద్యా విధానం ఎలా ఉందో విద్యార్థులకు స్పష్టంగా అర్థమయ్యేలా చేసేందుకు విద్యా వారధి కార్యక్రమం ప్రవేశపెట్టారు.

విద్యా వారధిలో స్కూల్ పిల్లలు అమెరికాలోని విద్యార్థులతో ప్రతి ఆదివారం సాయంత్రం 7 గంటలకు జూమ్ ద్వారా ఇంటరాక్ట్ అవుతారు. 2019లో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ టీచర్ అవార్డు, 2021లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు, టెక్ మహీంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నిర్వహించిన సైన్స్ ఉపాధ్యాయ పోటీల్లో ట్రాన్‌ఫార్మింగ్ అవార్డు, 2023లో నేషనల్ సైన్స్‌డే సందర్భంగా సారాబాయి టీచర్ సైంటిస్ట్ నేషనల్ అవార్డును జమ్ముకాశ్మీర్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రవిశంకర్ చేతుల మీదుగా అందుకున్నారు. 2023-24లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపధ్యాయురాలి అవార్డు, 2025లో జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా భారత రాష్ట్ర పతి చేదుల మీదుగా అవార్డు అందుకున్నారు.

# ఆ ఐదుగురే తెలంగాణను దోచుకున్నారు

## ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి

భువనగిరి : కెసిఆర్ కుటుంబంలో ఉన్న ఆ ఐదుగురు కలిసి తెలంగాణను దోచుకున్నారని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. హరీశ్, సంతోష్ ఇంట్లో బంగారం ఉంటే బంగారు తెలంగాణ ఎట్లా అవుతుందని ఎంఎల్‌సి కవిత చేసిన వ్యాఖ్యలను తాము స్వాగతిస్తున్నామని అన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఎంఎల్ కుంభం అనిల్ కుమార్ రెడ్డి తో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.వేల కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. గొర్రెల పథకం, దళిత బంధు స్కాంలు.. ఇసుక దందా, రియల్ ఎస్టేట్, గ్రానైట్ వ్యాపారాలతో గత ప్రభుత్వం తెలంగాణ సమాజాన్ని దోపిడీ చేసిందని విమర్శించారు.

కవిత బిఆర్ఎస్ నుంచి బయటికి వచ్చి గతంలో జరిగిన అవినీతిపై మాట్లాడి మంచి పనిచేసిందని అన్నారు. బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై కవిత సిబిఐకి వాగ్మూలం ఇచ్చి తమ చిత్తశుద్ధిని నిరుపించుకోవాలని సూచించారు.



జరుగుతున్న దోపిడీని చూసి ఊరుకున్న కెసిఆర్ కూడా అవినీతిపరుడేనని అన్నారు. దోపిడీ జరిగిన విషయాన్ని తెలిసినా కెసిఆర్ అప్పుడే దోపిడీని ఎందుకు అపలేదని ప్రశ్నించారు. గత పాలనలో జరిగిన అవినీతికి కెసిఆర్ కుటుంబం బాధ్యత వహించవలసిందేనని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలనలో నీతిమంతమైన, సుస్థిర పాలన అందిస్తున్నామని చెప్పారు.

# స్వయం ఉపాధి కల్పన పై దివ్యాంగులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించిన డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్

## దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పన కొరకు మంజూరైన యూనిట్ గ్రాంట్ పత్రాలను అందజేసిన ఎంపీడీవో



మిర్యాలగూడ : మిర్యాలగూడ మండల సమైక్య కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పన పై అవగాహన సదస్సు మరియు శిక్షణ కార్యక్రమం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో శేషగిరి శర్మ హాజరై దివ్యంగా అభ్యర్థులకు బెన్ఫిషరీ గ్రాంట్ పత్రాలను అందించారు అనంతరం శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పన కోసం నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు అదేవిధంగా దివ్యాంగులు ఎవరిపై ఆధారపడకుండా స్వయంగా తమ వ్యాపారాన్ని తామే చేసుకునే విధంగా దోహదపడుతుందన్నారు రెడ్డిస్ ల్యాబ్ ఫౌండేషన్ వారు దివ్యాంగుల స్వయం ఉపాధి కల్పన కొరకు మండలాన్ని యూనిట్గా తీసుకొని వివిధ గ్రామాల నుండి అర్హులైన 16 మంది దివ్యాంగ అభ్యర్థులను ఎంపిక చేసి వారు వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి చెందడానికి ఒక్కొక్క అభ్యర్థికి 25వేల రూపాయల విలువచేసే కుట్టు మిషన్లు పిండి మిల్లులు మరికొన్ని యూనిట్లను డాక్టర్ రెడ్డి ఫౌండేషన్ వారు అందించడం చాలా అభినందించదగ్గ విషయం అన్నారు సమాజంలో అన్ని బాగుండి కూడా ఏమీ చేయకుండా ఇతరులపై ఆధారపడి బ్రతికేవారు ఉన్న ఈ రోజుల్లో దివ్యాంగులు తమ సొంత వ్యాపారంపై అభివృద్ధి చెందాలనే ఆలోచనతో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమానికి వచ్చిన దివ్యాంగ మిత్రులను అభినందిస్తున్నా మన్నారు అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న దివ్యాంగ అభ్యర్థులకు బెనిఫిషరీ యూనిట్ గ్రాండ్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డైరెక్టర్ పిఎన్ శ్రీనివాస్ దివ్యాంగులకు శిక్షణ తరగతులు నిర్వహించిన అనంతరం వ్యాపార అభివృద్ధికి కావలసిన మెలుకువల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరి శర్మ డిపిఎం రామలింగయ్య సిడిపిఓ మామత ఏపిఎం దిలీప్ కుమార్ డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డైరెక్టర్ పిఎన్ శ్రీనివాస్ టెరిటరీ హెడ్ సాయితేజ క్లస్టర్ కోఆర్డినేటర్స్ ఓం ప్రకాష్ మహేష్ మణికంత వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం గంటల కొద్ది క్యూలో రైతుల పడిగాపులు




కట్టంగూర్, : యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆరుగాలం కష్టపడి పంటను సాగు చేస్తే సకాలంలో యూరియా అందపోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే అవకాశంలేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కట్టంగూర్ పీఏసీఎస్ కు రెండు లారీలు 888 బస్తాల యూరియా వచ్చింది. ఒకే దగ్గర టోకెన్లు, యూరియా పంపిణీ చేయడంతో రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని టోకెన్ల పంపిణీని రైతు వేదిక వద్దకు మార్చారు. దీంతో రైతు వేదిక వద్ద క్యూలో ఉన్న 444 మంది రైతులకు సీరియల్ ప్రకారం అధికారులు టోకెన్లు అందజేశారు.

టోకెన్లు తీసుకున్న రైతులు సింగిల్ విండో కార్యాలయం వద్దకు చేరుకుని మళ్లీ అక్కడ క్యూలో నిల్చున్నారు. పది గంటల తర్వాత వ్యవసాయ అధికారి గిరిప్రసాద్, సీఈఓ మల్లారెడ్డి పర్యవేక్షణలో పోలీసుల పహారాలో ప్రతి రైతుకు రెండు బస్తాల చొప్పున సాయంత్రం 5 గంటల వరకు పంపిణీ చేశారు. సోమవారం మరో రెండు లారీల యూరియా వస్తుందని అధికారులు తెలుపడంతో యూరియా దొరకని రైతులు నిరాశతో వెనుతిరిగారు. సోమవారానికి కూడా 100 మంది రైతులకు టోకెన్లు అందజేశామని రైతులు సహకరించాలని ఏఓ గిరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు.



# మాట నిలబెట్టుకున్న.. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

## అమోఘం సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ గారి కృషి

## ఎట్టకేలకు జర్నలిస్టుల కల సహకారం.. అందిన ఇళ్ల స్థలాల పట్టాలు



దశాబ్ద కాలంగా ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల కల సాకారమయ్యింది... ఫ్లోర్ లీడర్ గా మాట ఇచ్చి... ఎమ్మెల్యేగా ఇచ్చిన మాట నిలుపుకొని,కలను సాకారం చేశారు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి BLR గారు.....

విధి నిర్వహణలో తనకు తానే సాటిగా... ప్రజాసేవలో నిమగ్నమైన స్థానిక సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ గారు.. జర్నలిస్టుల కలను సాకారం చేసేందుకు అగో అమోఘమైన కృషిని చేశారు... స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా దాదాపు 88 మంది విలేకరులకు పట్టాల పంపిణీ చేశారు.... నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డిగారు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ గారు, ఎమ్మెల్యే BLR గారు , డీఎస్పీ రాజశేఖర్ రాజు గార్ల చేతులమీదుగా విలేకరులకు పట్టాలు అందజేశారు...

ఈ సందర్భంగా నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డిగారు మాట్లాడుతూ విలేకరుల అభివృద్ధి కోసం ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకొని ముందుకు పోతున్న ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ , సబ్ కలెక్టర్ల ను ప్రత్యేకంగా విలేకరులకు ఎల్లవేళలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.. .

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి BLR గారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ అనేక ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకమైన పాత్ర పోషిస్తున్న విలేకరులకు ఇళ్ల స్థలాలు అందజేయాలంటూ ఎప్పటినుండో ప్రభుత్వాలకు విన్నవిస్తూ వస్తున్నారని, గతంలో తాను ఫ్లోర్ లీడర్ గా ఉన్నప్పుడు విలేకరులు చేస్తున్న ఆందోళనలకు మద్దతు తెలిపి తాను అధికారంలోకి వస్తే పంపిణీ చేస్తానని మాట ఇచ్చానని, అన్నమాట ప్రకారం పట్టాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం దూసుకుపోతుందని, విలేకరుల సంక్షేమం కోసం తాము నిరంతరం పనిచేస్తామన్నారు. మిర్యాలగూడ అభివృద్ధిలో పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలని కోరారు. ఎంపీ రఘువీర్ రెడ్డి గారు ,ఎమ్మెల్సీ శంకర్ నాయక్ గారు, స్థానిక అధికారుల సహకారంతో మిర్యాలగూడ ను అభివృద్ధి పథంలో తీసుకుపోతామని అన్నారు. ఇంకా ప్లాట్లు అందనివారు ఎలాంటి దిగులు పడద్దని, కొద్ది రోజుల్లోనే అందరికీ న్యాయం చేస్తామన్నారు...

సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ గారు మాట్లాడుతూ విలేకరులకు ఇళ్ల స్థలాల పంపిణీ చేసేందుకు రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా గొప్ప నిర్ణయం తీసుకున్నామని, దీనికి స్థానిక ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఎమ్మెల్సీ శంకర్ నాయకులు పూర్తి సహకారం అందించడంతో పట్టాల పంపిణీ సాధ్యపడిందన్నారు. ఇదే చెరువుతో ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు చేసి అన్ని సౌకర్యాలతో జర్నలిస్టు కాలనీ ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ..

ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మాట తప్పినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి విలేకరులకు ఇళ్ల స్థలాలు అందజేయటం హర్షణీయమన్నారు. ఈ పంపిణీలో కృషిచేసిన ఎమ్మెల్యే BLR గారికి సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ గార్లను ప్రత్యేకంగా అభినందించారు...

ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, కాంగ్రెస్ నాయకులు మరియు BLR బ్రదర్స్ పాల్గొన్నారు..

# మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలి : డా.ముప్వా రామారావు.




మిర్యాలగూడ : ఆరోగ్యంగా ఉండాలంటే రోజు తగినంత పౌష్టికాహారం తీసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ సలహాదారు డాక్టర్ ముప్వా రామారావు అన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలం అవంతిపురం గిరిజన గురుకుల బాలికల కళాశాలలో జనవిజ్ఞాన వేదిక,సమూహ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిచయం శాస్త్రీయ దృక్పథంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ముప్వా రామారావు మాట్లాడుతూ మహిళల్లో రక్త హీనత లేకుండా ఉండాలంటే రోజువారీ ఆహారంలో ఆకు కూరలు, గుడ్డు, పప్పు మొదలగు ఐరన్, ప్రోటీన్ కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిరోజు నాలుగు నుండి ఐదు లీటర్ల వాటర్ తాగడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. భారత్ బచావో జిల్లా అధ్యక్షురాలు ఉదయ్ మాట్లాడుతూ స్త్రీలు రాజ్యాంగంలో పొందుపరిచిన స్వేచ్ఛ సమానత్వం సమాన అవకాశాలని అంది పుచ్చుకోవాలని తద్వారా స్త్రీలు సాధికారిత సాధించవచ్చు అని అన్నారు.

సమూహ రైటర్స్ ఫోరం నాయకులు కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ రాజ్యాంగంలో 51 ఏ హెచ్ ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్ ప్రిన్సిపల్ సరితా రెడ్డి, అధ్యాపక బృందం విద్యార్థినులు పాల్గొన్నారు

# మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇందిరమ్మ పథకం కింద నిరుపేదలైన విలేకరులకు ఇంటి స్థల పట్టా సర్టిఫికెట్ల పంపిణీ..

సుమారు 85 మందికి పట్టాలు పంపిణీ చేసిన సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఎంపీ రఘువీ రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్,డిఎస్పి రాజశేఖర్ రాజ్..

గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.. అర్హులైన నిరుపేద విలేకరులకు ఇంటి స్థలాలు పంపిణీ చేస్తామని భరోసా..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా విలేకరులకు పట్టాల పంపిణీ..

విలేకరుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుంది– ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

# విద్యా వ్యవస్థ అభివృద్ధికై యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం : సిఎం రేవంత్

- విద్యకు ప్రాధాన్యతనిస్తున్న కేరళ దైవ భూమి
- కేరళ అమలు చేస్తున్న 'వయోజన విద్యా కార్యక్రమం'
- అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది
- తెలంగాణలో విద్యాశాఖను తీసుకునేందుకు నేతలెవరూ సుముఖత వ్యక్తం చేయడం లేదు
- కెసి వేణుగోపాల్ రచించిన పుస్తకావిష్కరణలో సిఎం రేవంత్



హైదరాబాద్: తెలంగాణలో విద్యాశాఖను తీసుకునేందుకు నేతలెవరూ సుముఖత వ్యక్తం చేయడం లేదని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడం కోసం ప్రత్యేక దృష్టి పెట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేరళలోని అలెప్పీలో కెసి వేణుగోపాల్ రచించిన పుస్తకాన్ని సిఎం రేవంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వందశాతం అక్షరాస్యతో దేశంలోనే కేరళ ఫస్ట్ ప్లేస్‌లో ఉందన్నారు. విద్యకు, కేరళకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. దేశంలో వందశాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలిచిందన్నారు. ఈ రాష్ట్రంలో అమలు చేస్తున్న 'వయోజన విద్యా కార్యక్రమం' అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని సిఎం రేవంత్ అన్నారు. కేరళ రాష్ట్రం విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్య అనేది మనకు లభించిన ఒక గొప్ప బహుమతి అని ఆయన అభివర్ణించారు. విద్య అన్నది ఒక గొప్ప ఆయుధమని, అదే అందరికీ గొప్ప శక్తి అని తాను కూడా చాలా బలంగా విశ్వసిస్తానని ఆయన తెలిపారు. అలాంటి విద్యకు ప్రాధాన్యతనిస్తున్న దైవ భూమి కేరళ అని సిఎం రేవంత్ కొనియాడారు. అందుకే అందరితో పాటు తనకు కూడా కేరళను చూస్తే అసూయగా ఉందని సిఎం రేవంత్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. 10వ, 12వ తరగతి తర్వాత సున్నా శాతం డ్రాప్ అవుట్స్ సాధిస్తే అందులో ఆశ్చర్యమేమీ ఉండదని ఆయన అన్నారు.

ఏఐ టెక్నాలజీతో ఐటిఐ స్టూడెంట్స్‌కు టీచింగ్ ఇప్పిస్తున్నాం : తెలంగాణలో బడుగు, బలహీన వర్గాలకు మెరుగైన విద్య అందిస్తున్నామని ఆయన చెప్పారు. తెలంగాణలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని సిఎం రేవంత్ అన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. పిపిపి మోడల్ పద్ధతిలో యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని రేవంత్ చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీకి రూ.5 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఏఐ టెక్నాలజీతో ఐటిఐ స్టూడెంట్స్‌కు టీచింగ్ ఇప్పిస్తున్నామన్నారు.

తెలంగాణలో కూడా విద్యాభివృద్ధికి పెద్ద ఎత్తున దృషి సారించామని సిఎం రేవంత్ తెలిపారు. విద్యకు ఉన్న ప్రాధాన్యత గురించి తాను ప్రతి సందర్భంలోనూ ప్రజలకు చెబుతున్నానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం చేసే సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు ఏదీ చేసినా విద్య మనకు అత్యంత ప్రాధాన్యత కలిగిందని ఆయన తెలిపారు. యూత్ స్కిల్స్ అభివృద్ధిలో సౌత్ కొరియా అగ్రస్థానంలో ఉందని సిఎం రేవంత్ అన్నారు.


తెలంగాణలో పోటీకి ప్రియాంక గాంధీని ఆహ్వానించాం : పేదలు, మైనార్టీల కోసం కెసి వేణుగోపాల్ నిరంతర పోరాటం చేస్తున్నారని ఆయన అండతోనే తెలంగాణ అభివృద్ధిపై మరింత ఫోకస్ చేశామని రేవంత్ తెలిపారు. ఎంపిగా గెలిచిన ప్రియాంకగాంధీ తన నియోజకవర్గాన్ని కర్మ భూమిగా భావిస్తారని రేవంత్ చెప్పారు. తెలంగాణలో పోటీకి ప్రియాంక గాంధీని ఆహ్వానించామని, కానీ, కెసి వేణుగోపాల్ విజ్ఞప్తి మేరకే ప్రియాంక కేరళలో పోటీ చేశారన్నారు. కెసి వేణుగోపాల్ అణిచివేతకు, అన్యాయానికి గురవుతున్న బాధితుల తరపున గొంతుకగా నిలుస్తున్నారని అన్నారు. ఆయన కేరళ రాష్ట్రానికే కాకుండా యావత్ దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబిసి, మైనారిటీ, ప్రత్యేకించి మహిళలు, పిల్లల న్యాయం కోసం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్నారని సిఎం రేవంత్ చెప్పారు. 2006లో కెసి వేణుగోపాల్ ప్రారంభించిన పొంథువల్ (ఎంపి) మెరిట్ అవార్డులకు దేశంలోనే చాలా ప్రత్యేకత ఉందన్నారు. 10వ తరగతి, 12వ తరగతి విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి, వారిలో ఒక స్ఫూర్తిని నింపడానికి ఈ మెరిట్ అవార్డులు ఎంతగానో దోహదపడుతున్నాయని సిఎం రేవంత్ అన్నారు. ఈ ఏడాది వందశాతం ఫలితాలను సాధించిన 150 పాఠశాలల్లో దాదాపు 3,500 లకుపైగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవార్డులు అందిస్తున్నారన్నారు.

55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశాం : 2047 నాటికి తెలంగాణ 3 మిలియన్ డాలర్ల ఎకానమీని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సిఎం రేవంత్ తెలిపారు. వచ్చే పదేళ్లలో తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీ చేరుకుంటుందని రేవంత్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో పేదలకు నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించామని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేవలం 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని ఆయన తెలిపారు. ఒక్కో స్కూల్‌ను రూ.200 కోట్లు ఖర్చుతో 25 ఎకరాల్లో నిర్మించబోతున్నామని ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించినట్లు రేవంత్ రెడ్డి చెప్పారు.

**2029లో జరిగేవి దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు :** త్వరలో కేరళ రాష్ట్రానికి ఎన్నికలు రాబోతున్నాయని 2026లో జరిగే ఎన్నికలను కేవలం కేరళ అసెంబ్లీ ఎన్నికలుగా భావించవద్దని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అవి 2029లో దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు అవుతాయన్నారు. దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి రాజీవ్ గాంధీ ఓటు హక్కు కల్పించారన్నారు. అదే బిజెపి నాయకుడు నరేంద్ర మోదీ పౌరుల నుంచి ఓటు హక్కును కొల్లగొడుతున్నారని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 2029లో జరగబోయే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపిల మధ్య ఉన్న తేడాను గమనించాలని సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ఆ నిధులను పట్టణాలకు ఎప్పుడు ఇస్తారు: హరీష్ రావు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ ప్రగతిని బంద్ చేసిందని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించారు. కేంద్రం ఇచ్చిన నిధులను ఎప్పుడు పట్టణాలకు ఇస్తారని ప్రశ్నించారు. పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును శాసన సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా హరీష్ రావు ప్రసంగించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధం పడకేసిందని, మున్సిపాలిటీల్లో సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని, జిన్నారం, ఇంద్రేశం కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు అసెంబ్లీలో బిల్లు పెట్టాలని నిలదీశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి పెంచుకోవడం కోసం అసెంబ్లీలో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష ఎంఎల్ఎలు ఉన్న సెగ్మెంట్లకు నిధులు ఎందుకు రద్దు చేశారని, నిధులు ఇవ్వకపోతే మున్సిపాలిటీలు ఎలా నడుస్తాయని హరీష్ రావు అడిగారు.



# సచివాలయాన్ని తలపించేలా మున్సిపల్ భవనం నిర్మిస్తాం

## ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపాలిటీతో పాటు ఆలేరు అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మున్సిపల్ నూతన కార్యాలయం నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ యాదగిరిగుట్ట పవిత్ర పుణ్యక్షేత్రం కావడంతో స్థానికులకు, భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పూర్తి స్థాయి సౌకర్యం కల్పించే విధంగా అభివృద్ధి పనులు చేపడతానన్నారు. గ్రామపంచాయతీ ఏర్పడినప్పుడు నిర్మాణం చేసిన భవనం శిథిలావస్థకు చేరడంతో తొలగించడం జరిగిందని, అదే స్థలంలో నూతన మున్సిపల్ భవనం రూ.3 కోట్ల 20 లక్షలతో అన్ని సౌకర్యాలతో సచివాలయాన్ని తలపించేలా మున్సిపల్ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు.

కొత్త భవన నిర్మాణం ఆరు మాసాలలో పూర్తయ్యేలా చూస్తానని, పార్టీలకతీతంగా నూతన మున్సిపల్ భవనంలో తాజా, మాజీ కౌన్సిలర్లు విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలో సీసీ రోడ్లు, నీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎరుకల సుధాహేమేందర్, మాజీ కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణీ భరత్, బబ్బూరి మౌనిక శ్రీధర్, గౌళీకార్ అరుణరాజేష్, ముక్కెర్ల మల్లేష్,

సీస విజయలక్ష్మి కృష్ణ, ఆవుల మమత సాయి, దండెబోయిన అనిల్, మాజీ కోఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎసిబి వలలో కోదాడ ఫారెస్ట్ బీట్ అధికారి



సూర్యాపేట జిల్లా, కోదాడ ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఫారెస్టు బీట్ అధికారి అనంతుల వెంకన్న బుధవారం నల్గొండ రేంజ్ యూనిట్ ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. కలప వ్యాపారానికి ఎటువంటి ఆటంకం కలుగకుండా ఉండేందుకు ఓ ఫిర్యాదుడి నుండి రూ.20 వేల లంచాన్ని ఆయన డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు నల్గొండ ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు బాధితుడు ఫారెస్టు బీట్ అధికారి అనంతుల వెంకన్నకు రూ.20వేలు లంచం డబ్బులు ఇచ్చాడు. ఆ సొమ్మును బైక్ ట్యాంక్ కవర్ జేబులో పెడుతుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ ఫారెస్టు బీట్ అధికారిని అరెస్టు చేసి హైదరాబాదులోని నాంపల్లి ఎసిబి ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తామని నల్గొండ ఎసిబి అధికారులు తెలిపారు.

# ర్యాపిడో మోసపూరిత ప్రకటనలు

## సిసిపిఎ రూ. 10 లక్షల జరిమానా




హైదరాబాద్: ప్రముఖ రైడ్ అగ్రిగేటర్ ర్యాపిడో మోసపూరిత ప్రకటనలు చేసిందని కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) గుర్తించింది. ర్యాపిడో మోసపూరిత ప్రకటనలు, అన్యాయ వ్యాపార పద్ధతులకు రూ.10 లక్షల జరిమానా విధిస్తూ సిసిపిఎ నిర్ణయం తీసుకుంది. "ఆటో ఐదు నిమిషాల్లో లేదా రూ.50 పొందండి" ఆఫర్ హామీలో విఫలమైనట్లు సిసిపిఎ ఫిర్యాదులను అందుకుంది. ఆ సంస్థ హామీ ఇచ్చి సర్వీసులను అందించడంలో విఫలమైన వినియోగ దారులకు డబ్బు తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఆటో ఐదు నిమిషాల్లో అనే ప్రకటనలు వినియోగదారులను తప్పుదారి పట్టించాయని, నిబంధనలు చిన్న అక్షరాల్లో అస్పష్టంగా ఉన్నాయని గుర్తించినట్లు సిసిపిఎ పేర్కొంది. హామీ డ్రైవర్ల బాధ్యత అని నిబంధనలు చెప్పడం ద్వారా ర్యాపిడో బాధ్యత నుంచి తప్పించుకుంది. ర్యాపిడోపై జూన్ 2024 నుంచి జూలై 2025 వరకు 1,224 ఫిర్యాదులు నమోదయ్యాయి. సేవా లోపాలు, రిఫండ్ లేకపోవడం వంటివి ఉన్నాయి. 120 నగరాల్లో 548 రోజుల పాటు ఈ ప్రకటనలు నడిచాయి. మోస పూరిత ప్రకటనలను నిలిపివేయాలని సిసిపిఎ ఆదేశించింది. ఇలాంటి మోసాలపై వినియోగదారులు 1915 లేదా జాతీయ వినియోగదారులు సహాయ వేదిక ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

# యూనివర్సిటీ ఏర్పాటుకు త్వరలో నోటిఫికేషన్



హుజూర్‌నగర్ : వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటు కోసం హుజూర్‌నగర్ ని యోజకవర్గంలోని మేళ్లచెర్వు, పాలకవీడు, హుజూర్‌నగర్ మండలాల్లో భూ పరిశీలన చేశారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ యూనివర్సిటీ అధికారులు, వీసీ, ఇతర ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులు పలు మం డలాల్లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. అయితే హుజూర్‌నగర్ పరిధిలోని మగ్దుమ్‌నగర్, యర్రగట్టు ప్రాంతాల్లోని సర్వే నెం బరు 1,041లోని ప్రభుత్వ భూమిని యూనివర్సిటీ ఏర్పాటుకు ఖరారుచేసినట్లు తెలిసింది. ఇందు కోసం సుమారు 230 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఇప్పటికే 70 శాతం భూసర్వే పూర్తిచేశారు. మిగిలి న భూములను కూడా త్వరలో సర్వే చేయనున్నారు. మొత్తం 273 ఎకరాల ప్రభుత్వ భూమిలో 40ఎకరాల్లో మగ్దుమ్‌నగర్ గ్రామం విస్తరించించి ఉంది. మిగిలిన 230 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యూనివర్సిటీ, కళాశాల నిర్మాణానికి వినియోగించనున్నారు.

**మూడు దశాబ్దాలుగా సాగులో...** యూనివర్సిటీ ఏర్పాటుచేసే ప్రభుత్వ భూమిలో 260 మంది రైతు లు సాగు చేస్తున్నారు. ఈ భూములకు సంబంధించి మూడు దశాబ్దాలుగా ప్రభుత్వాలు సన్న, చిన్నకారు రైతులకు పట్టాలు పంపిణీ చేశా యి. మూడు నెలలుగా ఆయా రైతుల వివరాలను అధికారులు సేకరించారు. 2 నెలలుగా ఆ ప్రాంత రైతులతో అధికారులు చర్చలు జరిపారు. మొదటిసారి ప్రజాభవన టౌనహాల్‌లో నిర్వహించిన చర్చలకు 50మంది రైతులు హాజరై యూనివర్సిటీ ఏర్పాటులో భాగంగా భూసేకరణను స్వాగతించారు. దీంతో రైతులను అన్నివిధాలా ఆదుకుంటామ ని, న్యాయం చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. అనంతరం భూ సేకరణ అధికారి ఐదుగురు ప్రతినిధుల బృందంతో సర్వే చేపట్టారు. 10 రోజుల పాటు సర్వే చేయగా చివరి దశలో కొందరు రైతులు సర్వేను అడ్డుకున్నారు. ఆర్డీ వో, తహసీల్దార్ కార్యాలయా ల ఎదుట ?ఆందోళనలు చేశారు. ఆ తర్వాత జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట కూడా ఆందోళన చే పట్టారు. ఆయా ఆందోళనల్లో రాజకీయ నా యకులు ఉండటంతో యూనివర్సిటీ ఏ ర్పాటుపై అనుమానాలు. తలెత్తాయి. హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో వ్యవసాయ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకం కానుంది.

సుమారు రూ. 1000 కోట్లతో యూనివర్సిటీ, కళాశాలల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. యూనివర్సిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతానికి కొత్త వరివంగడాలు రైతులకు అందుబాటులోకి రావడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు ఈ ప్రాంతానికి వచ్చే అవకాశం ఉండటంతో రైతులకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉన్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది మార్చి 30ఉగాది రోజున హుజూర్‌నగర్‌కు వచ్చిన సీఎం రేవంతరెడ్డి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అభ్యర్థన మేరకు వ్యవసాయ.. యూనివర్సిటీ, కళాశాలను మంజూరు చేశారు. ఈ నెల మొదటి వారంలోనే యూనివర్సిటీ ఏర్పాటుపై నోటిఫికేషన వచ్చే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

# సైక్లింగ్‌ను విస్తృతం చేయాలి

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



హైదరాబాద్, : జాతీయ క్రీడా దినోత్సవాల్లో భాగంగా చివరిరోజు గచ్చిబౌలి స్టేడియం వద్ద జరిగిన ఫిట్ ఇండియా – సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి సైక్లింగ్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించుకోవడానికి ఉపయోగకరమైన సైక్లింగ్‌ను తెలంగాణలో మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. 'ఫిట్నెస్ కా డోస్.. ఆదాగంట రోజ్ ' అన్న నినాదాన్ని విద్యార్థుల్లో, యువతలో, ఉద్యోగుల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.

క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. తెలంగాణలో 9 రోజుల పాటు జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోని బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, పోలీసు క్రీడల విభాగం ఐజీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం స్పోర్ట్స్ పల్స్ (క్రీడానాడి) బులెటిన్‌ను గవర్నర్ ఆవిష్కరించారు.

చట్టసభల్లోనూ బీసీ రిజర్వేషన్లు సాధించాలి బీసీ యుద్ధ భేరి సభలో వక్తలు : స్థానిక సంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42% రిజర్వేషన్ల స్ఫూర్తిగా చట్టసభల్లోనూ బీసీ రిజర్వేషన్లను సాధించుకోవాలని పలు పార్టీల నేతలు పిలుపునిచ్చారు. రాజ్యాధికారం సాధించుకుంటేనే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ అధ్యక్షతన కోల జనార్ధన్ సమన్వయ కర్తగా బీసీల యుద్ధభేరి మహాసభ జరిగింది. హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. బీసీల కోసం కేంద్రం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలన్నారు.

బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 42% బీసీ రిజర్వేషన్ల కల్పనకు సర్కారు జీవో జారీ చేయడం అభినందనీయమని, దానికి వ్యతిరేకంగా కోర్టుకెళ్లిన వారిని రాజకీయ సమాధి చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదన చారి, సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, బీసీ సంఘాల నేతలు నీలావెంకటేష్, వేముల రామకృష్ణ, వి.దానకర్ణాచారి, సుధాకర్ ముదిరాజ్, కృష్ణాయాదవ్ పాల్గొన్నారు.

# వరద బాధితులకు బీజేపీ అండ

## ఎంపీ నిధుల నుంచి రూ.80 లక్షలు సాయం..

## కాంగ్రెస్ చేతులెత్తేసింది: రాంచందర్‌రావు



హైదరాబాద్ / ఖైరతాబాద్ : రాష్ట్రంలో భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఆరుగురు బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి ఒక్కొక్కరు రూ.10 లక్షల చొప్పున రూ.80 లక్షలు కేటాయించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు.

విపత్కర పరిస్థితుల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. తమ ఎంపీలు తక్షణమే ముందుకు వచ్చి సహాయక చర్యల కోసం నిధులను కేటాయించడం ప్రశంసనీయమని అన్నారు. వర్షాలతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలంటూ రాంచందర్‌రావు ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సిరిసిల్ల జిల్లా ప్రజలకు రూ.10 లక్షలు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఎంపీ లాడ్స్ నిధుల నుండి ఈ మొత్తాన్ని సిరిసిల్ల కలెక్టర్‌కు త్వరలోనే ఇస్తానని పేర్కొన్నారు.

**మోదీ తల్లి పట్ల కాంగ్రెస్ వ్యాఖ్యలు సరికాదు: కిషన్ రెడ్డి :** ప్రధాని మోదీ తల్లి పట్ల కాంగ్రెస్ నాయకులు, రాహుల్ గాంధీ మానవత్వం లేకుండా మాట్లాడారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అలాంటి నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఆదివారం బోరబండలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భారతదేశంలో విలీనం కావడానికి సర్దార్ పటేల్ చేసిన కృషిని మోదీ మన్ కీ బాత్‌లో ప్రస్తావించారని తెలిపారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో హైదరాబాద్ లిబరేషన్ డేను నిర్వహించనున్నామని, ఆ కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరవుతారని వెల్లడించారు. అలాగే విశ్వకర్మ దివ్‌సను జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటామని, అదే రోజు ప్రధాని మోదీ పుట్టిన రోజు కూడా కావడంతో తెలంగాణలో 3ముఖ్యమైన కార్యక్రమాలను ఒకే రోజున నిర్వహిస్తామని చెప్పారు. కాగా, ఖైరతాబాద్ మహాగణపతిని ఆదివారం సాయంత్రం కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఖైరతాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఆదర్శ్ వంశీకర్ తయారు చేయించిన 26 కిలోల లడ్డూను గణేషుడికి సమర్పించారు.

**రాహుల్ దిష్టిబొమ్మ దహనం :** ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి డిమాండ్ చేశారు. బిహార్‌లో రాహుల్, ప్రియాంక సమక్షంలోనే కాంగ్రెస్ నేతలు మోదీ తల్లిపై దుర్భాషలాడటం దేశ ప్రజల మనసును కలచివేసిందన్నారు. ఆ వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద మహిళా మోర్చా నేతలు ధర్నా నిర్వహించారు. రాహు ల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం

- **మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులకు ఆమోదం**
- **బిల్లులను ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**
- **నాలుగు బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనసభ**
- **మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం**
- **పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం**
- **అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం**
- **ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ బిల్లుకు శాసనసభ ఆమోదం**
- **ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు బిల్లుకు శాసనసభ ఆమోదం**



హైదరాబాద్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లుకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. తెలంగాణ స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 42 శాతం రిజర్వేషన్లు కల్పించే కీలక సవరణ బిల్లులకు రాష్ట్ర అసెంబ్లీ ఆదివారం ఆమోదం తెలిపింది. తీవ్ర వాదోపవాదాల నడుమ తెలంగాణ మున్సిపాలిటీల (మూడవ సవరణ) బిల్లు-2025, తెలంగాణ పంచాయతీరాజ్ (మూడవ సవరణ) బిల్లు-2025లను సభ వాయిస్ ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం నడిచింది. ముందుగా మంత్రి సీతక్క పంచాయతీ రాజ్ లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంది. మంత్రి సీతక్క ముందుగా మున్సిపల్, తర్వాత పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను సభలో ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది. అనంతరం వాటి గురించి చర్చ జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రసంగిస్తూ ఆర్థిక అసమానతలు తొలగాలంటే ఉపాధి కూడా ఉండాలని పేర్కొన్నారు. చిత్తశుద్ధి ఉండటం వల్లే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై బిల్లు తెచ్చామన్నారు. 2018లో పంచాయతీరాజ్ చట్టంలో 50 శాతం రిజర్వేషన్లపై సీలింగ్ పెట్టామని అన్నారు. ఏ రాష్ట్రంలో రిజర్వేషన్లపై సీలింగ్ విధిస్తూ చట్టాలు లేవని పేర్కొన్నారు. తెలంగాణలో ఉన్న సీలింగ్ను సవరించేందుకు మళ్లీ బిల్లు ప్రవేశపెట్టామని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన 50 శాతం సీలింగ్ను తొలగించే సవరణ కోసమే బిల్లు తీసుకువచ్చామన్నారు. ముందుగా తెలంగాణ పురపాలక చట్టం 2019 నిబంధన సవరణ బిల్లుపై చర్చ జరిగింది. చర్చ జరుగుతున్నందున ఆర్డినెన్స్ కుదరదని మంత్రి శ్రీధర్బాబు తెలిపారు. సెషన్స్ ఉన్నప్పుడు బిల్లు రూపంలో తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సీపెక్స్ సర్వే చేపట్టిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ల సిఫారసుకు చర్యలు చేపట్టామన్నారు.

**నాలుగు బిల్లులకు శాసనసభలో ఆమోదం:** మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. అలాగే పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ బిల్లు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ బిల్లు, ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

**బీసీ వర్గాలకు ఇది చారిత్రాత్మక విజయం: మంత్రి సీతక్క :** తెలంగాణ అసెంబ్లీలో బిసీ బిల్లుకు ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క ఎక్స్ వేదికగా ఆసక్తిరమైన ట్వీట్ చేశారు. అందులో మా నాయకుడు రాహుల్ గాంధీ సూచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి క్రియాశీల నాయకత్వంలో తాము తెలంగాణ శాసన సభలో తెలంగాణ పంచాయతీ రాజ్ సవరణ బిల్లు-2025 ను గర్వంగా ప్రవేశపెట్టామన్నారు. ఈ బిల్లు గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల (బిసిలు) కు 42 శాతం రిజర్వేషన్లను నిర్ధారిస్తుంది. గతంలో బిసిలు కేవలం 23శాతం రిజర్వేషన్లకు

పరిమితం చేయబడ్డారని, ఇది వారి జనాభా నిష్పత్తిని ప్రతిబింబించలేదన్నారు. మన ప్రజా ప్రభుత్వం బిసిల వెనుకబాటుతనాన్ని అంచనా వేయడానికి ఇంటింటికీ సమగ్ర కుటుంబ సర్వే, శాస్త్రీయ కుల గణనను నిర్వహించింది. అంకితమైన కమిషన్ సిఫార్సుల ఆధారంగా, బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అందించడానికి మేము తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 లోని సెక్షన్ 285 ఎని సవరించామన్నారు. ఈ బిల్లు కేవలం రిజర్వేషన్ల గురించి మాత్రమే కాదని, ఇది బీసీలకు సాధికారత కల్పించడం, వారి గొంతుకను వినిపించడం, స్థానిక పాలనలో వారి సరైన ప్రాతినిధ్యాన్ని నిర్ధారించడం వైపు ఒక విప్లవాత్మక అడుగు అన్నారు. ఈ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలపడం బీసీ వర్గాలకు ఇది చారిత్రాత్మక విజయమని మంత్రి సీతక్క తన ట్వీట్ లో రాసుకొచ్చారు.

**పూర్తిస్థాయిలో గ్రూప్-1, 2, 3 నియామకాలు: దుద్దిళ్ల శ్రీధర్‌బాబు** : గ్రూప్-1, 2, 3 నియామకాలు పూర్తిస్థాయిలో భర్తీ చేస్తున్నామని అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బిల్లులో ఉన్న విషయాలు మాత్రమే మాట్లాడాలని, ఎక్కడా నిధుల పరంగా ఇబ్బంది లేకుండా చూస్తామని, కావాల్సినంత మేర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఆనాడు కలెక్టరేట్లు కట్టేసి వదిలేశారని, కాంట్రాక్టర్లకు డబ్బులు కూడా ఇవ్వలేదని అన్నారు. సిబ్బంది అవసరం ఉన్నచోట తప్పకుండా ఏర్పాటు చేస్తామని, ఎక్కడ అవసరం ఉన్నా పార్టీలకతీతంగా అందిస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

**నో ఎల్ఆర్ఎస్ నో కాంగ్రెస్ రాకుండా చూసుకోండి: హరీష్‌రావు** : నో ఎల్ఆర్ఎస్ నో కాంగ్రెస్ అనే పరిస్థితి వస్తుందని సభలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో పట్టణ ప్రగతి కింద నెలనెలా మున్సిపాలిటీలకు డబ్బులిచ్చేవాళ్లమని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పట్టణ ప్రగతి నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఆనాడేమో కాంగ్రెస్ వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ అన్నారని, ఇప్పుడేమో డబ్బులు కట్టాల్సిందేనని ప్రజల వద్ద వసూలు చేస్తున్నారని విమర్శించారు. నో ఎల్ఆర్ఎస్ నో కాంగ్రెస్ అనే పరిస్థితి వస్తుందని, తమ ప్రభుత్వం వచ్చినప్పుడు ఎల్ఆర్ఎస్ జీవో తెచ్చామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నిధులు ఖర్చు పెడతామని చెప్పామని, ఎల్ఆర్ఎస్ ద్వారా ఎంత డబ్బు వచ్చిందో, మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంత ఇచ్చారో చెప్పాలని కోరారు. వచ్చిన డబ్బు ఎంత..పట్టణాభివృద్ధి సంస్థలకు ఎప్పటిలోగా ఇస్తారో చెప్పాలన్నారు. రాష్ట్రం ప్రభుత్వం నుంచి పైసా కూడా మున్సిపాలిటీలకు ఇవ్వట్లేదని, కనీసం ప్రజలు కట్టిన డబ్బును ఆయా మున్సిపాలిటీలకు ఎప్పటిలోగా చెల్లిస్తారో చెప్పాలన్నారు. కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడం కాదని, ఉన్న వాటికి ఏం చేస్తున్నారో కూడా ఆలోచించాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

**42 శాతం రిజర్వేషన్లు విప్లవాత్మకమైన ముందడుగు: కూనంనేని** : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అనేది విప్లవాత్మకమైన ముందడుగు అని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 9వ షెడ్యూల్‌లో చేర్చకపోతే బిల్లు అవ్వదని అంటున్నారని, సంపూర్ణ మద్దతిస్తున్నామంటూనే 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు కలిసి పోరాటం చేస్తామని ఎందుకు చెప్పట్లేదని కూనంనేని పేర్కొన్నారు. జయలలిత పోరాటం చేయడం వల్లే రిజర్వేషన్లకు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు అంగీకరించారని గుర్తు చేశారు.

**ఆరోగ్య శాఖలో ఖాళీలు భర్తీ చేసేందుకు చర్యలు: మంత్రి దామోదర రాజనరసింహ** : ఆరోగ్య శాఖలో ఖాళీలు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ స్పష్టం చేశారు. ఆదివారం శాసనసభలో తెలంగాణ అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ బిల్లును ఆయన ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆరోగ్య శ్రీ కింద ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగులకు వైద్యం అందించడంలేదని ఆరోపించారు. ఫీల్డ్ విజిట్ ఫీవర్ విజిట్ చేసుఉన్నత్న ఆశా వర్కర్లకు జీతాలు పెంచడంలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కోరుట్లలో వంద పడకల ఆసుపత్రి ఉన్నా సిబ్బంది లేక ఖాళీగా ఉందని, జనగాంలో సిటి స్కాన్ మిషన్ వచ్చి 3 నెలలైనా ఇన్‌స్టాల్ చేయలేదని చెప్పారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ మాట్లాడుతూ రోగులు ఆరోగ్య పరిస్థితి విషమించిన సమయంలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చనిపోతే సకాలంలో వైద్యం అందించక చనిపోయారంటూ వైద్యులపై వారి బంధువుల దాడులు చేయకుండా ఈ చట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

అలాగే కాగజ్ నగర్ సిహెచ్‌సిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 6 నుంచి 8 నెలలుగా జీతాలు ఇవ్వక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని జీతాలు ఇచ్చేలా చూడాలని కోరారు. దీనిపై మంత్రి దామోదర రాజనరసింహ సమాధానమిస్తూ మానవ వనరులను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని, 6 నుంచి 7 విడతలుగా పెండింగ్ బిల్లులను చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సమాధానమిచ్చారు. ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వారికి హామీ ఇచ్చారు.

# దేశంలో అతిపెద్ద మానవ తప్పిదం కాళేశ్వరం ప్రాజెక్టు

- **కాళేశ్వరానికి కర్త, కర్మ, క్రియ కెసిఆరే**
- **డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా పనులు**
- **సిడబ్ల్యుసి అనుమతి లేకుండానే నిర్మాణం**
- **అధికారులు హెచ్చరించినా కెసిఆర్ వినలేదు**
- **కేబినెట్ అనుమతి లేకుండానే నిర్మాణానికి జిఓ**
- **కెసిఆర్‌పై చర్యలు తీసుకునే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉంది**
- **అసెంబ్లిలో మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యలు**
- **నీళ్లు, డబ్బులు పోయాయి : భట్టి**



హైదరాబాద్: సిడబ్ల్యుసి అనుమతి లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని ఈ విషయాన్ని పిసి ఘోష్ కమిషన్ తన నివేదికలో పేర్కొందని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దీనికి కర్త, కర్మ, క్రియ మాజీ సిఎం కెసిఆర్ అని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం అసెంబ్లీలో పిసి ఘోష్ కమిషన్ నివేదికపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి లఘు చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద మానవ తప్పిదం కాళేశ్వరం నిర్మాణమని, అధికారులు హెచ్చరించినా ఆనాడు కెసిఆర్ వినలేదని మంత్రి ఉత్తమ్ సభకు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద మ్యాన్ మేడ్ డిజాస్టర్ అని ఆయన అన్నారు. మేడిగడ్డ నిర్మాణం మాజీ సిఎం కెసిఆర్‌ది వ్యక్తిగత నిర్ణయమని ఆయన తెలిపారు. అప్పటి కేబినెట్ అనుమతి లేకుండానే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి జీఓ ఇచ్చారని మంత్రి ఉత్తమ్‌కుమార్ ఆరోపించారు.

కాళేశ్వరం కోసం రూ.87,449 కోట్లకు పైగా ఖర్చు చేశారని, తీరా ఇప్పుడు చూస్తే ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి మేడిగడ్డ ప్రాజెక్టు కూలిపోయిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. రూ.21 వేల కోట్లతో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు కట్టారని ప్రస్తుతం ఆ బ్యారేజీలు నిరుపయోగంగా మారాయ న్నారు. 20 నెలల నుంచి అవి నిరుపయోగంగా ఉండటం చాలా బాధాకరమైన విషయమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మూడు బ్యారేజీల టెండర్‌ల విధానంలోనూ నిబంధనలు ఉల్లంఘించారని నివేదికలో కమిషన్ సూచించిందని ఆయన ఆరోపించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కట్టాలని 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని, వాప్కోస్ రిపోర్ట్ కంటే ముందే మేడిగడ్డ దగ్గర బ్యారేజీ కట్టాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. 2014లో హైడ్రాలజీ క్లియరెన్స్ సైతం వచ్చిందని మంత్రి తెలిపారు. ప్రాణహిత చేవెళ్లపై 2014 నాటికే రూ.11 వేల 600 కోట్లు ఖర్చు పెట్టామని, ప్రాణహిత ప్రాజెక్టు అంచనా రూ.38 వేల 500 కోట్లు అయితే కాళేశ్వరం పూర్తి చేయడానికి రూ.లక్షా 27 వేల కోట్లు ఖర్చు చేశారని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు.

రూ.38 వేల 500 కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత చేవెళ్లను అకారణంగా రీజన్ లేకుండానే కెసిఆర్ ప్రాజెక్టు డిజైన్‌ను మార్చి దానిని లక్షా 47 వేల కోట్ల రూపాయలకు పెంచారని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. అప్పటి సిఎం అహోదా లో కెసిఆర్ ఇంజనీర్‌లా వ్యవహరించి టెక్నికల్ అంశాల్లో జోక్యం చేసుకున్నారని ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఏడాదికి 195 టిఎంసిల నీటిని ఎత్తివేస్తామని

బిఆర్ఎస్ చెప్పిందని, ఐదేళ్లలో మొత్తం 125 టిఎంసీలను మాత్రమే లిఫ్ట్ చేశారని, అందులో 35 టిఎంసీలను మళ్లీ సముద్రంలోకి వదిలేశారని ఆయన తెలిపారు. లక్షకు పైగా కోట్లు ఖర్చు చేసి కట్టిన ప్రాజెక్టులో అతి తక్కువ కాలంలోనే ఆరు పిల్లర్లు కూలిపోవడం దారుణమని మంత్రి ఉత్తమ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

సరైన ప్రణాళికలు లేకుండానే మేడిగడ్డ చేపట్టారని కమిషన్ రిపోర్ట్ ఇచ్చిందని, భూగర్భ జలాలు దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టు కట్టలేదని తేల్చిందని మంత్రి పేర్కొన్నారు. ఈ మూడు ప్రాజెక్టుల్లో సరైన నిర్వహణ లేదని, నిర్లక్ష్యంగా,అక్రమంగా, అసంబద్ధంగా ఈ ప్రాజెక్టు కట్టారని కమిషన్ తన నివేదికలో తెలిపిందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ప్లానింగ్ డిజైనింగ్‌లో మెయింటనెన్స్‌లో విఫలం అయ్యిందని కమిషన్ తన నివేదికలో పేర్కొందన్నారు.

ఏయే నేతలు, అధికారులు ఈ ప్రాజెక్టుల్లో బాధ్యులో కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. అందుకే 600 పేజీల పిసి ఘోష్ కమిషన్‌ను నివేదికను సభ ముందుంచామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వైఫల్యంలో ఇంజనీర్లు, ఐఏఎస్‌లతో పాటు నీటిపారుదల శాఖ, ఆర్థికశాఖ మంత్రులు కూడా బాధ్యులేనని నివేదికలో కమిషన్ తెలిపిందన్నారు.

**చర్య తీసుకునే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉంది** : కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదని, ప్రాజెక్టులో రాజకీయ జోక్యం, నిర్లక్ష్యం ఉందని ఆయన తెలిపారు. రూల్స్‌కు విరుద్ధంగా నిర్మాణాలకు బడ్జెట్ రిలీజ్ చేశారని, ప్రాజెక్ట్ అంచనా వ్యయం పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్‌పై చట్ట ప్రకారం తగిన చర్య తీసుకునే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు.

**డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేదు** : సభ్యుల అభిప్రాయం తీసుకున్నాకే సిఎం రేవంత్‌రెడ్డి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తారని మంత్రి తెలిపారు. సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఇచ్చిన నివేదికను కాంగ్రెస్ కమిషన్ అని ఎలా అంటారని మంత్రి ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో నివేదిక ప్రవేశపెట్టకుండా చూడాలని కోర్టుకు వెళ్లింది ఎవరని మంత్రి ఉత్తమ్ ప్రశ్నించారు. ఎన్‌డిఎస్ఏపై బిఆర్ఎస్ నేతలు ఇష్టం వచ్చి మాట్లాడుతున్నారని, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ బిల్లు తెచ్చినప్పుడు బిఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా పనులు చేశారని ఎన్‌డిఎస్ఏ నివేదికలో ఉందని మంత్రి పేర్కొన్నారు.

# బీసీలకు సముచిత స్థానం కల్పించాం: కెటిఆర్



హైదరాబాద్: బీసీలకు బీఆర్ఎస్ పార్టీ స్పీకర్, కౌన్సిల్ చైర్మన్ పదవులను ఇచ్చిందని.. బీసీని మొదటి అడ్వొకేట్ జనరల్ గా చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని కెటిఆర్ అన్నారు. తమ పార్టీలో 3 ప్రొటోకాల్ పొజిషన్లను బీసీలకే ఇచ్చామని స్పష్టం చేశారు. చట్టసభల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానం చేశామని పేర్కొన్నారు. శాసనసభలో పంచాయతీ రాజ్ సవరణ బిల్లుపై జరిగిన చర్చలో కెటిఆర్ మాట్లాడారు. బీసీలకు న్యాయం జరగాలంటే రాజ్యాంగ సవరణ జరగాలని, 50 శాతం సీలింగ్ తీసేలా రాజ్యాంగ సవరణ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే నాలుగుసార్లు మాట మార్చారని, సీఎం చిత్తశుద్ధి ఏ స్థాయిలో ఉందో ప్రజలు గమనిస్తూనే ఉన్నారని కెటిఆర్ అన్నారు. బీసీ సబ్ ప్లాన్ చట్టంపై చర్చ జరిపేందుకు సభ నిర్వహించాలని కేటీఆర్ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కోరారు. దీనికి స్పందించిన పొన్నం ప్రభాకర్ ఖచ్చితంగా ఒకరోజు దీనిపై చర్చిస్తామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ బిల్లులో ఏ లోపాలున్నా, ఎలాంటి సూచనలున్నా చెప్పాలని కోరారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై రాష్ట్రవ్యాప్తంగా సర్వే జరిగినపుడు కేటీఆర్ కూడా పాల్గొని ఉంటే బాగుండేదన్నారు. ఏదేమైనా ఈ బిల్లుపై ఏకాభిప్రాయంగా ముందుకు వెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

# వర్షం మిగిల్చిన విధ్వంసం

- కామారెడ్డి జిల్లాలో 77వేల ఎకరాల్లో పంటలకు నష్టం
- కోట్లాది రూపాయల నష్టం
- వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు..మట్టి దిబ్బలు
- 100 గ్రామాలకు ఐదురోజులుగా ఆర్‌టిసి సేవలు నిలిపివేత
- కొట్టుకుపోయిన వంతెనలు, రహదారులు
- 50కి పైగా పాక్షికంగా, పూర్తిగా కూలిపోయిన ఇళ్లు




కామారెడ్డి /ఎల్లారెడ్డి: కామారెడ్డి జిల్లాలో మూడు రోజులపాటు కురిసిన కుంభవృష్టి విధ్వంసం సృష్టించింది. కనీవిని ఎరుగని రీతిలో కురిసిన భారీ వర్షం రైతుల్లో తీవ్ర విషాదం నింపింది. ప్రకృతి చేసిన విలయతాండవానికి ప్రాజెక్టులు, పెద్ద పెద్ద చెరువులు, కుంటలు చిగురుటాకుల వణికిపోయాయి. ఈ వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి వర్షం కోసం మొక్కిన రైతుల కోరికలు తీ ర్చాలనుకున్న వరణుడు కుంభవృష్టి కురిపించా డు. జిల్లాలో 76,984 వేల ఎకరాల్లో పండుతున్న పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులకు అం దిన ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. జిల్లాలో 30కిపైగా చెరువులు కొట్టుకుపోయాయి. మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. వేలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సిన చెరువులు, కుం టలు ఖాళీ అయిపోయాయి. రహదారులు కొట్టుకుపోయి ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించింది. దా దాపు 100 గ్రామాలకు ఐదు రోజులుగా ఆర్‌టిసి సేవలు అందడం లేదు. పలుచోట్ల 30 గంటల పా టు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

60 గంటల పాటు కురిసిన 64 సెంటీమీటర్ల వర్షపాతం రైతులకు, ప్రజలకు, ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల నష్టాన్ని మిగిల్చింది. నియోజకవర్గంలోని ఎల్లారెడ్డి మండలాల్లో 30,450 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖ ఎ ల్లారెడ్డి ఎడిఎ సుధా మాధురి తెలిపారు. గాంధారి, లిం గంపేట, నాగిరెడ్డిపేట, రామారెడ్డి, సదాశివ నగర్, తా డ్వాయి, ఎల్లారెడ్డి మండలాల్లో 18,433 ఎకరాల్లో వరిపంటలు నీట మునిగాయని అన్నారు. 6,541 ఎకరాల్లో మక్క పంట నష్టపోయిందని అన్నారు. 3,791 ఎకరాల్లో పత్తి పంటలకు నష్టం వాటిలిందని అన్నారు. 1,685 ఎకరాల్లో సోయాబీన్ పంటకు వర్షానికి నష్టం కలిగిందని అ న్నారు. పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు కొట్టకుపోవడం వల్ల చెరువుల నుంచి వచ్చే రాళ్లు, రప్పలు, మొరం, ఇసుక పంట పొలాల్లో

మేటలు వేసింది. వీటిని తొలగించాలంటే చాలా ఖర్చుతో కూడిన పని అని రైతులు వాపోతున్నారు.

ఒకవైపు కొట్టుకుపోయిన పంటలతో కన్నీరు కారుస్తున్న రైతన్నలకు గోరుచుట్టుపై రోకలిపోటులా ఇసుక మేటలు మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కో ట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న పం టలు పొట్టదశలో ఉండగా నీట మునగడం , కొట్టుకుపోవడం వంటి పరిణామాలతో రైతులు కన్నీరు కారుస్తున్నా రు. నియోజకవర్గంలోని రైతులకు ఇది కోలుకోలేని దెబ్బ అని పేర్కొంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు. నియోజకవర్గం లో దా దాపు పదికి పైగా చెరువుల కట్టలు తెగిపోవడంతో రైతు లు నష్టాల పాలయ్యారు. ఎల్లారెడ్డి మండలంలో తిమ్మాపూర్, లక్ష్మాపూర్ చెరువులు తెగిపోవడంతో పాటు తాటివాని మత్తడి కట్ట కూతకు గురైంది మొత్తం నీరు ఖాళీ అయింది. నాగిరెడ్డిపేట మండలంలో నాగిరెడ్డిపేట పటేల్ చెరువు, అక్కంపల్లి రెడ్డి కుంట తెగిపోయింది. రాజంపేట మండలంలో రాజంపేట దేవుని చెరువు, ఎల్లారెడ్డిపల్లి, కొండాపూర్, గుండారం చిన్నచెరువు, మొండివాగు భారీ వర్షానికి కొట్టుకుపోయాయి. తాడ్వాయి మండలంలోని దేమే పెద్ద చెరువు, లింగంపేట్ మండలంలో మల్లాపూర్ చెరువు, కన్నపూర్ చౌదరి చెరువు కట్టలు తెగిపోయాయి. పలు చెరువుల మట్టి కట్టలు తెగిపోయాయి. భారీ వర్షాలకు రాజంపేట మండలం,ఎల్లాపూర్, నడిపి, బెస్త మామిడి, షేర్‌శంకర్, గుడి, ఇనం తండాలు దాదాపు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.

**కోతకు గురైన రహదారులు** : నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు వెళ్లే రహదారులు భారీ వర్షానికి కోత గురికావడం, కొట్టుకుపోవడంతో కొ న్ని గ్రామాలకు నాలుగు రోజుల పాటు రాకపోకలు స్తం భించాయి. ఎల్లారెడ్డి మండలంలో తిమ్మారెడ్డి, రుద్రారం, మల్కాపూర్ మతమాల, అల్మాజిపూర్, జంగమయ్యపల్లి, బ్రాహ్మణపల్లి, అడవి లింగాల, వెల్లుట్ల, వెల్లుట్ల పేట, అ న్నా సాగర్ గ్రామాలకు మూడు రోజులపాటు రాకపోక ల బంద్ అయ్యాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వె ళ్లే దారిలో, జిల్లా కేంద్రానికి వెళ్లే దారుల్లో ప్రధాన రహదారులు కోతగురి కావడంతో ఐదు రోజులుగా రెండు పట్టణాలకు ఎల్లారెడ్డి నుంచి రాకపోకలు బంద్ అయ్యాయి. రాజంపేట మండలంలో కొండాపూర్‌వగుండారం రహదారులకు రాకపోకలు నిలిచిపోయాయి. సదాశివనగర్ మండలంలో పద్మావతి వాడి, కలవరాలు, తిరుమల్ పల్లి , రామారెడ్డి, అమరబండ, ధర్మారావుపేట వెళ్లే రహదారులు కోతకు గురయ్యాయి. నాగిరెడ్డిపేట మండలంలో హైదరాబాద్ వెళ్లే రహదారులు రెండు బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. లింగంపేట మండలంలో లింగంపల్లి బ్రిడ్జి, కొర్కోల్ బ్రిడ్జి, కన్నాపూర్, పోల్కంపేట్, నాగారం రహదారులు కొట్టుకుపోయాయి.

**వర్షానికి కూలిపోయిన ఇళ్లు** : నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో వర్షానికి ప లువురి ఇళ్లు కూలిపోగా, కొన్ని పాక్షికంగా దెబ్బతిన్నా యి. గాంధారి మండలంలో ఆరు గృహాలు పూర్తిగా కూలిపోయాయి. సదాశివనగర్ మండలంలో ఏడు ఇండ్లు కూ లిపోయాయి. ఎల్లారెడ్డి మండలంలో పది ఇళ్లు కూలిపోయాయి. తాడ్వాయి మండలంలో రెండు, నాగిరెడ్డిపేట్ మండలంలో 8, రామారెడ్డి మండలంలో 10, లింగంపే ట మండలంలో 10 ఇళ్లు కూలిపోయినట్లు సమాచారం. ఇల్లు కూలిపోయిన పలువురు నిరాశ్రయులయ్యారు. ప్ర భుత్వమే ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. భారీ వర్షం వల్ల తమకు నిలువ నీడ లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. రెండు పౌల్ట్రీ ఫారా లు కొట్టుకుపోవడంతో ఆ యజమానులకు దాదాపు రూ.40 లక్షల నష్టం వాటినట్లు పౌల్ట్రీ ఫాంల యజమానులు పేర్కొంటున్నారు.

**కొట్టుకుపోయిన 'కళ్యాణి' మట్టి గట్లు** : పోచారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు పోటెత్తిం ది. నూట మూడు సంవత్సరాల ప్రాజెక్టు చరిత్రలో మొట్టమొదటిసారి ప్రాజెక్టు పైనుంచి 1,81 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించింది. ప్రాజెక్టు ఎగువ భాగం నుంచి 70 వేల క్యూసెక్కుల నీటిని తట్టుకునే సామర్థ్యం మాత్రమే ఉందని అధికారులు పేర్కొంటున్నారు. నిజాం కాలంలో నిర్మించిన ఈ ప్రాజెక్టు 100 సంవత్సరాలు దాటిన సామ ర్థ్యం కంటే రెండున్నర ఇంతలు నీరు వెళ్లిన తట్టుకొని నిలబడగలిగింది. ప్రాజెక్టు కట్ట వద్ద మట్టి కోతకు గురై గుంత ఏర్పడగా అధికారులు, పజలు ఆందోళన చెందారు. కానీ భారీ వర్షానికి సైతం ప్రాజెక్టు తట్టుకొని నిలబడింది. ఎ ల్లారెడ్డి మండలంలోని కళ్యాణి ప్రాజెక్టు గేట్ల సామర్థ్యం 19 క్యూసెక్కులుగా అధికారులు పేర్కొనగా, 30 వేలకు పైగా క్యూసెక్కుల నీరు వచ్చిందని పేర్కొంటుండగా, ప్రా జెక్టుకు ఇరువైపులా మట్టి అడ్డుకట్ట కొట్టుకుపోయింది.

**వందకు పైగా గ్రామాలకు లేని ఆర్‌టిసి సేవలు** : నియోజకవర్గంలోని వందకు పైగా గ్రామాలకు ఆర్‌టిసి బస్సుల సేవలు అందడం లేదు. ఎల్లారెడ్డి, కామారెడ్డి రహదారి పలుచోట్ల కోత గురికావడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. ఎల్లారెడ్డి, హైదరాబాద్ రహదారి కోతకు గురైంది. ఈ రహదారుల్లో ఉన్న 100కు పైగా గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎల్లారెడ్డి, బాన్సువాడ రహదారిలో సైతం పలుచోట్ల రహదారి కోత గురికావడంతో కొన్ని బస్సులను పిట్లం మీదుగా నడిపిస్తున్నారు. గత నాలుగు రోజులుగా బస్సులు రాకపోవడంతో ప్రజాజీవనం చాలాచోట్ల స్తంభించింది. దాదాపు నియోజకవర్గంలో 30 గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినా సిబ్బంది అహర్నిశలు కష్టపడి పునరుద్ధరించారు. ఏదేమైనా నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షంతో రైతులు ప్రజలు చాలా నష్టాలకు గురయ్యారు.

# KYC అప్‌డేట్ చేయించండి

## బ్యాంక్ ఖాతాని క్రియాశీలంగా (ఆక్టివ్‌లో) ఉంచుకోండి.

## మీ సమీపంలోని
## గ్రామ పంచాయతి యొక్క క్యాంప్‌కి వెళ్ళండి

***1 జూలై నుండి***
***30 సెప్టెంబర్ 2025 వరకు***



## KYC అప్‌డేట్ కోసం కావల్సిన పత్రాలు

- మీ పేరులో గానీ చిరునామలో గాని ఎలాంటి మార్పులు ఉండకపోతే - ఆ విషయం స్వీయ ప్రకటన ద్వారా చెపితే చాలు.
- పేరులో గాని లేదా చిరునామలో గానీ మార్పు జరిగి ఉంటే మాత్రం - అప్‌డేట్ సంబంధిత సమాచారంతో కూడిన ఏదైనా ఒక పత్రం :
  ఆధార్ / ఓటరు గుర్తింపు కార్డు / NREGA జాబ్ కార్డ్ / డ్రైవింగ్ లైసెన్స్ / పాస్‌పోర్ట్ /
  జాతీయ జనాభా రిజిస్టరు ద్వారా జారీ చేయబడిన పత్రం



**మీకు దగ్గరలోని బ్యాంక్ శాఖ కి వెళ్ళి కూడా మీ KYC అప్‌డేట్ చేసుకోవచ్చు.**

మరిన్ని వివరాల కొరకు https://rbikehtahai.rbi.org.in/KYC సందర్శించండి
మీ అభిప్రాయం తెలుపుటకు rbikehtahai@rbi.org.inకి వ్రాయండి

జనహితార్థం జారీ చేయునది
భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in




Printed, Published & Owned by VISHWANADHULA NARASIMHA CHARY Printed at NIKHITHA PRINTERS H.NO. 10-115, Vishwa Brahmana Street, Village and Mandal : Chandur, Dist : Nalgonda. TG Published at H.NO. 10-115, Vishwa Brahmana Street, Village and Mandal : Chandur, Dist : Nalgonda. TG Editor : VISHWANADHULA NARASIMHA CHARY RNI. No. APTEL/2012/42406 Cell: 9533243339